www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 267 | ఆదివారం | 18 మార్చి, 2018
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + 36 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



నేటి 'హరివిల్లు'కు బదులుగా ఉగాది పంచాంగం ప్రత్యేక సంచికను అందుకోండి

ఉగాది శుభాకాంక్షలు

పత్రికకు సెలవు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు శ్రీ విళంబినామ ఉగాది శుభాకాంక్షలు.
ఆదివారం 'మన తెలంగాణ' కార్యాలయానికి సెలవు. తిరిగి మంగళవారం మీ ముంగిట.
- ఎడిటర్

ముహూర్తం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం
తిథి : శుక్ల. పాడ్యమి రా.6.23 వరకు
నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.8.10 వరకు
వర్జ్యం: ఉ.7.02 వరకు
దుర్ముహూర్తం : సా.4.29 - 5.17 వరకు
రాహుకాలం: సా.4.30 - 6.00 వరకు
యమగండం: ప.12.00 - 1.30 వరకు
శుభసమయాలు: ఉ.8.11 - 10.34 వరకు తిరిగి, ప.2.10 - 3.44 వరకు
క్రయవిక్రయాలు, అగ్రిమెంట్లు, ఆర్థిక లావాదేవీలు.

ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారుల మృత్యువాత 6

నల్లగొండ జిల్లాలో విషాదం



శనివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ నరసింహన్ దంపతులు, సీఎం కెసిఆర్, మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు, ప్రముఖులు, ఉన్నతాధికారులు 7లో



19న కోల్‌కతాకు కెసిఆర్

ఫ్రంట్‌పై పశ్చిమ బెంగాల్ సిఎం మమతతో మంతనాలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ఫెడరల్ ఫ్రంట్ ప్రకటనతో జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించిన టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, ఆ దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తాను ఫ్రంట్‌పై ప్రకటన చేసిన వెంటనే మొట్టమొదట ఫోన్‌లో మద్దతు ప్రకటించిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని తరువాయి 6లో

అన్ని భూములకూ పెట్టుబడి

సాగుయోగ్యం కాని భూములకు ఎకరాకు రూ.4 వేల సాయం వర్తింపు

రైతుల కోరిక మేరకు సిఎం కెసిఆర్ సూత్రప్రాయ నిర్ణయం

గుట్టలు, చెట్లు ఉన్న భూముల సర్వే తాత్కాలికంగా నిలిపివేత

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయానికి యోగ్యం కాని భూములకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వ్యవసాయ పెట్టుబడి (రైతులక్ష్మి) పథకాన్ని వర్తింపజేయనుంది. ఈ మేరకు సిఎం కె.చంద్రశేఖర్‌రావు అధికారులను సూత్రప్రాయంగా ఆదేశించినట్లు సమాచారం. భూరికార్డుల ప్రక్షాళనలో ఎటువంటి వివాదాలు లేనివి 1.42 కోట్ల ఎకరాలు ఉండగా, 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు తేల్చారు. ఇందులో సాగుకు పనికి రాకుండా గుట్టలు, చెట్లు ఉన్న భూములు కూడా ఉన్నాయి. అయితే వీటికి ఎకరాకు రూ. 4 వేలు పథకాన్ని అమలు చేయ తరువాయి 6లో

మోదేశాడు

మోడీ పాలనలో దేశం చితికి పోయింది

- విద్వేషాలు, అసహనాన్ని రెచ్చగొట్టారు
- దేశాన్ని ముందుకు నడిపించగలిగేది కాంగ్రెస్ ఒక్కటే
- కల్లబొల్లి వాగ్దానాలతో అధికారంలోకి మోడీ
- కాంగ్రెస్ ప్లీనరీ వేదికగా ప్రధానిపై నిప్పులు చెరిగిన రాహుల్, సోనియా
- బ్యాలెట్‌తోనే ఎన్నికలు
- అధికారంలోకి రాగానే రైతు రుణాల మాఫీ
- బిజెపి ఓటమే లక్ష్యంగా లౌకిక శక్తుల ఐక్యతకు తీర్మానం





ఢిల్లీలో జరుగుతున్న కాంగ్రెస్ 84వ ప్లీనరీలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్, అనంతరం సోనియా ప్రసంగం తరువాత ఉద్వేగంగా తల్లిని హత్తుకున్న దృశ్యం

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ పాలనలో దేశం కకావికలం అయిందని, ఈ పాలన నుంచి విముక్తి కోసం ఎదురు చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్‌గాంధీ చెప్పారు. దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లగలిగే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని స్పష్టం చేశారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ 84వ ప్లీనరీ సదస్సులో ప్రారంభోపన్యాసం చేశారు. సోనియాగాంధీ నుంచి అధ్యక్ష పగ్గాలు తీసుకున్న తరువాత రాహుల్ సారథ్యంలో జరిగిన తొలి ప్లీనరీ ఇదే. మోడీ పాలనతో దేశం అన్ని విధాలుగా మోడుపోయిందని, కీలక రంగాలలో ఓడిపోయిందని, ఈ దశలో దేశానికి దిశానిర్దేశం చేసేది కాంగ్రెస్సే అని రాహుల్ తెలిపారు. దేశంలోని అన్ని విలువలకు బిజెపి తూట్లు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్లీనరీని ప్రారంభిస్తూ ఆయన చేసిన సంక్షిప్త ప్రసంగం ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై రాహుల్ తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. సామరస్యపూర్వక దేశంలో ఎన్‌డిఎ విద్వేషాలను, అసహనాన్ని, ఆక్రోశాన్ని రెచ్చగొట్టిందని ఆరోపించారు. ఏదో చేస్తామని గొప్ప వాగ్దానాలతో ముందుకు వచ్చిన మోడీ దేశానికి ఏం చేశారని రాహుల్ ప్రశ్నించారు. ఉద్యోగాల సృష్టిలో విఫలం అయ్యారు. ఆయువుపట్టు వంటి వ్యవసాయ తరువాయి 6లో

రైతు సమన్వయ సమితుల్లో టిఆర్ఎస్ కార్యకర్తలకే ప్రాధాన్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు సమన్వయ సమితిల్లో టిఆర్ఎస్ కార్యకర్తలకే ప్రాధాన్యం ఇచ్చారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ బహిరంగ విమర్శించారు. రైతు సమస్యలపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు శనివారం బహిరంగ లేఖ రాశారు. అసంతృప్తితో రగిలిపోతున్న కార్యకర్తలను దారికి తెచ్చుకునేందుకు కొత్త నాటకానికి తెరలేపారని పేర్కొన్నారు. రాజకీయ నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు సమన్వయ సమితి పేరిట పచ్చని గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. రైతుల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే సర్పంచ్‌లకు మరిన్ని అధికారాలు ఇచ్చి పంచాయతీలను పటిష్టం చేసేవారని, కానీ అందుకు భిన్నంగా పోటీ రాజకీయాలను, ఆధిపత్య ధోరణులను ప్రోత్సహించి ఆ సందులో రాజకీయ లబ్ధి పొందేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు.

మురికివాడల సంగతేమిటి?


- స్థితిగతులుపై నివేదిక కోరిన కేంద్రం
- సర్వేకు సిద్ధమవుతున్న రాష్ట్రం



మన తెలంగాణ/హైదరాబాద్: మురికివాడల స్థితిగతులు, వాటి ప్రస్తుత పరిస్థితులపై మున్సిపల్ శాఖ నివేదికను రూపొందించనుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మురికివాడల పరిస్థి తులపై సర్వే చేపట్టి, వాటి వివరాలను సేకరించనుంది. రాష్ట్రంలో మురికివాడల పరిస్థితులపై తమ కు తాజా నివేదికను అందజేయాలని కేంద్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖకు సూచించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మురికివాడల పరిస్థితులపై పట్టణ పేదరిక నిర్మూలణ సంస్థ(మెప్మా) సర్వే చేపడుతోంది. ప్రధానంగా 2001–2011 సంవత్సరంతో పాటు ప్రస్తుత 2018లో మురికివాడల పరిస్థి తులపై సమగ్ర నివేదికను అందజేయాలని కేంద్రం కోరింది. దీంతో మురికివాడల సర్వేకు మెప్మా ప్రత్యేక నమూనాను రూపొందించింది. ఈ నమూన ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని నిర్ణ యించింది. ఇం దులో ప్రధానంగా అధికారికంగా గుర్తించిన, గుర్తింపు పొందని మురికివాడల పరిస్థితులతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రస్తుత జనాభా, ప్రత్యేక పరిస్థితులపై ఆరా తీయనుంది. రాష్ట్రంలోని 72 స్థానిక సంస్థలలో (జిహెచ్ఎంసి మినహా) సుమారుగా 828 మురికివాడలను అధికారికంగా గుర్తించగా, మరో 632 అధికారికంగా గుర్తించని మురికివాడలతో కలిసి మొత్తంగా సుమారు 1460 ఉన్నాయి. కాగా మురికివాడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయి. తద్వారా ఆ మురికివాడలలో ఎంత మేర అభివృద్ధి జరిగిందనే అంశం కూడా ఈ నివేదిక ద్వారా తెలియనుంది. ప్రధానంగా మురికివాడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు, ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. వీటి ద్వారా స్థానిక సంస్థలకు నిధులను కేటాయిస్తోంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మురికివాడలలలో స్థితిగతులు, వాటి పరిస్థితులలో వచ్చిన మార్పులతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న మురికి వాడల సంఖ్య, తాజా పరిస్థితులపై ఒక స్పష్టత వచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం తాజా నివేదికను కోరినట్లు తెలుస్తోంది. అయితే 2001 లెక్కల నుం చి సమాచారాన్ని సేకరిస్తే వాటి ఆధారంగా మురికివాడలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రభావంపై ఒక అంచనాకు వచ్చేందు కు దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు. మురికివాడల వారి గా జనాభా లెక్కలను కూడా సేకరిస్తున్నారు. మురికివాడల సర్వే ప్రక్రియను మెప్మా త్వరలోనే ముగించి కేంద్రానికి నివేదికను అందజేయనున్నది.

నిలిచి పోయిన భర్తీ ప్రక్రియ

- ఆచార్యుల పోస్టుల భర్తీ మరింత ఆలస్యం
- విభాగాల వారీగా రిజర్వేషన్లు
- అమలు చేయాలంటూ యుజిసి ఆదేశాలు



మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో ఆచార్యుల భర్తీ మరింత ఆలస్యం కానుంది. కేంద్ర, రాష్ట్ర వర్సిటీలు పోస్టుల భర్తీలో భాగాలవారీగా రిజర్వేషన్లు అమలు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యుజిసి) ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. విభాగాల వారీగా రోస్టర్ రూపొందించి నియామకాలు చేపట్టాలని పేర్కొంది. వచ్చే నెలలో 1,061 ఆచార్యుల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చేందుకు వర్సిటీలు సిద్ధమవుతున్న నేపథ్యంలో తాజాగా యుజిసి సర్క్యులర్ జారీ చేయడంతో నియామకాలలో జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పోస్టుల భర్తీలో భాగంగా పాత విధానం ప్రకారం యూనివర్సిటీని యూనిట్‌గా తీసుకుని ఆయా వర్సిటీలు రోసర్ సిద్ధం చేస్తున్నారు. ఇంతలోనే యుజిసి ఆదేశాలు రావడంతో ఆ ప్రక్రియ నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ తాజా ఆదేశాలు ప్రస్తుత నియామకాలకు వర్తిస్తాయా..? లేదా..? అనే అంశంపై వర్సిటీలకు స్పష్టత లేదు. ఈ విషయంపై స్పష్టత కోరుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి యుజిసికి లేఖ రాసింది. రిజర్వేషన్ల అమలుపై యుజిసి నుంచి స్పష్టత వచ్చిన తర్వాత పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఆచార్యుల భర్తీ పూర్తికావడంపై సంబంధిత వర్గాలు సందేహపడుతున్నాయి.

రోస్టర్ రూపొందించడంలో అలసత్వం : రాష్ట్ర వర్సిటీలలో మొదటి దశలో 1,061 ఖాళీలు భర్తీకి ప్రభుత్వం ఆరు నెలల క్రితమే ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు కొన్ని విశ్వవిద్యాలయాలు పాలకమండళ్ల ఆమోదం ప్రక్రియను కూడా పూర్తి చేయలేదు. అది పూర్తయిన తర్వాత సంబంధిత శాఖలకు పంపి రోస్టర్ పాయింట్లకు ఆమోదం పొందాలి. నియామకాలపై వర్సిటీల అలసత్వ వైఖరి ఇప్పటివరకు పాత విధానం ప్రకారం కూడా రోస్టర్ సిద్ధం కాలేదు. ఇప్పుడు విభాగాల వారీగా రోస్టర్ సిద్ధం చేసే ప్రక్రియ మరింత సంక్లిష్టమైన ఉండనున్న నేపథ్యంలో యుజిసి తాజా ఆదేశాలకు అనుగుణంగా రోస్టర్ సిద్ధం చేయడానికి ఇంకెన్ని నెలలు పడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

గవర్నర్‌కు ఇచ్చిన హామీ నెరవేరడం కష్టమే : గత ఏడాది అక్టోబర్‌లో రాష్ట్ర యూనివర్సిటీ ఛాన్సలర్, గవర్నర్ ఇఎస్ఎల్ నర్సింహన్ వర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లు, రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు లక్ష్యాలను నిర్ధేశించారు. అందులో భాగంగా వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం లోపు నియామకాలు పూర్తి చేస్తామని విసిలు, గవర్నర్‌కు హామీ ఇచ్చారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ కడియం శ్రీహరి విసిలు, రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించి పోస్టుల భర్తీపై సమీక్షించారు. మరికొన్ని రోజుల్లో గవర్నర్ మరో సారి సమావేశం నిర్వహించబోతున్నారని, అప్పటిలోగా ఆయన నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టుల భర్తీపై వైస్ ఛాన్స్‌లర్లు గవర్నర్‌కు ఇచ్చిన హామీ నెరవేర్చడం కష్టసాధ్యంగానే కనిపిస్తోంది.

బిసిలకు నిధుల కేటాయింపు

- కులవృత్తులపై దృష్టి సారించిన ప్రభుత్వం
- ఎంబిసి కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు




మన తెలంగాణ/హైదరాబాద్: బడ్జెట్‌లో బిసిలకు ఈసారి కేటాయింపులు పెరిగాయి. అం దుకు అనుగుణంగా నిధుల కేటాయింపుల్లో కులవృత్తులపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు కనబడుతోంది. బడ్జెట్‌లో ప్రభుత్వం మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ కు రూ.3 కోట్లు, భట్రాజ్ కో – ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ.2 కోట్లు, వాల్మీకి, బోయ సహకార సంస్థకు రూ. 2 .10 కోట్లు, వడ్డెర సహకార సంస్థకు రూ. 5.45 కోట్లు కేటాయించారు. కృష్ణ బలిజ, పూస ల ఫెడరేషన్‌కు రూ.5 కోట్లు, విశ్వ బ్రాహ్మ ణ సహకార సంస్థకు రూ. 10 కోట్లు, శాలివాహన కో– ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.8 కోట్లు కేటాయించారు. గీతాకార్మికుల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.10 కోట్లు, సంచాల జాతుల ఫెడరేషన్‌కు రూ. 10 కోట్లు, ఉప్పర కొ ఆపరేటివ్ సొసైటీకి రూ. 10 కోట్లు, రజక సహకార సంఘాల సమాఖ్యకు రూ. 84.30 లక్షలు కేటాయించారు. ఈ నిధులన్నింటిని ప్రభుత్వం గ్రాంటుగా అందజేయనుంది. గత సంవత్సరం తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబిసి) కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. అయితే ఎంబిసిలలో ఏయే కులాలు వస్తాయో స్పష్టం చేయక పోవడంతో ఆ నిధులు వినియోగించలేదు. మరో రెండు వారాల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంలో ఎంబిసి కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులను విడుదల చేసి ఖర్చు చేయాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ ఏడాది కూడా ప్రభు త్వం ఎంబిసి కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్లు కేటాయించింది. బిసి కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కూడా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.5 కోట్లు గ్రాంటు ప్రకటించింది. అయితే కుల వృత్తుల ఫెడరేషన్లకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని బిసి నేతలు డిమాండ్ చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు జరుగాలనే డిమాండ్ వస్తోంది. ప్రభుత్వం కేటాయించిన గ్రాంటు నిధులు నామమాత్రంగా ఉన్నందున నిరుద్యోగ విద్యావంతులకు స్వయం ఉపాధి పథకాల కింద సబ్సిడీ రుణాలు అందజేయడానికి నిధులు ఏ మాత్రం సరిపోవని అంటున్నారు. అడ్వొకేట్ల రాయితీలకు మాత్రం ఈ సారి బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేవలం రూ.50 లక్షలు మాత్రమే కేటాయించారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకాలకు గత ఏడాది రూ.25 లక్షలు ఉన్న బడ్జెట్‌ను ఈ సారి కోటి రూపాయలకు పెంచారు. అయితే కొన్ని ఫెడరేషన్లకు మాత్రమే నామమాత్రంగా నిధులు ఇచ్చారనే విమర్శలు బిసి సంఘాల నుండి వస్తున్నాయి. గతంలో ఏ మాత్రం కేటాయింపులు లేని సహకార సంస్థలకు కొద్ది మొత్తంలో అయినా నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు.


అందరికీ గ్యాస్ కనెక్షన్లు!

- మంత్రి ఈటల రాజేందర్

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఏ ఒక్క ఆడ బిడ్డా కట్టెల మీద, పిడకల పొయ్యి మీద వండుకునే పరిస్థితి వద్దని మొదటి బడ్జెట్‌లోనే రూ.150 కోట్ల నిధులు కేటాయించామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నా రు. బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో జరిగిన తెలంగాణ ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్స్ మీట్–2018 సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో దీపం కనెక్షన్ల కోసం జోరుగా పైరవీలు జరిగేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం లో కుటుంబాల కంటే అధికంగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, అయినా కొంతమంది గ్యాస్ లేదని వస్తున్నారని, వారందరికీ గ్యాస్ కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. 2018లో గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండకూడదని, అందుకు సహకరించాలని గ్యాస్ డీలర్లను కోరారు. గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లు తక్కువ బరువు రాకుండా చూడాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సరఫరా పెంచాలని సూచించారు. వ్యాపారం చేసే వాళ్లు ఆత్మగౌరవంతో బతకాలని, తప్పుడు చేసి చేతులు కట్టుకుని నిలబడవద్దన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ స్కీం వచ్చిన తర్వాత అక్రమాలు చాలా వరకు తగ్గాయని అన్నారు. పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్ పాల్గొన్నారు.

పెరుగుతున్న గుడ్లు.. మాంసం ఉత్పత్తి





మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి గుడ్లు, మాంసం, పాల ఉత్పత్తి పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక సర్వే– 2018 ఈ వివరాలను వెల్లడించింది. 2015–16లో 44.42 లక్షల టన్నులుగా ఉన్న పాల ఉత్పత్తి, 2015–16లో 46.81 లక్షలకు చేరింది. ఇక 2017–18 అక్టోబర్ వరకు 28.94 లక్షల టన్నులు వచ్చినట్లు నివేదించారు. అలాగే మాంసంలోనూ పెరుగుదల ఉంది. 2015–16లో 1121 కోట్ల గుడ్లు ఉత్పత్తి కాగా, 2016 –17లో 1181.86 కోట్లు, 2017– అక్టోబర్ వరకు 718.31 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయినట్లు పేర్కొన్నారు. మాసం కూడా 5.42 లక్షల టన్నుల నుంచి 5.97 లక్షల టన్నులకు పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేయడంతో ఈ ఆర్థిక సంవత్సరానికి ఇది మరింతగా పెరుగుందని అంచనా.



నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్ : నకిలీ, అనుమతి లేని విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా అణగదొక్కుతామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి అన్నారు. నకిలీ విత్తనాల మూలల మీదే దాడి చేసి ఎన్‌ఫోర్స్ మెంట్ టాస్క్‌ఫోర్స్ వాటిని నిరోధించాల్సి ఉందన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు త్వరలోనే యాక్షన్ ప్లాన్ తయారుచేసి అమలు చేయనున్నట్లు తెలిపారు. నకిలీ, అనుమతి లేని బిజీ–3 పత్తి విత్తనాలను నిరోధించే విషయమై హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో శనివారం టాస్క్‌ఫోర్స్ టీమ్‌లోని పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో ఇన్‌స్పెక్టర్ జనరల్ వై. నాగిరెడ్డి, వ్యవసాయ శాఖ, ముఖ్యకార్యదర్శి అవగాహన సదస్సు నిర్వహించారు. రెక్టిఫై, నాన్ రెక్టిఫై కింద దాడులు చేయాలని, ఈ క్రమంలో నాణ్యమైన విత్తనోత్పత్తి, సరఫరాదారులను భయభ్రాంతులకు గురిచేయరాదని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఐజి నాగిరెడ్డి అన్నారు. నకిలీలు పట్టుబడినపుడు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు రావడం లేదని, ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నందున అధికారులు కూడా ఆ దిశగా పనిచేయాలన్నారు. ప్రతి జిల్లాలోనూ పోలీసు అధికారులు నోడల్ ఆఫీసర్లు ఉండనున్నరాని తెలిపారు. విత్తన చట్టం మరింత పటిష్టంగా ఉండే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం. జగన్‌మోహన్‌లు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు గవర్నర్ ఉగాది శుభాకాంక్షలు

మనతెలంగాణ/హైదరాబాద్ : తెలుగు ప్రజలకు గవర్నర్ ఇఎస్ఎల్ నర్సింహన్ శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పర్వదిగాన్ని ప్రజలంతా ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. శ్రీ విళంబి నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగు నింపాలని కోరుకుంటున్నానని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో 'పౌరహక్కుల' మహాసభలు

మనతెలంగాణ/హైదరాబాద్: పౌరహక్కుల సం ఘం తెంలగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు ఏప్రిల్ 7,8 తేదీలలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మ ణ్ తెలిపారు. ఈ సభలను విజయవంతం చేయాలని ప్రజలు, ప్రజాస్వామిక వాదులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పౌరహక్కుల సంఘం తమ భవిష్యత్తు నిర్మాణాన్ని, కార్యాచరణను రూపొందించుకోవడానికి ఈ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వక్ఫ్ భూముల రక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ

- **డిప్యూటీ సిఎం మహమూద్ అలీ**

మన తెలంగాణ / హైదరాబాద్ :వక్ఫ్ భూములను సంరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. అందులో భాగంగా భూ రికార్డుల ప్రక్షాళనలో వక్ఫ్ భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. శనివారం హజ్‌హౌస్‌లో మసీదుల మరమ్మత్తులకు నిధుల అందజేత కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భొంగా హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి మహమూద్ అలీ జిల్లా పరిధిలోని 196 మసీదులలో మరమ్మతుల కోసం మొదటి విడుతగా 50 శాతం నిధులు రూ. 93 లక్షల విలువైన చెక్కులను ఆయా మసీదు కమిటీలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. హోం మంత్రి నాయిని నర్సింహారెరడ్డి మాట్లాడుతూ మనది సెక్యులర్ ప్రభుత్వమని, అన్ని పండుగలను, అందరి సంప్రదాయాలను ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. హజ్ కమిటీ చైర్మన్, మసిఉద్దీన్, మైనారిటీ సంక్షేమ శాఖ సలహాదారు ఎకె ఖాన్, మండలి సభ్యులు మహమ్మద్ సలీం,అమీనుల్ హసన్ జాఫ్రి, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, శాసన సభ్యులు జాఫర్ హుస్సేన్, కౌరసర్ మొహియుద్దీన్, అహ్మద్ పాషా ఖాద్రీ, మౌజం ఖాన్, జి.కిషన్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధికారి ఎండి ఖాసిం, ఇంచార్జి డిఆర్‌ఓ ఆర్డీ ఓ చంద్రకళ పాల్గొన్నారు.

పవర్‌లూమ్ క్లస్టర్లకు 200 ఎకరాలు!



మన తెలంగాణ/హైదరాబాద్ : మహబూబాబాద్ జిల్లాలో వస్త్ర పరిశ్రమ క్లస్టర్ కోసం 200 ఎకరాల భూమి కేటాయించాలని టిఎస్ఐఐసి చైర్మన్ బాలమల్లుకు సూరత్ వలస వెళ్లిన తెలంగాణ చేనేత కార్మికులు, వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ పరిశ్రమ భవన్‌లో శనివారం ఈ మేరకు వారు టిఎస్ఐఐసి చైర్మన్‌ను కలిశారు. 550 మంది చేనేత కార్మిక సభ్యులతో వీరభద్రస్వామి టెక్స్‌టైల్స్ సొసైటిని ఏర్పాటు చేసుకున్నామని, ప్రభుత్వం తరపున తమకు టెక్స్‌టైల్ క్లస్టర్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బాలమల్లు మాట్లాడుతూ సూరత్ వలస కార్మికులు, వస్త్ర పరిశ్రమ యజమానులకు ప్రభుత్వం తప్పకుండా అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తొలి దశలో 1200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు అవుతోందని, నూలు పోగు తయారీ మొదలు కొని రెడీ మేడ్ వస్త్రాల ఉత్పత్తి వరకు ఇక్కడే ఉత్పత్తి చేస్తామన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, ఈ రంగంలో వస్తున్న పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని టెక్స్‌టైల్ పార్కు విస్తరణకు మరో వెయ్యి ఎకరాలు సేకరించాలని సిఎం కెసిఆర్ ఆదేశించారని తెలిపారు. తెలంగాణలో వస్త్ర పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చే సోలాపూర్, బీవండి, సూరత్ కార్మికులు, వస్త్ర పరిశ్రమ యజమానులకు వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థలాలు కేటాయిస్తామన్నారు. డిమాండ్‌ను బట్టి ఇతర జిల్లాల్లోనూ టెక్స్‌టైల్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు రూపొందించామని, ఆమోదం కోసం ప్రస్తుతం అవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. సూరత్‌తో పాటు ఇతర ప్రాంతాల నుండి కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే చిన్న తరహా వస్త్ర పరిశ్రమ వర్గాలకు పారిశ్రామిక సబ్సిడీలు, ప్రొత్సహకాలు, ఇతర రాయితీలు ప్రభుత్వం నుండి అందేలా టిఎస్ఐఐసి చూస్తుందని చైర్మన్ బాలమల్లు తెలిపారు.

జనసేన లీగల్ సెల్ పేరు మార్పు

మన తెలంగాణ/హైదరాబాద్ : జనసేన లీగల్ సెల్‌కు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లీగల్ సెల్‌గా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. విజయవాడలోని జనసేన పార్టీ తాత్కాలిక కార్యాలయంలో పలువురు న్యాయవాదులు పవన్ కలిసి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్ ప్రత్యేక హోదాకు చట్టంలో ఉన్న అవకాశాలు ఏమిటి ? న్యాయపరంగా ఎలా పోరాటం చేయవచ్చు అనే అంశాలను పరిశీలించాలని లీగల్ సెల్ ప్రతినిధులకు సూచించారు.

వివిధ పరీక్షలకు తేదీలు ఖరారు

మనతెలంగాణ/హైదరాబాద్:ఏప్రిల్, మే నెలల్లో వివిధ నోటిఫికేషన్లకు నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షల షెడ్యూల్‌ను టిఎస్‌పిఎస్‌సి ఖరారు చేసింది.

నియామకం పేరు	తేదీ
1. మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ గ్రేడ్–1	ఏప్రిల్ 16
2. వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్ట్	ఏప్రిల్ 17
3. వైద్య ఆరోగ్యశాఖలో ఎఎన్ఎం/ఎంపిహెచ్ఎ	ఏప్రిల్ 17
4. హార్టికల్చర్ ఆఫీసర్స్	ఏప్రిల్ 18
5. వైద్య ఆరోగ్య శాఖలో అసిస్టెంట్ లైబ్రేరియర్	ఏప్రిల్ 18
6. గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గ్రేడ్–1	ఏప్రిల్ 18
7. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌లో ఫార్మసిస్	మే 10
8. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్(ఉమెన్) హెల్త్ సూపర్‌వైజర్	మే 10
9. వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2	మే 11
10. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ఫిజియోథెరఫిస్ట్	మే 11
11. రేడియోగ్రాఫర్	మే 11
12. పారామెడికల్ ఆప్తల్మిక్ ఆఫీసర్స్	మే 11

కాళేశ్వరం తొలి గేటు బిగింపు

- **యుద్ధ ప్రాతిపదికన పనులు**
- **అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు ప్రారంభం**
- **80% పూర్తయిన కాంక్రీటు పనులు..**
- **మంత్రి హరీశ్ తనిఖీలు**
- **ఊపందుకున్న విద్యుత్ పనులు**

మనతెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారం, సుండిళ్ళ, మేడిగడ్డ మూడు బ్యారేజీలు, మూడు పంప్ హౌజ్ ల నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. కాళేశ్వరం ప్రాజె క్టు నిర్మాణ ప్రాంతాల్లో శనివారం మంత్రి విస్తృతంగా పర్యటించారు. బ్యారేజీలు, పంప్‌హౌజ్‌ల పనులను ఆయన



తనిఖీ చేశారు. అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. అన్నారం బ్యారేజీకి 66 , మేడిగడ్డకు 86, సుందిళ్ళ బ్యారేజీకి 74 గేట్లను అమర్చాల్సి ఉంది. అన్నారం బ్యారేజికి శనివారం తొలి గేటు బిగించారు. కాళేశ్వరంకు సంబంధించిన బ్యారేజీలు, పంప్ హౌజ్ పనుల్లో 80 శాతం సిమెంటు కాంక్రీటు పనులు పూర్తైనట్లు మంత్రి ప్రకటించారు. మిగతా 20 శాతం పనులు మరో రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నారం కన్నెపల్లి మధ్య గ్రావిటీ కెనాల్ పనులు 70 శాతం పూర్తైనట్లు చెప్పారు. కాళేశ్వరం పనుల పురోగతిపై మంత్రి హరీశ్ రావు కన్నెపల్లి దగ్గర ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ అమేయ కుమార్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వేసవి కాలంలో రాత్రి వేళల్లో పనుల వేగం కోసం అవసరమైన చోట కొందరు ఇంజనీర్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నట్లు తెలిపారు. కన్నేపల్లి, మేడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం పంప్ హౌజ్‌లకు అవసరమైన యంత్రా లు మరో పది రోజుల్లో దిగుమతి కానున్నట్లు చెప్పారు. జపాన్, స్విట్జర్లాండ్ , ఆస్ట్రియా వంటి దేశాల నుంచి ఈ యంత్ర సామాగ్రి రవాణా అవుతున్నట్లు తెలిపారు. కన్నేపల్లిఅన్నారం మధ్య అటవీ ప్రాంతంలో తలపెట్టిన 13.35 కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. మే 31 కల్లా పనులు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు.వానాకాలం నాటికి ఎల్లంపల్లికి నీరు వచ్చేలా పనులు చేస్తున్నట్లు చెప్పారు. జైపూర్‌లోని సింగరేణికి చెందిన పవర్ ప్లాంట్ ద్వారానే ప్రత్యేకంగా మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల పంప్ హౌజ్‌లకు వేర్వేరుగా



విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. 40 మెగావాట్ల సామర్థ్యంతో11మోటార్లకుగాను 440 మెగావాట్ల విద్యు త్తు అవసరం ఉంది. 220/11 కె.వి.సబ్ స్టేషన్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. రూ. 180. 56 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి కానున్నాయి. పెద్దపల్లి జిల్లా గోలివాడ లో జరుగుతున్న సుందిళ్ళ పంప్ హౌజ్ కోసం జైపూర్ పవర్ ప్లాంట్ నుంచి 6 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైను పనులు జరుతున్నాయి. మొత్తం ఎత్తి పోతల పథకాలకు 12,500 మెగావాట్ల విద్యుత్ అవసరం అని అంచనా వేశారు. ఈ మేరకు విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్ కో అన్ని చర్యలు తీసుకుంటున్నది. ఒకే కేంద్రం నుంచి కాకుండా వేర్వేరు జనరేషన్ స్టేషన్ల ద్వారా విద్యుత్ అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కెసిఆర్ కిట్.. సూపర్ హిట్

- **ఆసుపత్రులపై పెరుగుతున్న విశ్వాసం**
- **క్యూ కడుతున్న జనం**
- **రెండు లక్షలకు చేరిన ప్రసవాలు**

మన తెలంగాణ / హైదరాబాద్: కెసిఆర్ కిట్ల పథకంతో ప్రభుత్వాసుప్రతుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిట్ల పథకానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. సర్కారు ఆశించిన దానికంటే పథకం అమలు మరింత సఫలీకృతం కావడంతో అధికారులు మరింత పగడ్భందీగా అమలు చేస్తున్నారు. పథకం వల్ల ప్రభుత్వ ఆసుప్రతులపై ప్రజలకు విశ్వాసం కూడా కలుగుతోంది. దావాఖానాలకు జనం తాకిడి పెరిగింది. కానీ ప్రజల అవసరాలకు తగిన రీతిలో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లా కేంద్రాల్లో మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గిరిజన ప్రజ లు తీవ్ర మైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కిట్ల వల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది.

నేపథ్యమిది...కానుపుల కోసం వచ్చే వారికి అవసరం లేకున్నా ప్రైవేటు ఆసుప్రతులు ఆపరేషన్లకే మొగ్గు చూపుతున్నారు. నార్మల్ డెలివరీల అవకాశం ఉన్నా.... సిజేరియన్లు చేసి అందిన కాడికి దండుకుంటున్నారు. రూ.40వేల రూపాయలకు తక్కువ కాకుండా తీసుకుంటూ సామాన్య, మధ్య తరగతి ప్రజలను పట్టిపీడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కెసిఆర్ కిట్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆసుప్రతుల్లో డెలివరీలకు పెంచేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు తప్పనిసరి అయితే తప్ప అపరేషన్ల జోలికి వెళ్లకూడదనే ఉద్దేశ్యంతో గత ఏడాది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. పథకం కింద మొత్తం రూ.14 వేలను డెలివరికి వచ్చే వారికి అందజేసేలా పథకాన్ని రూపొందించారు. దీని కింద రూ.12వేల నగదుతో పాటు మరో రెండు వేల రూపాయల విలువ చేసే 16 రకాల వస్తువులను అందిస్తు



న్నారు. ఇందులో ప్రధానంగా బేబీ సబ్బు, ఆయిల్, పౌడర్, దోమల నెట్, బొమ్మలు, న్యాప్‌కిన్స్, డైప్యాడ్స్‌తో పాటు బట్టలను పంపిణీ చేస్తున్నారు. ఆడపిల్ల పుడితే మరో వెయ్యి రూపాయలు అదనంగా అందజేస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరం : పథకం అమలు పట్ల గిరిజన తండాల ప్రజలు నుంచి ఆదరణ పెరుగుతున్నా.... ఆశించిన స్థాయిలో వారికి ఆ ఫలాలు అందడం లేదనే ఆరోపణలున్నాయి. ఇందుకు ప్రధాన కారణంగా అత్యావసర పరిస్థితులతో పాటు రాత్రి వేళల్లో ఆయా గ్రామాల్లో వైద్యులు అందుబాటులోకి ఉండకపోవడం దీనికి కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రొత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా... ఆయా ప్రాంతాల్లో పని చేయడానికి డాక్టర్లు సిద్ధం గా లేకపోవడం విచారకరం. ఏదీ ఏమైనా పథకం ఆరంభం నాటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,96,579 ప్రసవాలు జరగాయని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.



ప్రసవాల సంఖ్య రెట్టింపు : కెసిఆర్ కిట్ల పథకం అమలు తర్వాత ప్రభుత్వ ఆసుప్రతుల్లో ప్రసవాల సంఖ్య రెట్టింపైంది. గత ఏడాది జూన్ రెండున ఈ పథకం ప్రారంభమైంది. రాష్ట్రంలో 350 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 102 ఏరియా ఆసుపత్రులతో పాటు ఏడు బోధన ఆసుపత్రులలో పథకం అమలు జరుగుతోంది.

అయితే జిల్లా కేంద్రాలు మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లోని ఆసుప్రతుల్లో ఆశించిన మేరకు సౌకర్యాలు లేకపోవడంతో పాటు జనం తాకిడికి అనుగుణంగా బెడ్లు కూడా ఉండడం లేదు. దీంతో గర్భిణీలు పలు రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటే ఈ పథకం మరింత అద్భుతంగా ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. పథకం అమలకు ఆరు నెలల ముందు ఆరు నెలల ప్రసవాల సంఖ్యను పరిశీలిస్తే రెట్టింపు స్పష్టమవుతుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా లో పథకానికి ఆరు నెలల ముందు వరకు 16,108 డెలివరీలు జరిగితే పథకం అమ లు తర్వాత ఆరు నెలలకు 31, 012 జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ముందు 15,648 జరగ్గా తర్వాత 24,817 ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముం దుగా 6,915 జరిగితే 15,353 ప్రసవాలు జరిగాయి. ఇలా ప్రతి జిల్లాల్లో పథకానికి ముందు కంటే తర్వాత ప్రసవాల సంఖ్య రెట్టింపుగా నమోదు కావడం విశేషం.



జాతీయ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలే కీలకం

మన తెలంగాణ / హైదరాబాద్ : జాతీయ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలదే కీలక భూమిక కానుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ జర్నలిస్టు రాజ్‌దీప్ దేశాయి అభిప్రాయపడ్డారు. వచ్చే 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రాల వారీగా రాజకీయ పార్టీలు పొత్తుల కుదుర్చుకుంటే బిజెపిని తప్పని సరిగా ధీటుగా ఎదుర్కొనవచ్చన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ''మీడియా ఇన్ న్యూస్'' అన్న అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన చర్చాగోష్టికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ పౌరులకు మీడియానే కళ్లు, చెవులు అన్నారు. సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని బాధ్యతతో రిపోర్ట్ చేయాల్సిన బాధ్యత మీడియాపైనే ఉందని ఆయన పేర్కొన్నారు. టివి ఛానెళ్లు టిఆర్‌పి రేటింగ్‌ల కోసం సంచలన వార్తలకే ప్రాధాన్యత నిస్తూ గాడి తప్పుతున్నాయన్నారు. ప్రస్తుతం వార్తా ప్రసార ఛానెళ్లు రోజు రోజుకు విస్తరిస్తున్నాయని, ఇప్పటికే 24 గంటల వార్తా ప్రసారాలను అందించేందుకు నమోదు చేసుకున్న ఛానెళ్ల సంఖ్య 397గా ఉందన్నారు. ఈ చర్చా గోష్టిని కామిని షరాఫ్ మోడరేటర్‌గా వ్యవహరించారు.

ఇద్దరికీ ఓటుహక్కు లేనట్లే!

- **కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి లేఖ**
- **త్వరలో తుది నిర్ణయం తీసుకోనున్న సీఈసీ**
- **హైకోర్టు ఆదేశాలకు లోబడి నిర్ణయం?**

మన తెలంగాణ/ హైదరాబాద్ : సభ్యత్వం రద్దైన ఇద్దరు ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును కూడా కోల్పోయారు. ఈ నెల 23 న రాజ్యసభ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ రూల్ బుక్ ప్రకారం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్లు తమ ఓటు వినియోగించుకునే హక్కును కోల్పోయారని పేర్కొంటూ కార్యదర్శి, రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాసినట్లు సమాచారం. ఈ లేఖను సిఇఒ కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలన కోసం ఢిల్లీకి పంపారు. అక్కడి నుంచి ఆదేశాలు రాగానే సిఇఒ ఆ నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.ఈ నెల 23 వ తేదీన జరగాల్సిన రాజ్యసభ ఎన్నికలకు ఏర్పాట్లు కొనసాగుతు న్నాయి. ఐతే శాసనసభా సభ్యత్వం రద్దైన ఎమ్మెల్యేలకు నిబంధనల ప్రకారం ఓటును వినియోగించుకునే హక్కు ఉండదు. ఇదే విషయాన్ని ఓ లేఖ ద్వారా అసెంబ్లీ కార్యదర్శి, ఇటు తెలంగాణ సిఇఒకు, అటు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌కు తెలియజేసినట్లు సమాచారం.

దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం త్వర లో నిర్ణయం తీసుకోనుంది. శాసనసభ నిబంధనల ప్రకారం సభ్యత్వం కో ల్పోయిన ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు, రాజ్యసభ ఎన్నికల్లో ఓటును వేసే హక్కు ను కోల్పోయినట్లే అని అధికారులు చెబుతున్నారు. ఐతే ఈలోపు హైకోర్టు ఏదైనా తీర్పు వెలువరిస్తే మాత్రం, ఆ ఆదేశాలను కూడా సిఇసి పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆమేరకు నిర్ణయం మార్చుకోవాల్సి ఉంటుంది. ఇక ఇద్దరు శాసనసభ్యుల సభ్యత్వం రద్దైన నేపథ్యంలో, ఖాళీ అయిన రెండు స్థానాలకు ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఏర్పడిన ఖాళీల ఆధారంగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనేది కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయి స్తుంది. ఎన్నికల నిర్వహణ అంశంపై కూడా హైకోర్టు ఆదేశాల ప్రభావం ఉంటుంది. అయితే ఎంఎల్‌ఏల సభ్యత్వం రద్దు అనేది మొత్తం శాసనసభ కలిసికట్టుగా చేసిన ఏకగ్రీవ తీర్మాణం కావడం, ఆర్టికల్ 194 ప్రకారం సభలో అనుచితంగా ప్రవర్తించిన ఎంఎల్‌ఏలపై క్రమశిక్షణా చర్యలు చేపట్టే అధికారం స్పీకర్ కు ఉండటం, శాసనసభ నిర్ణయం చేసిన వెంటనే అసెంబ్లీ గెజిట్ నోటిఫికేషన్ వెలువడటం తదితర బలమైన కారణాల నేపథ్యంలో పిటిషనర్ల వాదన న్యాయస్థానంలో నిలబడదనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఆ రెండు స్థానాల్లో ఉప ఎన్నికలు అనివార్యం అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

క్రాస్ ఓటింగ్ చేసినా వేటు ఉండదు

- **రాజ్యసభ ఎన్నికల్లో వైచిత్రి**
- **23న మూడు స్థానాలకు ఎన్నికలు**

మన తెలంగాణ / హైదరాబాద్ : సాధారణంగా ఎన్నికల్లో ఓటేసిన తరువాత ఎవరికైనా బ్యాలెట్ పేపర్‌ను చూపిస్తే ఆ ఓటు చెల్లదు. పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటేస్తే ఎంఎల్‌ఏ పదవి పోతుంది. కాని రాజ్యసభ ఎన్నికలు మాత్రం అం దుకు భిన్నం. ఈ ఎన్నికల్లో తాము ఎవరికి ఓటేస్తామో కచ్చితంగా తమ పార్టీ పోలింగ్ ఏజెంట్‌కు చూపించాల్సిందే. ఒకవేళ ప్రత్యర్థికి ఓటేసినా సరే తాము గెలిచిన పార్టీకి చెందిన ఏజెంట్‌కు బ్యాలెట్‌ను చూపిస్తేనే ఓటు చెల్లుబాటు అవుతుంది. రాష్ట్రంలో ఈ నెల 23న మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గెలుపొందేందుకు అవసరమైన ఎంఎల్‌ఏల సంఖ్యాబలం లేనప్పటికీ కాం గ్రెస్ తన అభ్యర్థిని బరిలో నిలపడంతో, పోలింగ్ అనివార్యమైంది. టిఆర్‌ఎస్‌లో చేరిన తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎంఎల్‌ఏలకు విప్ ఇవ్వడం ద్వారా ఇరకాటంలో పెట్టాలని కాంగ్రెస్ భావిస్తుంది. కాని విప్‌నకు వ్యతిరేకంగా ఓటేసినా రాజ్యసభ ఎన్నికల నిబంధనల ప్రకారం పార్టీ మారిన ఎంఎల్‌ఏల పదవి పోయే అవకాశం లేదు. గతంలో రాజ్యసభ ఎన్నికల్లో కూడా రహస్య ఓటింగ్ విధానమే ఉండేది. 2003లో ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ తీసుకువచ్చి రాజ్యసభ ఎన్నికల్లో బహిరంగ ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో పార్టీలు అధికారికంగా నియమించిన పోలింగ్ ఏజెంట్‌కు ఎంఎల్‌ఏలు ఓటేసిన తరువాత తమ బ్యాలెట్‌నుచూపించాల్సి ఉంటుంది. అలా చూపించేందుకు నిరాకరిస్తే ఆ ఓటును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకొని, చెల్లని ఓటుగా పరిగణిస్తారు. ప్రలోభాలకు గురై క్రాస్ ఓటింగ్‌కు పాల్పడే వారిని బహిర్గతం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. క్రాస్ ఓటింగ్ చేసినప్పటికీ ఎంఎల్‌ఏపై అనర్హత వేటు వేసేందుకు దీనిని ఆధారంగా పరిగణించబోరు. ఇతర పార్టీకి ఓటేసినప్పటికీ స్వంత పార్టీ ఏజెంట్‌కు చూపిస్తేనే ఆ ఓటు చెల్లుతుంది. స్వంత పార్టీ ఏజెంటుకు మినహా ఏ ఇతర ఏజెంట్‌కు చూపించినా ఓటు చెల్లదు. ఇటీవల గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు క్రాస్ ఓటింగ్ చేశారు. తమ ఓటును స్వంత పార్టీ ఏజెంట్‌కు చూపించడంతో పాటు, వేరే పార్టీ ఏజెంట్‌కూ చూపించడంతో ఆ ఓట్లను చెల్లనివిగా ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో మూడు స్థానాలను గెలుచుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం టిఆర్‌ఎస్‌కు ఉంది. ఇటీవల రెండు ఎంఎల్‌ఏ స్థానాలు ఖాళీ అవడంతో ఒక్క రాజ్యసభ స్థానాన్ని గెలిచేందుకు అవసరమైన ఎంఎల్‌ఏల సంఖ్య 30కి తగ్గింది. మరో వైపు ఐదుగురు సభ్యులు ఉన్న బిజెపి ఓటింగ్‌కు దూరంగా ఉండాలని భావిస్తుంది. అలా జరిగితే గెలిచేందుకు అవసరమైన ఎంఎల్‌ఏల సంఖ్య 29కి తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం టిఆర్‌ఎస్‌కు 82 మంది ఎంఎల్‌ఏలు ఉన్నారు. ఇప్పటికే ఏడుగురు సభ్యులు ఉన్న ఎంఐఎం ఇప్పటికే టిఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించింది.



రైతులకు మెరుగైన సేవలు

మన తెలంగాణ/హైదరాబాద్ : రైతులకు మేలైన సేవలు అందించేందుకు అగ్రానమిస్ట్ శిక్షణ ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం. జగన్ మోహన్ అన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా శిక్షణ అంశాలను రూపొందించి, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించే లక్ష్యంతో ఇచ్చిన శిక్షణతో అధికారుల పనితీరులో సానుకూల మార్పురావాలన్నారు. మండల వ్యవసాయాధికారులకు నిర్వహించిన అగ్రానమిస్ట్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి మంచి సూచనలు, సలహాలివ్వాలన్నారు. కింది స్థాయిలో ఉన్న ఎఇఒలకు కూడా శిక్షణ కల్పించాలన్నారు. త్వరలోనే ఎడిఎలకు కూడా అగ్రానమిస్ట్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మొత్తం ఎమ్ఎఒలకు 11 బ్యాచ్‌లలో శిక్షణ కల్పించారు.



"లేవండి! మేల్కొండి! గమ్యం చేరే వరకు విశ్రమించకండి.
– స్వామి వివేకానంద"

సంపాదకీయం

అందరి చూపు అవిశ్వాసం వైపే!

నరేంద్ర మోడీ ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టిడిపి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు నోటీసు యిచ్చిన అవిశ్వాస తీర్మానాలు సోమవారం నాడైనా చర్చకు వస్తాయా? ఏ పార్టీ అయినా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చినప్పుడు, స్పీకర్ ఆ అంశాన్ని సభలో ప్రస్తావించి ఎందరు బలపరుస్తున్నారని అడిగినపుడు, తీర్మానానికి అనుకూలంగా 50 మందికిపైగా సభ్యులు లేచి నిలబడినపుడు, మిగతా ఎజండాను పక్కనపెట్టి స్పీకర్ దానిపై చర్చను చేపట్టాల్సి ఉంటుంది. అయితే కొన్ని పక్షాలు తమ సమస్యలపై సభలోపల ఆందోళన చేస్తున్నందున, సభ ఆర్డర్‌లో లేదంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం నాడు సభను అర్ధాంతరంగా సోమవారానికి వాయిదా వేశారు. మరి సోమవారం కూడా అదే పరిస్థితి ఉంటే ఏమి చేస్తారు? మళ్లీ వాయిదా వేస్తారా? రూలు నిర్దేశించినట్లు, సభ సంఖ్యాబలంలో 10వ వంతు సభ్యులు స్పీకర్ కోరినపుడు సభలో లేచినిలబడితే తీర్మానంపై వెంటనే చర్చను ప్రారంభించాలి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలతోసహా పలు ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే తీర్మానానికి తోడ్పాటు ప్రకటించటంతో అవసరమైన సంఖ్య కన్నా రెట్టింపుకుపైగా మద్దతు స్పష్టమైంది. 54 మంది సభ్యుల సంతకాలతో మరో అవిశ్వాస తీర్మాన నోటీసు స్పీకర్ కార్యాలయానికి అందజేయాలని టిడిపి వ్యూహాత్మకంగా నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన బిల్లును రాజ్యసభలో ఆమోదించే సందర్భంలో కాంగ్రెస్, బిజెపి పరస్పర అవగాహన మేరకు పరిశేష ఏపి వెనుకబాటుతనం నుంచి బయటపడేందుకుగా ను ఐదేళ్లపాటు 'ప్రత్యేక తరగతి హోదా'ను ప్రభుత్వం ఇస్తుందని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ వాగ్దానం చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఆ హోదా పదేళ్లపాటు అవసరమన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ హోదాను నిరాకరించింది. విభజన చట్టంలో ఏపి, తెలంగాణ రాష్ట్రాలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలు చేయలేదు. అట్టి వాగ్దాన భంగానికి నిరసనగా వైసిపి, టిడిపిలు పోటాపోటీ రాజకీయ ఎత్తుగడల్లో మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి వేర్వేరుగా నోటీసులివ్వటం తెలిసిందే.

అవిశ్వాస తీర్మానంపై చర్చ అనంతరం ఓటింగ్ జరిగినా ఎన్‌డిఎ ప్రభుత్వానికొచ్చే ప్రమాదం ఏదీ లేదు. బిజెపికి స్వంతంగా 273 మంది సభ్యులు, ఎన్‌డిఎ పక్షాల సభ్యులు 40 మంది ఉన్నారు. అయితే ఈ తీర్మానం వాగ్దాన భంగ ప్రభుత్వంగా మోడీ సర్కారును నైతికంగా దెబ్బకొడుతుంది. అంతేగాక, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకై ప్రతిపక్ష ఐక్యతకై జరుగుతున్న ప్రయత్నాలకు ఊపు తెస్తుంది. అందువల్లనే శివసేన సహా ఎన్‌డిఎ కూటమి సభ్యులను ఒక్కటిగా ఉంచేందుకు, ప్రతిపక్షాల్లో విభజన తెచ్చేందుకు బిజెపి వ్యూహాలు అమలు జరుపుతోంది. ఎఐఎడిఎంకె అధికార ప్రతినిధి కెసి పళనిస్వామి తమ పార్టీ అవిశ్వాస తీర్మానాన్ని బలపరుస్తుందని (వారి సమస్య వేరే) చెప్పగా, పార్టీ నాయకత్వం ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. తాము తీర్మానాన్ని బలపరచటం లేదని లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎం. తంబిదురై (ఎఐఎడిఎంకె) ప్రకటించటం గమనార్హం.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణాన్ని చర్చించాలని కాంగ్రెస్, సుప్రీంకోర్టు ఆదేశించినట్లు కావేరీ జలాల పంపిణీ పర్యవేక్షక బృందాన్ని నియమించాలని ఎఐఎడిఎంకె, ప్రత్యేక హోదా సమస్యపై టిడిపి, వైసిపి సభ్యులు, రిజర్వేషన్‌ల కోటా నిర్ణయాధికారాన్ని రాష్ట్రాలకివ్వాలని, గ్రామీణ ఉపాధి హామీని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని టిఆర్ఎస్ సభ్యులు 10 రోజులుగా పార్లమెంట్ లోపల, వెలుపల ఆందోళన చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కుల పోరాటానికి సంఘీభావం తెలిపిన టిఆర్ఎస్, అవిశ్వాస తీర్మానంపై ఇంకనూ స్పష్టమైన వైఖరి ప్రకటించలేదు. స్పీకర్ అవిశ్వాస తీర్మానం ప్రస్తావించే సందర్భంలో కొన్ని పార్టీలు తమ కోర్కెలపై ఆందోళన కొనసాగించవచ్చు. అయితే అవిశ్వాస తీర్మానం చేపట్టకపోవటానికి అది సాకు కాకూడదు. మోడీ ప్రభుత్వంపై ఇదే తొలి అవిశ్వాస తీర్మానం అయినందున దేశ ప్రజలు ఆసక్తితో గమనిస్తున్నారు.

అల్పంతో అనల్ప విజయాలు


చూపు

త్రిపుర ఎన్నికల్లో 59 స్థానాల్లో 35 స్థానాలు బిజెపి గెలిచింది. బిజెపికి లభించిన మొత్తం ఓట్లు 43 శాతం. సిపిఎం పార్టీకి మొత్తం ఓట్లు 42.6శాతం లభించాయి. అంటే ఓట్ షేర్ లో పెద్ద తేడా ఏమీ లేదు. కాని సిపిఎం గెలిచిన సీట్లు 16 మాత్రమే.

త్రిపుర ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే 5 నియోజకవర్గాల్లో వెయ్యి ఓట్ల కన్నా తక్కువ మార్జిన్ తో బిజెపి గెలిచింది. బాముతియాలో కృష్ణధన్ దాస్ ఆధిక్యత 972, నాల్చర్ సుభాష్ చంద్ర దాస్ ఆధిక్యత 451, బిలోనియాలో అరుణ్ చంద్ర భౌమిక్ ఆధిక్యత 753, కర్బూక్ లో బుర్బా మోహన్ ఆధిక్యత 797, పణిసాగర్ లో బినయ్ భూషణ్ దాస్ ఆధిక్యత 561. ఈ ఆధిక్యతలను పరిశీలిస్తే అర్థమయ్యే మరో వాస్తవమేమంటే, కాంగ్రెసు ఓట్లు బిజెపికి బదిలీ కావడం వల్ల బిజెపి పుంజుకుంది. కొన్ని చోట్ల ఇతర పార్టీలు రంగంలో ఉండడం వల్ల ఓట్లు చీలాయి. త్రిపుర ఎన్నికల్లో 3000 మెజారిటికి కాస్త అటుయిటుగా బిజెపి గెలిచిన స్థానాలను చూస్తే, అవి మజ్లిస్ పూర్ సుషాంత్ చౌదరి ఆధిక్యత 3890, ప్రతాప్ గఢ్ రేబతీ మోహన్ దాస్ ఆధిక్యత 3148, గోలాఘాటి బీరేంద్ర కిశోర్ దెబ్బారా ఆధిక్యత 3498, కల్యాణ్ పూర్ ప్రమోద్ నగర్ లో పినాకీ దాస్ చౌదరి ఆధిక్యత 3141, కృష్ణపూర్ లో అతుల్ దెబ్బార్మ ఆధిక్యత 1995, బాగ్మాలో రామ్ పాడా జమాతియా ఆధిక్యత 2833, మాతర్బారిలో బిప్లాబ్ కుమార్ ఘోష్ ఆధిక్యత 1566, శాంతిర్ బాజార్ లో ప్రమోద్ రాంగ్ ఆధిక్యత 2349, సబ్రూమ్ లో శంకర్ రాయ్ ఆధిక్యత 2182, కమల్ పూర్ లో మనోజ్ కాంతి దేబ్ ఆధిక్యత 2959, సుర్మాలో ఆశిష్ దాస్ ఆధిక్యత 2710, అంబస్సాలో పరిమళ్ దెబ్బార్మా ఆధిక్యత 3585, చావ్ మానులో శంభూలాల్ చక్మా ఆధిక్యత 3755, ఫతిక్రాయ్ లో సుధాంశుదాస్ ఆధిక్యత 2829, పెంచార్తల్ లో సంతాన చక్మా ఆధిక్యత 1373. అంటే 3000 కన్నా తక్కువ ఆధిక్యతతో గెలిచిన స్థానాల సంఖ్య 14. నాలుగు వేల కన్నా తక్కువ ఆధిక్యతతో గెలిచిన స్థానాల లెక్క చూస్తే 20 స్థానాలున్నాయి.

త్రిపురలో వామపక్షాలు కుప్పకూలిపోయాయని చెప్పగలమా? అలాగే ఇంతకు ముందు ఉత్తరప్రదేశ్ ఎన్నికల విషయంలోను ఇదే వర్తిస్తుంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించి యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. కాని ఈ ఘనవిజయం వెనుక ఓట్ల పోలింగ్ సరళి ఎలా ఉందో పరిశీలించాలి. బిజెపికి పోలయిన మొత్తం ఓట్లు, అఖిలేష్, మాయావతి ఇద్దరికి పోలయిన మొత్తం ఓట్ల కన్నా తక్కువ. బిజెపికి మొత్తం 3,44,03,039 ఓట్లు వచ్చాయి. అంటే 39.7 శాతం ఓట్లు. మొత్తం 312 స్థానాల్లో గెలుపు సాధించింది.

మరోవైపు సమాజవాది పార్టీకి 1,89,23,689 ఓట్లు వచ్చాయి. అంటే 21.8 శాతం ఓట్లు. బహుజనసమాజ్ పార్టీకి 1,92,81,352 ఓట్లు వచ్చాయి. అంటే 22.2 శాతం ఓట్లు. అఖిలేష్, మాయావతి ఇద్దరి పార్టీలకు పోలయిన మొత్తం ఓట్లను కలుపుకుంటే 3,82,05,041 ఓట్లు, అంటే బిజెపి పొందిన 3.44 కోట్ల ఓట్ల కన్నా చాలా ఎక్కువే. దీనికి కాంగ్రెసు సాధించిన 6.2 శాతం ఓట్లను కూడా కలుపుకుంటే దాదాపు కోటి ఓట్ల తేడా ఉంటుంది. అంటే సమాజవాది, బహుజనసమాజ్, కాంగ్రెసు పార్టీలకు పోలయిన మొత్తం ఓట్లు బిజెపి పోలయిన ఓట్ల కన్నా దాదాపు కోటి ఎక్కువ. దాదాపు 50.2 శాతం. ఉత్తరప్రదేశ్ కొన్ని నియోజకవర్గాల్లో ఓట్లు చీలిపోయిన వైనం పరిశీలిస్తే ఈ ఓటింగ్ సరళి, గెలుపోటములు ఎలా ఉన్నాయో ఇంకా బాగా అర్థం అవుతుంది. కాంత్‌లో రాజేష్ కుమార్ సింగ్ (బిజెపి) 76,307 ఓట్లు పొందాడు. సమాజవాది పార్టీ ముస్లిమ్ అభ్యర్థి అనీసుర్రహ్మాన్ను నిలబెట్టింది. ఆయనకు 73, 959 ఓట్లు పడ్డాయి. తేడా మూడువేల పైచిలుకు ఓట్లు మాత్రమే. బహుజనసమాజ్ పార్టీ కూడా ఇక్కడ ముస్లిమ్ అభ్యర్థినే నిలబెట్టింది. బిఎస్పీ అభ్యర్థి 43820 ఓట్లు పొందాడు. ఓట్లు ఎలా చీలిపోయాయో స్పష్టంగా అర్థమయ్యే ఉదాహరణ ఇది.



మీరాపూర్ పరిస్థితి కూడా అంతే, అవతార్ సింగ్ బాధానా (బిజెపి)69,035 ఓట్లు సంపాదించి గెలిచాడు. సమాజవాదికి చెందిన లియాకత్ అలీకి 68842 ఓట్లు లభించాయి. తేడా వెయ్యి ఓట్లకు పైచిలుకు మాత్రమే. కాగా బిఎస్పీకి చెందిన నవాజిష్ ఆలమ్ ఖాన్ కు 39,689 ఓట్లు వచ్చాయి. బహేరీలో ఛత్రపాల్ సింగ్ (బిజెపి)108846 ఓట్లతో గెలిచాడు. బిఎస్పీకి చెందిన నసీమ్ అహ్మద్ కు 66009 ఓట్లు వచ్చాయి. సమాజవాదికి చెందిన అతా వుర్రహ్మాన్ కు 63841 ఓట్లు వచ్చాయి. సమాజవాది, బిఎస్పీలు కలిస్తే బిజెపి ఓడేది. ఉత్రోలాలో రామ్ ప్రతాప్ (బిజెపి) 85240 ఓట్లు సాధించాడు. సమాజవాదికి చెందిన ఆరిఫ్ అన్వర్ హాష్మి 56,066 ఓట్లు, బిఎస్పీకి చెందిన పర్వేజ్ అహ్మద్ 44,799 ఓట్లు పొందారు. దేవ్ బంద్ లో బిజెపికి చెందిన బ్రిజేష్ 102,244 ఓట్లు సాధిస్తే, బిఎస్పీకి చెందిన మాజిద్ అలీకి 72,844, సమాజవాదికి చెందిన మావియా అలీకి 55,385 ఓట్లు వచ్చాయి. గైంసారిలో కూడా ఇదే పరిస్థితి. శైలేష్ కుమార్ సింగ్ (బిజెపి) 55,716 ఓట్లు పొందితే బిఎస్పీకి చెందిన అల్లావుద్దీన్ కు 53413 ఓట్లు, సమాజవాదికి చెందిన డా. శివప్రతాప్ యాదవ్ కు 47,378 ఓట్లు లభించాయి. బిజెపి అభ్యర్థి కేవలం రెండువేల పైచిలుకు ఓట్లతో గెలిచాడని గమనించాలి. సమాజవాది, బిఎస్పీ పార్టీలు ముస్లిములు అధికంగా ఉన్న చోట ముస్లిమ్ అభ్యర్థులను నిలబెట్టినట్లే ఇతర సముదాయాల విషయంలోను వ్యవహరించాయి. ఫలితంగా ఈ రెండు పార్టీల మధ్య ఓట్లు చీలిపోయాయి. ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేసి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో ఊహించవచ్చు. కులం మతం ప్రాతిపదికన ఓట్లు పోలవుతున్న వాస్తవాన్ని కూడా మనం కాదనలేము. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనే కొన్ని గ్రామాల్లో ఓటింగ్ సరళి గురించి అప్పట్లోనే వార్తల్లో వచ్చింది. రాజ్ పుత్ ప్రాబల్యం ఉన్న హిరన్వాడాలో బిఎస్పీకి 14 ఓట్లు, ఆర్ ఎల్‌డీ కి ఒక్క ఓటు కూడా పడలేదు. సమాజవాది పార్టీకి 7 ఓట్లు వచ్చాయి. బిజెపికి 790 ఓట్లు. బ్రాహ్మణుల ప్రాబల్యం ఉన్న భాందోడ ఊళ్లో బిఎస్పీకి 156 ఓట్లు, ఆర్ ఎల్ డీ కి ఒక్క ఓటు కూడా పడలేదు, సమాజవాదీ పార్టీకి 9 ఓట్లు, బిజెపికి 570 ఓట్లు. ముస్లిములు అధికంగా ఉన్న జలాలాబాద్ లో బిఎస్పీకి 453 ఓట్లు, రాష్ట్రీయ లోక్‌దళ్ కు 15 ఓట్లు, సమాజవాది పార్టీకి 6 ఓట్లు, బిజెపికి 23 ఓట్లు వచ్చాయి. జాట్లు, ముస్లిములు అధికంగా ఉన్న పిండోరాలో బిఎస్పీకి 33 ఓట్లు, ఆర్ ఎల్ డీ కి 482 ఓట్లు, సమాజవాదికి 33 ఓట్లు, బిజెపికి 278 ఓట్లు వచ్చాయి. ఈ ఓటింగ్ సరళిని పరిశీలిస్తే మనకు తెలిసేదేమంటే సమాజవాది, బహుజనసమాజ్ పార్టీల మధ్య ఓట్ల చీలిక బిజెపికి ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో లాభించింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూసుకుంటే బిజెపి అభ్యర్థులు చాలా తక్కువ మార్జిన్ తో గెలిచిన నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. ఎన్నికలకు ముందు మహాకూటమి కనుక ఏర్పడి ఉన్నట్లయితే దానికి కనీసం 263 స్థానాలు వచ్చి ఉండేవి. బిజెపి 135 స్థానాలకు పరిమితం కావలసి వచ్చేది. కాని ప్రాంతీయ పార్టీల్లో అనైక్యత బిజెపికి లాభించింది. ఉదాహరణకు 82 నియోజకవర్గాల్లో ముస్లిముల జనసంఖ్య చాలా ఎక్కువ. కాని ఈ నియోజకవర్గాలన్నింటా ముస్లిం ఓట్లు చీలిపోయాయి.

✻ వాహెద్

ట్రంప్ అనుచిత వ్యవహారశైలి

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఒక ఫోన్ కాల్ గురించి మాట్లాడారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే హార్లె డేవిడ్ సన్ మోటారు సైకిళ్లపై ఇంపోర్ట్ డ్యూటీ 50 శాతానికి తగ్గించామని ప్రధాని నరేంద్ర మోడీ ఫోను చేసి ట్రంప్‌కు చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ డోనాల్డ్ ట్రంప్ మాట్లాడిన పద్ధతి భారతీయులందరినీ అవమానపరిచేలా ఉంది. భారత ప్రధానిని ''బ్యూటిఫుల్ మ్యాన్, ఫాంటాస్టిక్ మ్యాన్'' అంటూ ట్రంప్ తనదైన శైలిలో మోడీ మాటతీరును మిమిక్రీ చేస్తూ చెప్పిన తీరు ఒక దేశాధినేతకు ఎంతమాత్రం శోభించేవి కావు. ఆయన కించపరిచింది ఒక వ్యక్తిని కాదు, భారత ప్రధానిని అన్నది అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యాపారవేత్తకు అర్థం కాలేదు. కనీసం వైట్ హౌస్ సిబ్బందయినా ఆయనకు ఈ విషయాలు చెప్పవలసింది. ట్రంప్ వ్యవహారశైలి అమెరికా అధ్యక్షుడి పదవికి పొసిగేదిగా లేదని, దౌత్యమర్యాదలను పట్టించుకోకుండా ఆయన చాలా నిర్లక్ష్యంగా మాట్లాడారని అనేకమంది తీవ్రంగా విమర్శించారు.

ప్రపంచంలోని వివిధ దేశాలు, వివిధ దేశాల అధినేతలు అమెరికా అధ్యక్షుడి హోదాలో ట్రంపుతో మాట్లాడుతున్నారే కాని వ్యాపారవేత్త ట్రంపుతో మాట్లాడడం లేదు. అమెరికన్ ప్రత్యేకత గురించి ఎప్పుడు చెప్పుకునే అమెరికా అధ్యక్షుల వారు, ప్రపంచంలో అతి పాత ప్రజాస్వామిక దేశాధినేత తన స్థాయికి తగిన విధంగా మాట్లాడితేనే ప్రపంచదేశాల్లో గౌరవమర్యాదలుంటాయి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశ ప్రధానిని మిమిక్రీ చేయడం అన్నది ఒక స్టాండప్ కమేడియన్ చేసే పని.

ఇంపోర్ట్ డ్యూటీల విషయంలో సమస్యను ఎవరూ కాదనలేరు. ఈ సమస్య పరిష్కారానికి రెండు దేశాలు ప్రయత్నించడం అవసరమే. కాని అమెరికా నుంచి ఏటా భారత దేశానికి ఎగుమతయ్యే 3700 హార్లే డేవిడ్ సన్ మోటారు సైకిళ్ళు, ఇండియా నుంచి అమెరికాకు ఎగుమతయ్యే 1000 మోటారు సైకిళ్ళ సమస్యను అమెరికా అధ్యక్షుడి స్థానంలో ఉన్న వ్యక్తి బహిరంగ ప్రకటనల్లో ప్రస్తావించడం, అది కూడా కామెడీ చేస్తున్నట్లు ప్రస్తావించడం దౌత్య మర్యాదల్లో పతనాన్ని సూచిస్తుంది. మోటారు సైకిళ్ళ ఇంపోర్ట్ డ్యూటి సమస్య చాలా చిన్నది. ఈ సమస్యను న్యూఢిల్లీలోని అమెరికా దౌత్యకార్యాలయంలో డిప్యూటి చీఫ్ ఆఫ్ మిషన్, భారత విదేశాంగ శాఖతో ప్రస్తావించినా సరిపోతుంది.

కాని ట్రంప్ గారు అలా చేస్తే ఆయన ట్రంప్ కానే కాదు. బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1998లో భారతదేశం అణుపరీక్షలు నిర్వహించింది. ఆ తర్వాత క్లింటన్ తీవ్రమైన చర్యలు తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా క్లింటన్ కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ అప్పటి భారత ప్రధాని వాజపేయిని పరిహసించేలా, అపహసించేలా మిమిక్రీ చేయలేదు. దౌత్యమర్యాదలకు కట్టుబడి మాట్లాడారు. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన రిచర్డ్ నిక్సన్, హెన్రీ కిసింజర్‌లకు అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ పట్ల తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి ఉండేవి. ప్రయివేటు సంభాషణల్లో ఇందిరా గాంధీ విషయంలో దురుసుగా వాళ్ళు మాట్లాడారని కొన్ని కథనాలున్నాయి. కాని వారెప్పుడు దౌత్యమర్యాదలను అతిక్రమించి బహిరంగంగా మాట్లాడలేదు. బంగ్లాదేశ్ విషయంలో ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు అమెరికాకు అస్సలు నచ్చలేదు. అమెరికా, ఇండియాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న ఆ కాలంలో కూడా అమెరికా అధ్యక్షుడు భారతప్రధాని గురించి మాట్లాడుతున్నప్పుడు దౌత్యమర్యాదలు పూర్తిగా పాటిస్తూనే మాట్లాడారు. కాని ఇప్పుడు శ్వేతసౌధం ఈ దౌత్యమర్యాదలను మరిచిపోయినట్లు కనిపిస్తోంది.

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన మహాకోటీశ్వరుడు ట్రంపు గారికి శ్వేతసౌధంలో ఎవరైనా అంతర్జాతీయ సంప్రదాయాల గురించి, దౌత్యమర్యాదల గురించి చెబితే బాగుండును. దురదృష్టమేమంటే అమెరికా పాలనా యంత్రాంగం గుణపాఠాలు నేర్చుకోవడం చాలా తక్కువ. గోరంతను కొండంతగా మార్చుకోవడంలో అందెవేసిన చేయి. చిన్న



చిన్న విషయాలు బహిరంగ చర్చల్లో మహా సమస్యలుగా మార్చుకోవడం మామూలైపోయింది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న చివరి రోజుల్లో అమెరికాలో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రాగడే ఇంటి పనిమనిషికి తగిన జీతం చెల్లించడం లేదన్న ఆరోపణతో న్యూయార్కులో అరెస్టు చేశారు. ఈ సమస్య రెండు దేశాల మధ్య దౌత్యసమస్యగా మార్చుకోవలసిన అవసరమే లేదు. రెండు దేశాల దౌత్యకార్యాలయాలు సునాయాసంగా పరిష్కరించగలిగిన సమస్యను దౌత్యసంక్షోభం స్థాయికి తీసుకెళ్ళింది అమెరికా యంత్రాంగం.

భారత ప్రధానిని అపహసించడం ద్వారా ట్రంప్ సాధించిందేముంది. కోట్లాది భారతీయుల ఆగ్రహాన్ని తప్ప మరేమీ సాధించలేదు. నిజానికి నరేంద్రమోడీ అమెరికా విషయంలో సంయమనంతో వ్యవహరిస్తున్నారని చెప్పాలి. వీసాల విషయంలో మోడీ చాలా ఆచితూచి వ్యవహరించారు. చారిత్రక నేపథ్యాలను పక్కన పెట్టి భారతదేశం అమెరికాకు దగ్గరయ్యేలా చేసింది కూడా మోడీయే. ప్రస్తుతం భారతదేశంలో పాలకపక్షం బిజెపిలో తిరుగులేని నాయకుడాయన. బిజెపి అధికారంలోకి రావడానికి మోడీవేవ్ మాత్రమే ఉపయోగపడింది. దేశంలో 20 రాష్ట్రాల్లో నేడు బిజెపి ప్రభుత్వమే ఉంది. ప్రస్తుతం మోడీ వేవ్ తగ్గుముఖం పట్టిందని ఎంత చెప్పుకున్నా ఇటీవలి ఇండియా టుడే సర్వే ప్రకారం భారతదేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడు ఆయనే. అలాంటి భారత ప్రధానిని కించపరచి, భారతీయుల నిరసనను ఆహ్వానించి అమెరికా అధ్యక్షుడు సాధించిందేముంది. హార్లే డేవిడ్ సన్ మోటారు సైకిళ్ళ ఇంపోర్ట్ డ్యూటీ సమస్య భారత అమెరికా దౌత్యమర్యాదల కన్నా పెద్ద సమస్యగా ఎలా భావిస్తున్నారు?

భారతదేశం కీలకమైన మిలిటరీ భాగస్వామిగా అమెరికా భావిస్తుంటే, వ్యూహాత్మక భాగస్వామిగా భావిస్తుంటే ఇది సరయిన వైఖరి కాదు. ఏటా వ్యూహాత్మక చర్చలు, వాణిజ్యపరమైన చర్చలు జరుపుతున్న దేశంతో, సంయుక్త మిలిటరీ విన్యాసాలు జరుపుతున్న దేశంతో, ఇండో పసిఫిక్ రీజియన్ విషయంలోను, ఆఫ్ఘనిస్తాన్ విషయంలోను, ఆసియా లో నాటోగా మారవచ్చని వినిపిస్తున్న క్వాడ్ QUAD విషయంలోను, ఇంకాఅనేక ప్రాంతీయ, ప్రపంచ సమస్యల విషయంలోను కీలకమైన భాగస్వామిగాఉన్న దేశాధినేత గురించి మాట్లాడుతున్నప్పుడు మూడువేల పైచిలుకు మో టారుసైకిళ్ళ గురించి మిమిక్రీ చేయడం ఎలాంటి దౌత్యనీతి.

మోటారు సైకిళ్ళ ఇంపోర్ట్ డ్యూటీ అంత తీవ్రమైన సమస్యగా అమెరికా అధ్యక్షుడు భావిస్తుంటే ఇండియా అమెరికా బిజినెస్ కౌన్సిల్‌లో, ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో, దౌత్యమార్గాల ద్వారా ఇవేవీ కాకపోతే వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. వీటన్నింటినివదిలి అమెరికా అధ్యక్షుడు స్వయంగా ఇలాంటి చిన్నసమస్యను పట్టుకుని దాని గురించి కామెడీ చేయడం అత్యంత శోచనీయమైన సంఘటన.

ఇలాంటి సమస్యలను బహిరంగంగా ప్రస్తావించి, కాస్త కామెడీ చేసి అమెరికా అధ్యక్షుడు తనకు కావలసిన కొందరిని సంతోషపెట్టవచ్చేమో. కాని అమెరికా ఫస్ట్ విధానానికి ఇది పెద్ద దెబ్బ అవుతుంది. ఆ వాస్తవాన్ని గుర్తించాలి. ఆయనిప్పుడు అమెరికా అధ్యక్షుడు. వాణిజ్యవేత్త ట్రంప్ కాదు. తన వాణిజ్య సామ్రాజ్యం, ట్రంప్ ఎంపైర్ లో ఎవరినైనా ఎప్పుడైనా ఉద్యోగం నుంచి తొలగించే అధికారం ఆయనకు ఉండొచ్చు. కాని అమెరికా అధ్యక్షుడిగా మాట్లాడుతున్నప్పుడు వివిధ దేశాల అధినేతలు ఆయన ఉద్యోగులు కాదు. వారు ఆయా దేశాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలకులు. వారికా పదవులు అమెరికా అధ్యక్షుడు ఇచ్చినవి కాదు. ఈ వాస్తవాలను అమెరికా అధ్యక్షుడు తెలుసుకోవాలి. ఇప్పుడు ప్రపంచమేమీ ఏకధ్రువ ప్రపంచం కాదు. అమెరికా ఒక్కటే సూపర్ పవర్‌గా ఇప్పుడేమీ లేదు. మొన్న టర్కీ కూడా తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. చైనా ఆర్థిక వ్యవస్థ కన్నా కాస్త మెరుగైన స్థితి మాత్రమే అమెరికా ది. మిలిటరీ బలంలోను అమెరికాకు దీటుగా నిలబడే దేశాలున్నాయిప్పుడు.

ఎంత బలమైన దేశమైనా మొత్తం ప్రపంచంతో విరోధం పెట్టుకోదు. కాబట్టి ట్రంప్ ఈ వాస్తవాలను గుర్తించాలి. సంయమనాన్ని పాటించాలి. బహుశా మోడీ గారు చెప్పే యోగా ప్రాక్టీసు చేస్తే మంచిదేమో. సంయమనం లేకుండా వ్యవహరిస్తే అమెరికాకు లభించిన గొప్ప మిత్రదేశం ఇండియాను కోల్పోవచ్చు.

(డైలీ ఓ లో సురేంద్రకుమార్ వ్యాసం)

విళంబి నీ.. పెద్దరికం

మట్టి లోని మకరంద మధుర వాసనలు
తొలకరి చినుకుల తొలి ముద్దుకు
పరవశించి ప్రణయ ప్రమోదంలో
ప్రసవించే ధాన్యపు రాసులు
ఆకలి గుండెలకు ఆపన్న
హస్తమై ప్రభవించినప్పుడు
మనందరికీ విళంబి తెచ్చే విలక్షణ ఉగాది

బీడు భూముల్లో జల సవ్వడులు
శ్రావ్యమైన కోయిల రాగాలై తాకినప్పుడు
కరువు వీణ సరిచేసిన తంత్రులు పలికే
సరిగమల సంగీత విభావరికి
పచ్చని పొలాలు తలలాడించినపుడూ
మనందరికీ విళంబి తెచ్చే ఉగాది

మోడువారిన శిశిరంలా
ముడుచుకుపోయిన ఆశల మురిపాలు
చిగురిస్తున్న వసంతమై
పురివిప్పి నాట్యమాడినప్పుడు
మనందరికీ విళంబి తెచ్చే విలక్షణ ఉగాది

కాకి కోకిల పోలికల స్వభావం
తెలియాలంటే నవ వసంతం రావాలికదా
కోయిల గళంలో గానం మానవాళికి
జ్ఞాన సాగరమై తాకి
సమాజంలో సమభావనల పరిమళాల
సువాసనలు జగమంతా గుభాళించినపుడు
మనందరికీ విళంబి తెచ్చే విలక్షణ ఉగాది

లేలేత చిగురు తొడిగి మొగ్గలు
పరిమళాలై విచ్చుకుని
అవనిపై అందమైన ముగ్గులు పరిచినట్లు
ప్రకృతి పరువాలపై పచ్చని పైట కప్పినట్లు
వాత్సల్యపు వర్ణము వెలిసిన గుడిసె వాకిట
సంతసాల సింగిడి సంతరించుకున్నపుడు
మనందరికీ విళంబి తెచ్చే విలక్షణ ఉగాది

దుర్భిక్షపు వృక్షాల కింద కరవు కాటకాల నీడన
కాలం వెల్లబుచ్చమంటే..ఎలా?
కటిక దరిద్రంలో కాలే కడుపుతో కాలం వెంట
కాలు కదపనంటోంది
ఆ కాలాన్నే ఆగమంటోంది పేదరికం

లేదంటే సుసంపన్నం తెస్తేనే నిలుస్తుంది నీ పెద్దరికం
ఓ.. విళంబి సుసంపన్నం తెస్తేనే నిలుస్తుంది
నీ పెద్దరికం

– యాదయ్య కొప్పోలు, 9494273703

ఉగాది – ఉషస్సులు

శిశిరంలో ఆకురాల్చిన ప్రకృతి కాంత
నవ వసంతంతో పచ్చపచ్చని చిగుళ్ళతో
పసిడి వెన్నెల పూబోణిగా
వెల్లివిరిసిన భూసతి పులకరించి
రామచిలుక అయ్యె
సిరిమల్లెల సొగసులను సిగలో ధరించిన
ధరిత్రీదేవి మనసు మురిసి మురిపెంగా
రవి బింబాన్ని ముద్దాడి
నుదుటి సింధూరంగా ధరించె
లేలేత 'మావి చిగుళ్ళ'ను తిన్న
కోయిలమ్మ పులకరించి, కమ్మకమ్మని
పాటలతో పలకరించె
కొత్తపూల నెత్తావులతో వీచేపిల్లగాలి,
నిద్రాణంగా ఉన్న యువతను మేల్కొలిపి
రేపటి భవితవ్యానికి ఊపిరి పోయాలనే ఆలోచనలను స్ఫురింపజేసె
జీవితమంటే షడ్రచుల సమ్మేళనమనీ
గతంలోని చేదు అనుభవాల్ని విస్మరించి
మధురానుభూతులతో కోటి ఆశలతో
కొంగ్రొత్త జీవితంలోకి అడుగిడి పంచాంగ
శ్రవణంతో
కమ్మని ఉగాది పచ్చడినాస్వాదించి
నూతన సంవత్సర 'విళంబి'కి
ఆహ్వానాన్ని పలుకుతూ



'హేవిళంబికి' వీడ్కోలు చెబుతూ
తెలుగు వత్సరాది, మనందరి జీవితాలలో
నవ వసంతాలను, సుఖసంతోషాలను
ఆయురారోగ్యాలనూ, అష్టైశ్వర్యాలను
నింపాలని, మనసారా కోరుకుంటూ
'విళంబికి' స్వాగతం...సుస్వాగతం

–తిరునగరి పద్మ, 8465817902



అందోలు, పాపన్నపేట కోటల ముఖ ద్వారాలు



కొల్చారం మండలం రంగంపేటలో శిథిలావస్థలో ఉన్న బురుజు, పాపన్నపేట గౌని

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం

మన తెలంగాణ

మన


మనపేజీ
మనందరిపేజీ

www.manatelangana.news

హైదరాబాద్ | ఆదివారం | 18 మార్చి | 2018

పురాతన కష్టడాలు

పునరుద్ధరిస్తే పర్యాటక ప్రాభవం



శిథిలావస్థకు చేరుకున్న ఆంథోల్ బురుజు

శిథిల సౌందర్యాలు

రాజ్యమేలిన కోటలు, బురుజులు



పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లాల్సిన అలనాటి అపురూప కట్టడాలు నేడు నామరూపాలు లేకుండా పోతున్నాయి. పూర్వం రాజులకు, జమీందారులకు రక్షణ కవచాలుగా ఉన్న బురుజులు, కోటలు నేడు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఆంథోల్ కోటతో పాటు జోగిపేట, మండల పరిధిలోని తాలెల్మ, మన్‌సాన్‌పల్లి, కిచ్చన్నపల్లి, కోల్చారం మండల పరిధిలోని రంగంపేట అలాగే పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం, పాపన్నపేట లాంటి తదితర ప్రాంతాల్లో దాదాపు వందల యేండ్ల చరిత్ర గల అద్భుత కట్టడాలు నేడు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే పురాతన కట్టడాలను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. మరికొన్ని పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఇంతటి చరిత్ర కలిగిన ఈ ప్రాచీన కళా వైభవాలను కాపాడేందుకు పురావస్తు శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆంథోల్ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వపరమైన నిర్మాణాలకు, ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన రాయి కోసం ఇష్టానుసారంగా బురుజులను కూల్చివేశారు. అందోల్‌లో ప్రస్తుతం నాలుగు కమాన్‌లు, తొమ్మిది బురుజులు, గ్రామం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ శిథిల స్థితిలో కనిపిస్తున్నాయి. అలాగే పాపన్నపేటలో నాలుగు గౌనిలకు గాను ప్రస్తుతం రెండు మాత్రం మిగిలి ఉన్నాయి. అందులో నీళ్ల గౌని, కుమ్మరి గౌనిల పేర్లతో శిథిలావస్థలోనే ఉన్నాయి. రాజు గడి పూర్తిగా నేలమట్టమైంది. గడి నేలమట్టం కావడంతో కేవలం రాజా మహల్‌లోని కూలిన గోడలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇక శంకరంపేట కోటకు ఆ కోట గొర్రెలు, మేకల కొట్టంగా మారింది. ఇలాంటి పురాతన కట్టడాలను రక్షించి, భావితరాలకు చరిత్ర ప్రాధాన్యతను చాటిచెప్పాల్సిన బాధ్యత పురావస్తు శాఖ అధికారులపై ఉంది. 1764లో అంథోలు రాజ్యాన్ని అప్పటి నిజాం నవాబు శంకరమ్మకు అందోల్ రాజ్యాపాలన అప్పగించినట్లు చరిత్ర చెబుతుంది. ఆమె పాలనలోనే బురుజులను సంరక్షించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తున్నది. అందోల్‌లో మొత్తం 36 బురుజులు, మూడు గౌనిలు ఉండగా గ్రామానికి చుట్టూ తన నివాస గృహాల నలు వైపుల గల బురుజులను తాకుతూ చాలా లోతుగా కందకాలను నిర్మించారు. ఈ కందకాలు శత్రువులు దండయాత్రకు రాకుండా రక్షణగా ఉండే విధంగా ఏర్పాటు చేశారు. ఈ బురుజులును పెద్దపెద్ద బండరాళ్లతో దాదాపుగా 30 మీటర్ల ఎత్తులో నిర్మించడం విశేషం. అందులో సైనికులు కాపలా ఉండేవారు. ఈ కోట నుంచి సొరంగ మార్గాలు కూడా ఉండేవని పూర్వీకుల ద్వారా తెలుస్తున్నది. అప్పట్లో మెదక్ ప్రాంతాన్ని చరితార్థం చేసింది రాణి శంకరమ్మ. ఈమె ఉమ్మడి మెదక్ జిల్లాలోని అందోలును రాజధానిగా చేసుకొని రాజ్యాపాలన సాగించినట్లు తెలుస్తుంది. ఆమె అనారోగ్యంతో 1774లో తుది శ్వాస విడిచింది. ఆంథోలు చరిత్రలోనే ఆమె కీర్తి సువర్ణాక్షరాలతో లిఖించబడింది. అందుకే ఆమె యుద్ధ రంగంలో చూపిన ప్రతిభను, ఆమె జీవిత చరిత్రను ఇప్పటికీ ప్రజలు కథలు, పాటలు, గాథలుగా చెప్పుకుంటారు.చరిత్రకు నిదర్శనంగా నిలిచే పురాతన కట్టడాలను పురావస్తు శాఖ అధికారులు పట్టించుకోవాలి. రెడ్డి రాజుల కాలంలో నిర్మించిన అంథోల్ కోట, బురుజులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని అలాగే వదిలివేస్తే నేలమట్టమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పట్టించుకోవాలి.

**చాపల సత్యనారాయణ/
మన తెలంగాణ**



పూర్తిగా అధ్వానంగా మారిన పాపన్నపేట గడి



శంకరంపేట కోట

వాస్తవ సాగుదారుల అవస్థలు

దేశ వ్యాప్తంగా రైతు అనే పదానికి నిర్వచనం కోసం చర్చ తక్షణ అవసరం అనిపిస్తుంది. ఇది ఎప్పటినుండో నడుస్తున్న చర్చ అయినప్పటికీ మహారాష్ట్ర రైతు ఉద్యమం,తెలంగాణలో రైతుకు పెట్టుబడి సహాయం దృష్ట్యా ఈ చర్చ మరింత ప్రాధాన్యత ఉందనిపిస్తుంది.

పాలకుల దృష్టిలో భూమినే నమ్ముకున్న ఆదివాసీలు, భూమి లేకపోయినా భూమినే నమ్ముకుని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే కౌలు రైతులు,దేవాదాయ భూములు చేస్తున్నవారు, పోడు వ్యవసాయం చేస్తున్నవారు, అటవీ భూమిని,అసైన్డ్ భూమిని సాగు చేస్తూ జీవనం గడుపుతున్నవారు రైతులు కారు. (వాస్తవానికి వీరే నిజమైన సాగుదారులు).

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ప్రతి గ్రామంలో రైతులు గుమిగూడిన దగ్గరంతా ఒకటే చర్చ,ఎవరు నిజమైన రైతు. పట్టాదార్ పాస్ బుక్ కలిగి వ్యవసాయం చేయని వ్యక్తా లేదా భూమి లేక పోయినా వ్యవసాయాన్నే నమ్ముకుని ఇతరుల దగ్గర భూమి కౌలుకు తీసుకుని కష్ట,నష్టాలకు ఓర్చుకుని వ్యవసాయం చేసే వ్యక్తా ? సాధారణంగా ఎవరిని ఈ ప్రశ్న అడిగినా భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసే వ్యక్తినే వాస్తవ రైతు గా గుర్తిస్తారు. వాస్తవానికి ఎవరు భూమిని నమ్ముకుని వ్యవసాయం చేస్తారో వారే నిజమైన రైతు, కాని ఆ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పంటలను సాగు చేసేది తామే అయినా.. పంట రుణాలు సహా ప్రభుత్వం ఇచ్చే ఎటువంటి ప్రోత్సాహకాలూ తమకు అందడం లేదని వారిలో ఆవేదన వ్యక్తమవుతోంది. రుణ మాఫీ ప్రయోజనాన్ని భూమి యజమానులకే కట్టబెట్టారని, ఇప్పుడు సబ్సిడీ ఎరువులకు ఇచ్చే ప్రోత్సాహకాన్నీ వారి ఖాతాల్లోనే వేస్తున్నారని, నిజంగా భూమిని సాగు చేసి, అప్పుల పాలవుతున్న.. అన్ని కష్టాలనూ ఎదుర్కొంటున్న కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ పథకంలో పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నా రైతులకే మాఫీ అమలైంది.రాష్ట్రం లో 23 వేల కోట్ల రూపాయల రుణ మాఫీ అయితే కౌలు రైతులకు వర్తించింది కేవలం 23 కోట్లు మాత్రమే. కౌలు రైతు గుర్తింపు కార్డులు లేక,ఉన్న బ్యాంకు రుణాలకు నోచుకోక పెద్ద సంఖ్యలో కౌలు రైతులు రుణమాఫీ పొందలేకపోయారు. నిజానికి, రాష్ట్రంలో భూ యజమానులు చాలామంది ఇతర జీవనోపాదులు చూసుకోవటమో,పిల్లల చదువు గురించో,పట్టణాలకు వలసలు వెళ్లిన కారణంగా వీరిలో అత్యధికులు వాస్తవానికి సాగు చేయడం లేదు.వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు ఏమీ అందటం లేదు. తెలంగాణాలో ఈ మూడున్నర ఏళ్ళ కాలంలో 3500 మందికి పైగా రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారు.ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో రైతు ఆత్మ హత్య జరిగినట్టు మనం పత్రికలలో చూస్తూనే ఉన్నాము.ఆత్మ హత్య చేసుకున్న రైతు వివరాలలోకి వెళితే అత్యధికులు భూమి లేని కౌలు రైతులు, పోడు భూమి చేసుకుంటున్న ఆదివాసీలు ,కొందరు కొంత భూమి ఉండి మరింత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే కౌలు రైతులే కనిపిస్తారు.

కౌలు రైతుల రక్షణ కోసం 2011లో వచ్చిన భూ అధీకృత సాగుదారుల చట్టం ప్రకారం ప్రభుత్వం నుండి వ్యవసాయ పరమైన ఏ సంక్షేమ పథకాలు వచ్చినా అవి కౌలు రైతులకు వర్తించాలి.ఈ పథకాలు వర్తించటానికి కౌలు రైతు ఒక గుర్తింపు కార్డు కలిగిఉండాలి. ఆ గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ ఎంత దారుణంగా ఉందంటే తెలంగాణలో 10 లక్షలకు పైగా కౌలు రైతులు ఉంటే గత సంవత్సరం 10 వేల మంది కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులు అందలేదు. దీనిని పర్యవేక్షించవలసిన రెవిన్యూ శాఖ దీనిపై సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు.


కౌలు రైతులను దారుణంగా మోసగించే ప్రక్రియకు వ్యవసాయ అధికారులు శ్రీకారం చుట్టారు . తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎకరాకు పంటకు 4000 వ్యవసాయ ఖర్చులకు సహాయం అందిస్తామన్నది. దాని కోసం అన్ని జిల్లా కేంద్రాలలో వ్యవసాయ అధికారులు'రైతు సమగ్ర సర్వే' అని ఒక ప్రశ్నా పత్రం రూపొందించారు . ఈ సమగ్ర సర్వే ఆధారంగానే ఎకరాకు పంటకు 4000 రూపాయల సహాయం అందిస్తారని అంటున్నారు. కానీ వ్యవసాయ అధికారులు రూపొందించిన ఈ సర్వే పత్రంలో రైతుకు సంబంధించి 25 రకాల వివరాలు ఉన్నాయి కానీ కౌలు రైతుకు సంబంధించి ఒక్క విషయం కూడా పొందుపరచక పోవటం వారిని ఈ పథకానికి దూరం చేసినట్టే అనిపిస్తుంది. కానీ ఇంతవరకు కౌలు రైతుకు సంబంధించిన ఒక్క ప్రశ్నను కూడా 'రైతు సమగ్ర సర్వే' లో పొందుపరచలేదు .

గ్రామాలలో సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులను కౌలు రైతులు మా పేర్లు ఇందులో చేర్చారా అని అడిగితే మాకు కౌలు రైతుల పేర్లు చేర్చమని పై అధికారులనుండి ఆదేశాలు అందలేదని చెప్తున్నారు,పైగా జూన్ 15 వ తేదీతో సర్వే ముగిసింది . మరి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కౌలు రైతుల పేర్లు నమోదు చేస్తారు,మళ్ళీ వీరికోసం ఒక ప్రత్యేక సర్వే చేయటం సాధ్యమైన పనేనా ,అంత చిత్తశుద్ధి కౌలు రైతుల మీద ప్రభుత్వానికి ఉందా ?ఇది చాలా బాధాకరమైన విషయం. వ్యవసాయం లో తీవ్రంగా నష్టపోతున్న వర్గం కౌలు రైతులు, రైతుల ఆత్మ హత్యల్లో 70% కౌలు రైతులే. ఈ రోజు వ్యవసాయం నడుస్తుందటే అది కౌలు రైతుల త్యాగమే. కానీ వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుకు ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి . రైతుకు ఇచ్చే ఎకరాకు 4000 సహాయం మాత్రం నిజమైన వ్యవసాయం చేస్తున్న రైతులకు అందేటట్లు చూడటం మన అందరి బాధ్యత.

ముఖ్య మంత్రి గారు రైతుల గురించి ప్రసంగించిన సందర్భాలలో కూడా(ప్రగతి భవన్, ప్లినరీ,వరంగల్ బహిరంగ సభ) కౌలు రైతుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరం. ఇప్పుడైనా కౌలు రైతులు(వాస్తవ సాగుదారులు)న్యాయం పొందేటట్లు చేద్దాం. కమ్మ పట్టా పాస్ బుక్ కలిగినంత మాత్రాన వ్యవసాయం చేయని వారికి ఎకరాకు రూ.4000 సహాయం పొందే హక్కు లేదని చెబుదాం, కౌలు రైతుకు న్యాయం జరిగినప్పుడే రైతుల ఆత్మ హత్యలు కూడా నివారించగలం.ఇక అందరం కౌలు రైతుల గురించి ఆలోచిద్దాం. ప్రతి రాజకీయ పార్టీ తమ మేనిఫెస్టో లో కౌలు రైతుల గురించి ప్రస్తావించే పరిస్థితి కల్పిద్దాం,ఇలా జరగాలంటే కౌలు రైతులు సంఘటితం కావటం మినహా వేరే మార్గం లేదు.

వాస్తవ సాగుదారుల పిల్లలకు శాపంగా జి.వో. 33

వాస్తవ సాగుదారులను ఏమాత్రం పరిగణనలోకి లోకి తీసుకోని ప్రభుత్వం వాస్తవ సాగుదారులు పడుతున్న కష్టాలు చాలదన్నట్టు ప్రస్తుతం వారి పిల్లలను కుడా కష్టాలలోకి నెడుతుంది.జి. వో. 33 ప్రకారం వ్యవసాయ డిగ్రీ కోర్సుల్లో 40 శాతం రైతుల పిల్లలకు కేటాయించారు. ఇంతవరకు బాగానే ఉంది కాని ఆ రైతుకు కనీసం మూడు ఎకరాల భూమి ఉండాలనేది గత నిబంధన. దానిని కాస్తా సడలించి ప్రస్తుతం ఒక ఎకరాకు పరిమితం చేశారు. అత్యంత సమస్యను ఎదుర్కొంటున్న ఒక్క ఎకరా భూమి కుడా లేని వాస్తవ సాగుదారుల పిల్లలకు రైతుల కోటాలో సీటు లభించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే దిశగా ఒత్తిడి పెంచాలి.



బి .కొండల్ రెడ్డి
రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి
99488 97734

ప్రస్తుత సమావేశాల్లోనే బిసి కమిషన్ బిల్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ హోదా కల్పించే బిల్లును ఆమోదిస్తామని కేంద్ర సామాజిక, న్యాయ సాధికార సహాయ మంత్రి రాందాసు అథవాలే అన్నారు. శనివారం జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో బిసి ప్రతినిధి బృందం ఢిల్లీలో కేంద్ర మంతిని కలిసింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఈ మేరకు హామినిచ్చినుట్ల ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ బిల్లును పాస్ చేసేందుకు కేంద్రం చిత్తశుద్ధితో ఉందని, కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించడం వల్ల జాప్యం జరుగుతోందని కేంద్ర మంత్రి అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సమావేశాల్లోనే బిల్లు పాస్ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న మాదిరిగా ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని, రెసిడెన్షియల్ పాఠశాలల పథకాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రవేశపెట్టాలని బిసి నాయకులు మంత్రిని కోరారు. తెలుగు రాష్ట్రాల్లో బిసి కాలేజీ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నందున సొంత భవనాల నిర్మాణానికి నిధులివ్వాలని బిసి నేతలు కేంద్ర మంత్రిని కోరారు. అందుకు స్పందించిన మంత్రి ప్రభుత్వం నుండి సరైన ప్రతిపాదనలు వస్తే పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రి హామినిచ్చారు.

కడుపు కోత

- చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారులు మృతి
- మూడు కుటుంబాలలో అలుముకున్న విషాదఛాయలు





మనతెలంగాణ/కొండమల్లేపల్లి : పెండ్లిపాకుల చెరువులో ఈతకు వెళ్లి ఒకే గ్రామాని చెందిన ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంఘటన శనివారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని పెండ్లిపాకుల గ్రామ పంచాయతీలోని గుడితండాలో చోటుచేసుకుంది. పోలీసులు , స్థానికుల, బాదితులు తెలిపిన వివరాల ప్రకారం గుడితండాకు చెందిన నేనావత్ ఓంకారంసరస్వతిల కుమారులు నేనావత్ సంతోష్ 2 వ తరగతి,నేనావత్ రాకేష్ ఎల్‌కేజిలు కొండమల్లెపల్లి గౌతమి పాఠశాలలో చదువుతున్నారు, నేనవత్ హనుమకుమారి కుమారులు నేనావత్ నవదీప్ 1 తరగతి, సాత్విక్ ఎల్‌కేజిలు విజయ మేరి స్కూల్‌లో చదువుతున్నారు. నేనావత్ సర్దార్‌జయ కుమారుడు నేనావత్ శివ ఎల్‌కేజి గౌతమి స్కూల్‌లో చదువుతున్నాడు. విరందరు రోజు మాదిరరిగానే పాఠశాలకు వెళ్లి ఒంటి పూట బడి కావడంతో మద్యాహానం వంటి గంట సమయంలో పిల్లల్లు అందరు ఇంటికి వచ్చి చిన్నారులు ఐదుగురు కలసి తండాకు పక్కనే ఉన్నా పెండ్లిపాకుల చెరువు నీటిలోకి ఈతకు వెళ్లి ఈత కాకపోవడంతో చెరువులో చిన్నారులు మునిగిపోయారు. దీంతో పిల్లలు కనబడకపోవడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు పక్కన తమ పిల్లల బట్టలు ఉండడంతో చెరువులో వేతకగా చెరువులో మృతదేహాలు లభ్యమైనవి ఐదుగురు పిల్లలు పడి మృతి చెందారు దీంతో పుట్టెడు దుఖంతో తల్లిదండ్రులు, స్థానికులు చెరువు నుంచి బయటికి తీసి చూడగా పిల్లలు మృతి చెందడాంతో తల్లిదండ్రులు ఎడవసాగరు దీంతో గ్రామంలో ఒకే వంశానికి చెందిన అన్నదమ్ములు పిల్లలు కావడం మూడు కుటుంబాల పిల్లలు చనిపోవడంతో గ్రామంలో విసాదాచాయలు అలుముకున్నాయి. పలువురిని కంటతడిపెట్టారు. ఒకే గ్రామంలో ఐదుగురు చిన్నారులు మృతి చెందాంతో పెను విషాదాం చోటు చెసుకుంది వేంటనే సంఘటన స్థాలనికి దేవరకొండ డిఎస్‌పి రవికుమార్, సీఐ శివరాంరరెడ్డి,తహాసిల్దార్ కిరణ్మాయి, ఎస్ శంకర్‌రెడ్డి, చెరుకుని చిన్నారుల మృతాదేహాలను పోస్టుమార్డర్ కోసం 108 వాహనంలో దేవరకొండ లోని ప్రభుత్వ దవాఖాన తరలించారు. జడ్పీ చైర్మన్ నేనావత్ బాలునాయక్‌తో పాటు మరికొంత మంది నాయకులు మృతి చెందిన కుటుంబాలకు పరామర్శించారు.

కనీస వేతనాలు చెల్లించాలి : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగర మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)తో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో 2015లో పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేశారని, ప్రభుత్వం కేవలం జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న కార్మికులకే వేతనం పెంచి జిల్లాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్పోరేషన్, నగర పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు మొండి చెయ్యి చూపడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల వివిధ శాఖలు, సంస్థలు, ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నట్లు జీవో విడుదల చేసిన ప్రభుత్వం దుర్భర జీవితాలను అనుభవిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల వివక్ష వైఖరిని అవలంభిస్తున్నదన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువ శాతం ఎస్‌సి, బిసిలేనని, దుర్వాసనలో పనిచేస్తూ, అనారోగ్యాలకు గురైతున్న వారి పట్ల పభుత్వం ఎందుకు నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నదని ఆయన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఒకే రకమైన పనిచేస్తున్న వారికి వేతన వ్యత్యాసం వుండకూడదని, కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికుల మాదిరిగా సమాన వేతనాలు ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు కనీస వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

అప్తమాలజిస్టుల్లో 40% మహిళలే

మన తెలంగాణ / హైదరాబాద్:దేశంలోని అప్తమాలజిస్టులలో 40 శాతం మంది మహిళలే ఉన్నారని విన్ విజన్ ఐ ఆసుప్రతి ఎండి, కాటరాక్ట్, రిప్రాక్టివ్ సర్జన్ డాక్టర్ శ్రీ లక్ష్మి నిమ్మగడ్డ తెలిపారు. ఇందులో చాలా మంది పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదని కొందరు ప్రాక్టిస్ చేయడమే మానేస్తున్నారని ఆవేదనను వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో అప్తమాలజిస్టులకు ఉండే అత్యాధునిక దోరణులు, ప్రొఫెషనల్స్‌గా ఎదిగే అవకాశాలను వివరించేందుకు ఉమెన్ సర్జన్ సమ్మిట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కంటి సంరక్షణలో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఉన్న నోవార్టిస్‌లో భాగంగా ఆల్కన్ సహకారంతో ఉమెన్ ఆప్తమాలజిస్టు సొసైటీ ఈ సదస్సును ఏర్పాటు చేసిందన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌ను శనివారం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీలక్ష్మి నిమ్మగడ్డ మాట్లాడుతూ ప్రొఫెషనల్‌గా తమకు ఎదురవుతున్న సమస్యలను చర్చించడంతో పాటు ఒంటరిగా ఎదుర్కొంటున్న సమస్యలు సమిష్టిగా అధిగమించేందుకు ఈ సమ్మిట్ బహిరంగ వేదికలాంటిందన్నారు. ఆధునిక కంటి చికిత్స భవిష్యత్‌పై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. కంటి ఆసుపత్రిలో సురక్షితమైన అపరేషన్ల గురించి కూడా చర్చించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా ఆధునిక కంటి సంరక్షణలో ప్లాక్స్ పాత్ర, కాటరాక్ట్ శస్త్ర చికిత్సలో లేజర్ జోడింపు తదితర అంశాలపై కూడా చర్చించనున్నామన్నారు. బ్లెడ్‌లెస్ లేజిక్ సర్జరీ, ఆధునిక కంటి సంరక్షణ పరిష్కారాలు, రోగికీ కటకాల అవకాశాలు, టెక్నిక్, టెకాల్నజీ మధ్య సమన్వయం, పరిమాణం నుంఇచ దృష్టి నాణ్యత ప్రయాణం, రిఫ్రాక్టివ్ సర్జరీ, దృష్టి నాణ్యత అంశాలపై చర్చించనున్నారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సొసైటీలో ట్రైనీల నుంచి సీజన్డ్ ప్రాక్టిషనర్స్ నుంచి ప్రభుత్వ సంస్థలలో పనిచేసే అప్తమాలజిస్టుల వరకు అందరూ భాగస్వాములను చేయాలనే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమానికి గెస్ట్ స్పీకర్‌గా ఎవరెస్టు శిఖరాన్ని అధిగరోహించిన మొదటి భారతీయ దివ్యాంగురాలు అరుణసిన్హా హాజరవుతారని తెలిపారు.

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె



మన తెలంగాణ/హైదరాబాద్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 30 తర్వాత నిరవధిక సమ్మె చేపడుతామని తెలంగాణ మున్సి పల్ కార్మిక సంఘాల జెఎసి హెచ్చరించింది. హైదరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ జెఎసి నేతలు కె.ఏసురత్నం, కె.సహదేవ్ (ఎఐటియుసి), పాలడుగు భాస్కర్, జె.వెంకటేష్(సిఐటియు), సూర్యం(ఐఎఫ్‌టియు), ఎం.కె.బోస్(టిఎన్‌టియుసి), నాయకులు యాదయ్య, ఎస్.ఎల్. పద్మ తదితరులు మున్సిపల్ శాఖ డైరక్టర్ టి.కె. శ్రీదేవికి సమ్మె నోటీసునిచ్చారు. కాగా కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగ గత మూడు రోజులుగా జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలి సిందే. కార్మికుల సమస్యలపై టి.కె.శ్రీదేవి జెఎసి ప్రతినిధులతో చర్చలు జరిపింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత కార్మిక సమస్యలను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఆమె హామీనిచ్చారు. సమ్మెను వాయిదా వేసుకోవాలని జెఎసి ప్రతినిధులను కోరినట్లు జెఎసి నాయకులు కె.ఏసురత్నం తెలిపారు. సమ్మెను విజయవంతం చేసిన కార్మికులను జెఎసి ప్రతినిధులు అభినందించారు.

ఉత్తమ్ ఉగాది శుభాకాంక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలుగు నూతన సంవత్సరంలో తెలంగాణ ప్రజలు, సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు పాడి పంటలు, సమృద్ధిగా పండాలని పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలతో ఉగాది పర్వదినోత్సవాన్ని జరుపుకోవాలని, ప్రజలకు ఆయన విళంబినామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని భూములకూ పెట్టుబడి

(మొదటిపేజీ తరువాయి)

కూడదని ప్రభుత్వం ముందుగా భావించింది. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యం కాని భూముల లెక్కలు తేల్చాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఆదేశించింది. ఎఇఒ (వ్యవసాయ విస్తరణ అధికారి)లు సాగు చేయడానికి వీలుకాని గుట్టలు, చెట్లు ఉన్న భూముల విస్తీర్ణం వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ గత నెలలో ఆదేశాలు జారీ చేసింది. కొంత మేరకు వివరాలు కూడా సేకరించారు. తరువాత సిఎం కె.చంద్రశేఖర్‌రావు పెట్టుబడి పథకంపై ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా సాగుకు యోగ్యం కాని భూముల వివరాలపై ఆరా తీసినట్లు తెలిసింది. వచ్చే ఏప్రిల్ నెలలో వానాకాలం సీజన్‌కు మొత్తంగా దాదాపు 1.62 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నామని, సాగుకు పనికిరాని భూ ములు 5 నుంచి 10 లక్షల ఎకరాలు ఉండే అవకాశం ఉన్నందున మొత్తం భూములుకు ఇద్దామని అన్నట్లు తెలిసింది. దీంతో ఎఇఒలు తాత్కాలికంగా సర్వేను నిలుపుదల చేశారు. ఇలాంటి భూములు ఉన్న రైతులు కూడా తమకు ఎకరాకు రూ.4వేలు అందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో సాగు భూమిగా మార్చుకుంటామని రైతులు పేర్కొంటున్నారని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారొకరు ''మన తెలంగాణ''కు చెప్పారు.

19న చెక్కుల ముద్రణపై తుది నిర్ణయం

పెట్టుబడి చెక్కుల ముద్రణ ప్రారంభంపై ఈ నెల 19వ తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రధాన భూపరిపాలన విభాగం నుంచి జిల్లాల వారీగా ఇంకా భూములు వివరాలు వ్యవసాయ శాఖకు అందలేదు. డిజిటలైజేషన్ నత్త నడకన సాగుతుండటంతో వివరాలు ఏ రకంగా ఇవ్వాలనే దానిపై స్పష్టత రావడం లేదు. అలాగే చెక్కులపై యూనిక్ ఐడి నెంబర్ ఉండలా వద్దా అనేది కూడా సాంకేతికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిసింది. చెక్కుపై రైతు పేరుతో సహా ఇంకా ఏమి ముద్రించాలిలనే దానిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. చెక్కుల పంపిణీలో అవకతవకలు లేకుండా రెండు, మూడు ఆడిటింగ్‌లు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది.

లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి ఇంట్లో ఎసిబి దాడులు

రూ. 3 కోట్ల ఆస్తులు, 30 తులాల బంగారం గుర్తింపు

మన తెలంగాణ/ హైదరాబాద్ సిటీబ్యూరో: నాంపల్లి లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) శనివారం ఉదయం దాడులు జరిపింది. ఆదాయానికి మించి అక్రమంగా కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టారనే అభియోగంతో వారాసిగూడలోని జడ్జీ గాంధీ ఇంట్లో ఎసిబి సోదాలు నిర్వహించింది. హైకోర్టు అనుమతిలో జడ్జి అక్రమ ఆస్తులపై దాడులు జరుపుతున్నారు. ప్రస్తుతం గాంధీ జిల్లా జడ్జి క్యాడర్‌లో ఉన్నారు. ఎసిబి అధికారులు జడ్జీపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వారాసిగూడలోని జడ్డీజ ఇంటితో పాటు నాంపల్లి, డిడి కాలనీ, ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో రెండు చోట్ల, ఏలూరు, రాజమండ్రితో సహా మొత్తం ఏడు చోట్ల ఏకకాలంలో ఎసిబి దాడులు చేపట్టినట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన తనిఖీల్లో రూ. 3 కోట్లు ఆస్తులు గుర్తించినట్టు ఎసిబి జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో వ్యవసాయ భూములతో పాటు 30 తులాల బంగారం, ఓ లాకర్‌ను కనుగొన్నట్టు ఆయన తెలిపారు. ఏడుచోట్ల తనిఖీలు కొనసాగుతున్నందున మరిన్ని ఆస్తులు వెలుగులోకి రావచ్చనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు.

సైనిక కుటుంబాలకు టీచర్ల ఒక రోజు వేతనం

మనతెలంగాణ/హైదరాబాద్ : సైనికుల కుటుంబాల సంక్షేమానికి జాక్టో, టిఎంఎస్‌టిఏ, టిటిజెఎసి, టిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు ఒక రోజు మూత వేతనం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటిస్తూ వినతిపత్రాలు సమర్పించాయని, వారి ఒక రోజు వేతనాన్ని మినహాయించి, ఆ మొత్తాన్ని సిఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేయాలని ట్రెజరీ శాఖను ఆదేశిస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

19న టి జెఎసి సమావేశం

పార్టీ జెండా, ఎజెండాపై చర్చలు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి ఈ నెల19న హైదరాబాద్‌లో 'రాజకీయ కార్యాచరణ, సన్నాహక సమావేశాన్ని' నిర్వహించనుంది. త్వరలోనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ప్రకటించిన నేపథ్యంలో దీనికి సంబంధించిన రాజకీయ ప్రక్రియపై ఈ సమావేశంలో చర్చించ నున్నారు. ఈ సమావేశంలో జెఎసి ముఖ్య ప్రతినిధులు, రీజినల్ కో– ఆర్డినేటర్లు, సన్నాహాక సభ కమిటీలో ప్రతిపాదించిన వారు హాజరుకానున్నారు. ప్రధానంగా సన్నాహక కమిటీ కూర్పు, పార్టీ నిర్మాణం, ఆవిర్భావ సభ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించనున్నారు. త్వరలోనే రాజకీయ పార్టీ పేరుపై ఎన్నికల సంఘం నుంచి ఆమోదం రానుంది. 'తెలంగాణ జన సమితి'(టిజెఎస్) పేరుతోనే రాజకీయ పార్టీ ఏర్పాటు కానుంది. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ, జెఎసిలో ఎవరు ఉంటారనే అంశంపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది. రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యకలాపాలను ' సన్నాహకమిటీ' ద్వారానే నిర్వహించాలని, ఈ వేదిక ద్వారానే రాజకీయ పరమైన కార్య క్రమాలను నిర్వహించాలని జెఎసి యోచిస్తోంది. ఇప్పటికే రాజకీయ పార్టీ నిర్మాణం, జెండా, ఏజెండా అంశాలపై ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. కాగా పార్టీ జెండా రంగు, డిజైన్ రూపకల్పనపై కసరత్తు జరుగుతోంది. రాజకీయ పార్టీ సభ నిర్వహణకు ముందు, ఆ తర్వాత వ్యవహారించాల్సిన వ్యూహాలు, పార్టీలో చేరికలు తదితర అంశాలపై ఇది వరకే కోదండరామ్ పలువురితో చర్చించినట్లు తెలిసింది. ఇటీవల మాజీ ఎంఎల్‌సి కపిలివాయి దిలీప్‌కుమార్, ప్రజా తెలంగాణ కన్వీనర్ గాదె ఇన్నయ్యతో పాటు పలువురు పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా టిఆర్‌ఎస్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన కొందరు ముఖ్య నేతలు కోదండరామ్‌తో ఇది వరకే పలు మార్లు చర్చలు జరిపినట్లు తెలిసింది. రాజకీయ సన్నాహక సమావేశం తర్వాత రాజకీయ పార్టీలో చేరికలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : కనుకుల

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై టిఆర్ ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ సేవాదళ్ ఛైర్మన్, మాజీ ఎంఎల్‌సి కనుకుల జనార్దన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు అయినా కనీసం నాల్గవ వంతు ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయిందన్నారు. ఉద్యోగాలను నియమించకుండా ఉద్దేశపూర్వకంగానే నోటిఫికేషన్ల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందునే నోటిఫికేషన్లు జారీ చేస్తోందన్నారు. కోదండరామ్ ఆధ్వర్యంలో జరిగిన కొలువుల కోట్లాటకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే కోర్టు అనుమతి ద్వారా సభను నిర్వహించారని, ఎన్‌ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యపై పోరాటం చేస్తే పోలీసు కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు.

షడ్రుచుల సమ్మిళితం ఉగాది

మన తెలంగాణ/హైదరాబాద్: షడ్రుచుల సమ్మిళితమైన కమ్మనైన ఉగాది పచ్చడిలా తెలుగు ప్రజలు జీవితాలు సుఖ సంతోషాలతో ఉండాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మ ణ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

నాయకత్వ భర్తీకి టిడిపి నిర్ణయం

మన తెలంగాణ/హైదరాబాద్ : జిల్లాల్లో ఖాళీగా ఉన్న నియోజకవర్గ నాయకత్వాన్ని పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుల నివేదిక ఆధారంగా భర్తీ చేయాలని నిర్ణయించినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రమణ తెలిపారు. అనుబంధ సంఘాలను కూడా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం రమణ అధ్యక్షతన పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మార్చి 29వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలలో పార్టీ జెండాను ఆవిష్కరించాలని నిర్ణయించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో పెద్ద ఎత్తున ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రమణ తెలిపారు.

సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రమైన సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని శనివారం రాత్రి తన పదవికి రాజీనామా చేశారు. శనివారం సిరిసిల్ల అభివృద్ధి పనుల కోసం రూ.116.28 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించిన ఈ సందర్భంగా ఆమె కమీషన్లు స్వీకరించే పనులను చైర్‌పర్సన్ తన భర్త చూసుకుంటున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించారు. మున్సిపల్ కౌన్సిలర్లందరూ ఎన్నికల్లో ఖర్చులు చేసే గెలిచారని, వారందరూ కూడా కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. కాగా మున్సిపల్ వైస్ చైర్మన్ తవుటు కనకయ్యకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని రాత్రికి రాత్రే తన పదవికి రాజీనామా చేయడం సంచలనం కలిగించింది. సిరిసిల్ల మున్సిపాలిటీ చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్టు పావని లేఖలో పేర్కొన్నారు.

19న కోల్‌కతాకు కెసిఆర్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్వయంగా కలవనున్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం సిఎం కెసిఆర్ కోల్‌కత్తాకు కెసిఆర్ బయలుదేరి వెళ్ళనున్నారు. ఫ్రంట్‌పై తన ప్రతిపాదనలను, ఉద్దేశ్యాలను దీదీతో జరిగే సుమారు రెండున్నర గంటల సమావేశంలో వివరించనున్నారు. దేశంలో బిజెపి వ్యతిరేక పవనాలు మొదలయ్యాయి. ముఖ్యంగా రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల ఫలితాలతో అవి మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌డిఏ నుండి ప్రధాన భాగస్వాముల్లో ఒకటైన టిడిపి వైదలగడమే కాకుండా, అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. దీనికి వివిధ పార్టీలతో పాటు కాంగ్రెస్ కూడా మద్దతు పలుకుతోంది. టిడిపి వైదలగడానికి ప్రధాన కారణం రాష్ట్రానికి సంబంధించిన అంశమే కావడం గమనార్హం. మరోవైపు పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు కూడా మోడీ సర్కార్ ఆధిపత్య వైఖరిపై గుర్రుగా ఉన్నాయి. ఒకవైపు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఇంకా పుంజుకోకపోవడం, బిజెపికి వ్యతిరేకంగా గాలులు వీస్తుండడం ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు ఇదే సరైన సమయమని కెసిఆర్ భావిస్తున్నారు. ఇది రెండు జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లకు అతీతంగా ఉండాలని, తద్వారా రాష్ట్రాల హక్కులను, అధికారాలను సాధించుకోవచ్చనే వాదన ముందుకు తీసుకువస్తున్నారు. బిజెపికి వ్యతిరేకంగా నాలుగేళ్ళుగా వివిధ పార్టీలను కూడగడుతున్న మమతా బెనర్జీని తన ప్రతిపాదనకు ఒప్పించేందుకు కెసిఆర్ ప్రయత్నించే అవకాశముంది. అలాగే ఫెడరల్ ఫ్రంట్ దేశం ముందుకు తీసుకెళ్ళాల్సిన ఎజెండాను కూడా వారిరువురి మధ్య చర్చ సందర్భంగా ప్రస్తావించనున్నారు. ముఖ్యంగా రైతుల అంశాన్ని తెరపైకి తీసుకురావాలని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి అందిస్తున్న 24 గంటల విద్యుత్‌తో పాటు రైతులకు ఎకరానికి రూ.8 వేల పెట్టుబడి ఇస్తున్న విషయాన్ని కూడా సమగ్రంగా వివరించనున్నారు. దీనికి సంబంధించిన నివేదికలను సిద్ధం చేయడంలో సిఎంఒ అధికారులు తలమునకలయ్యారు. సిఎం కెసిఆర్‌తో పాటు కోల్‌కత్తాకు టిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు డాక్టర్ కె.కేశవరావు, ఒకరిద్దరు ముఖ్య నాయకులు వెళ్ళే అవకాశం ఉంది.

అసెంబ్లీకి హాజరై.. కోల్‌కతాకు పయనం

సోమవారం ఉదయం శాసనసభ సమావేశానికి సిఎం కెసిఆర్ హాజరవుతారు. అక్కడి నుండి నేరుగా బేగంపేటకు వెళ్లి ఉదయం 11:45 గంటల ప్రాంతంలో ప్రత్యేక విమానంలో కోల్‌కత్తాకు బయలుదేరుతారు. కోల్‌కత్తాకు చేరుకున్న తరువాత మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కోల్‌కత్తాలోని సచివాలయానికి వెళ్ళి మమతా బెనర్జీతో కెసిఆర్ భేటీ అవుతారు. సమావేశం ముగిసిన తరువాత ప్రఖ్యాత కాళీమాతా మందిర్‌ను కూడా ఆయన సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 7:40 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

దేశాన్ని మార్పు దిశగా నడిపించేందుకే

మార్పు దిశగా దేశాన్ని నడిపించేందుకోసమే ముఖ్యమంత్రి కెసిఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేస్తామని ప్రకటించారని టిఆర్‌ఎస్ ఎంపి కల్వకుంట్ల కవిత తెలిపారు. నల్సార్ యూనివర్సిటీ సెంటర్ ఫేర్ మేనేజ్ మెంట్ స్టడీస్ (సి.ఎమ్.ఎస్) నిర్వహించిన లీడర్ షిప్ సమ్మిట్ ప్రారంభ సెషన్ ముగిసిన తరువాత ఆమె మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఫెడరల్ ఫ్రంట్ అనేది రాజకీయ అంశం కాదని, ప్రజల ఆవసరాలు తీర్చుతూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకోసమేనని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా అమలు చేయాలన్నదే లక్ష్యం అన్నారు. అంతే తప్ప పదవులకోసమో మరింకో దానికో కేసీఆర్ ప్రాకులాడరన్నారు. 70 ఏళ్లలో దేశంలో జరగని అభివ ద్ధి ని తెలంగాణలో మూడేళ్ళలో సాధించామని తెలియజెప్పడంతో పాటు,దేశమంతటా అభివృద్ధి ఫలాలు అందిం చాలన్నదే కెసిఆర్ లక్ష్యం అన్నారు. కేంద్రప్రభుత్వం పై టిడిపి, వైసిపిల అవిశ్వాసంపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని కవిత తెలిపారు.

మోదేశాడు


(మొదటిపేజీ తరువాయి)

రంగం ఊపిరి తీశారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ చర్యలతో దేశంలోని యువత, రైతాంగం పూర్తిగా అసంతృప్తి చెందిందని అన్నారు. దేశం అంతా కూడా ఈ ముప్పును తప్పించుకోవాలని చూస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే దేశాన్ని ఏకం చేయగలదని, అదే విధంగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్లగలదని తెలిపారు. తమ పార్టీకి, ఇప్పటి అధికార పార్టీకి ఉన్న తేడాను గమనించాలని కోరారు. వారు విద్వేషాలను అసహనాన్ని పెంచారని, తమ పార్టీ ప్రేమ ఆదరణ, సహోదరత్వాన్ని చాటిచెప్పిందని అన్నారు. తన నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీలో సీనియర్, యువ నేతలను తగు విధంగా పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లుతామని రాహుల్ వెల్లడించారు. మార్పును స్వాగతించడం తమ పార్టీ సాంప్రదాయం అని, ఇదే సమయంలో గతం, ఘనమైన వారసత్వం విస్మరణ ఉండదని స్పష్టం చేశారు. యువతరం కాంగ్రెస్ పార్టీని వేగవంతం చేస్తుందని, అయితే అనుభవజ్ఞులైన పార్టీ సీనియర్ల సాయం లేనిదే ముందుకు కదలదని, ఈ కీలక సమీకరణను పాతకొత్తల మేలు కలయికను సాధించే బాధ్యతనే తనదని రాహుల్ సవినయంగా తెలిపారు. దేశానికి, పార్టీకి నూతన పంథా చూపడమే తన కర్తవ్యం అన్నారు. భారతదేశం అందరిదీ. ప్రతి మతానికి, కులానికి, వ్యక్తులకు చెందినది. ఈ దేశం ఏ ఒక్కరిదో కాదు. ఏ వర్గానిదో కానేకాదు. కాంగ్రె స్ ఏం చేసినా దేశం అంతటికి చేస్తుంది. దేశంలో ప్రతి వ్యక్తికి వర్గ తేడాలు లేకుండా మేలు చేస్తుందని రాహుల్ తెలిపారు. ఎవరిని విస్మరించడం, కొందరికే ప్రాధాన్యత ఇవ్వడం అనేది కాంగ్రెస్ లక్షణమే కాదని స్పష్టం చేశారు. ప్రజలందరి ఐక్యతకోసమే తమ పార్టీ పాటుపడుతుందని, పార్టీ చేతి గుర్తుతోనే ఐక్యతా బిగింపు సాధ్యం అవుతుందని అన్నారు. పార్టీ రెండు రోజుల ప్లీనరీకి పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ పలువురు ఇతర నాయకులు హాజరయ్యారు.

కల్లబొల్లి వాగ్దానాలతో అధికారంలోకి మోడీ

ప్రధాని మోడీ కపటనాటకాలతో ప్రజలను మభ్యపెట్టారని, అధికారం కోసం డ్రామాబాజీ సాగించారని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ ప్లీనరీలో సోనియా తీవ్రస్థాయి ప్రసంగం సాగింది. ఎన్నికలకు ముందు మోడీ పలు కల్లబొల్లి వాగ్దానాలు చేశారని, అవినీతి అంతం అన్నారని, సమిశ్రత ప్రగతి అన్నారని, ఉద్యోగాల కల్పన అన్నారని అయితే ఇవన్నీ కేవలం అధికారపు కాంక్షతో సాగిన కపటనాటకంలో భాగం అని తేలిందని సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలోని నేతలు, కార్యకర్తలు అంతా ప్రస్తుత తరణంలో ఐక్యంగా నిలిచి మరింత శక్తివంతంగా మారి, ప్రస్తుత పాలనతో తలెత్తిన సవాళ్లను తిప్పికొట్టాల్సి ఉందని పిలుపు నిచ్చారు. దేశంలో నెలకొన్న అధికార ఉత్పాత వాతావరణాన్ని ఛేదించేందుకు పార్టీ అంతా కలిసికట్టుగా సాగాల్సి ఉందని సోనియా కోరారు. ఎన్నికల సమయంలో మోడీ పలు ఆకర్షక నినాదాలకు దిగారని, సబ్‌కాసాథ్,సబ్‌కా వికాస్, తాను అనను ఇతరులను అననివ్వను అనే మాటలు అన్నీ కూడా డ్రామేబాజీగా మారాయని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ కుంభకోణాలను తమ పార్టీ ఆధారాలతో పాటు ప్రజల ముందు ఉంచుతుందని సోనియా వెల్లడించారు. అత్యంత క్లిష్ట సమయంలో పార్టీ సారధ్య బాధ్యతలు తీసుకున్న రాహుల్‌ను బలోపేతం చేయాలని తల్లిగా, కాంగ్రెస్ పూర్వ అధ్యక్షురాలిగా సోనియా పిలుపు నిచ్చారు.

బ్యాలెట్‌తోనే ఎన్నికలు



ఇవిఎంలు వద్దు, మునుపటిలాగానే బ్యాలెట్ పత్రాలతోనే ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. పార్టీ 84వ ప్లీనరీ సందర్భంగా ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. దేశంలో ఇక ముందు జరిగే ఎన్నికలను బ్యాలెట్ పత్రాలతోనే నిర్వహించడం మంచిదని, ఈ విధంగా ఎన్నికల విధానాల సమగ్రతకు, పారదర్శకతకు వీలుంటుందని పార్టీ పేర్కొంది. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని, సంఘ్‌పరివార్‌ను ఓడించేందుకు భావసారూప్య, లౌకిక పార్టీల ఐక్యతకు కాంగ్రెస్ పిలుపు నిచ్చింది. కేంద్రంలో ఎన్‌డిఎను దెబ్బతీసేందుకు అన్ని పార్టీలు ఉమ్మడి ఆచరణీయ కార్యక్రమంతో ముందుకు రావల్సి ఉందని, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల ఐక్యతకు రాహుల్ గాంధీ ముమ్మర యత్నాలు చేస్తున్న తరుణంలో ఈ కీలక తీర్మానం వెలువడింది. దేశంలో రైతాంగం సమస్యలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్లీనరీలో కీలక తీర్మానం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చిన్న, మధ్యతరహా రైతుల రుణాలను మాఫీ చేస్తామన్నారు.

మళ్లీ కాబోయే ముఖ్యమంత్రి కెసిఆరే : ఎంఎల్‌ఎ ఆల



మన తెలంగాణ/ మూసాపేట (మహబూబ్‌నగర్ జిల్లా) : ఎవరూ ఎన్ని కథలు చెప్పినా మళ్లీ ముఖ్యమంత్రిగా కాబోయేది కెసిఆర్‌రే నని దేవరకద్ర ఎంఎల్‌ఎ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మూసాపేట మండల కేంద్రానికి చెందిన యువకులు గ్రామ సమస్యలపై ఎంఎల్‌ఎ ఆల స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా యువతనుద్దేశించి ఎం ఎల్‌ఎ ఆల మాట్లాడుతూ 60 ఏళ్ల ఆంధ్రుల పరిపాలన అంతమయ్యాక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి తన వంతు కృషి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అహర్నిశలు పని చేస్తున్నానని యువత పని చేస్తున్న నాయకుల వెంబడే ఉండాలని ఆయన కోరారు. మూసాపేట మండల కేంద్రంగా ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో కంటే పాలకులు , అధికారులు మారారని గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అలాగే మూసాపేట గ్రామ పంచాయతీని ఖచ్చితంగా ఏర్పాటు చేస్తానని ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఏర్పాటు అయితే యువత తమ వెంబడే ఉంటుందని యువకులు చెప్పారు. ఎంఎల్‌ఎను కలిసిన వారిలో యూత్ అధ్యక్షుడు కృష్ణ, కురుమూర్తి, శేఖర్, అన్వర్, చిరంజీవి, రఘు, శ్రీను, లక్ష్మ ణ్, మున్నూరు రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయిలో రైతులకు గుర్తింపు

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మనతెలంగాణ/ బోధన్ (నిజామాబాద్ జిల్లా): జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రైతులకు గుర్తింపు లభించే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలోని సిసిడిలో కృషివిజ్ఞాన కేంద్రాల 10వ జాతీయ సదస్సును శనివారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీచే దేశవ్యాప్తంగా 25 నూతన కృషి విజ్ఞాన కేంద్రాలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రొజెక్టర్ల ద్వారా లైవ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్పత్తులను పెంచేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం 2 లక్షల మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి జరుగుతున్నాయని, 2025 సంవత్సరం కల్లా రైతుల ఆదాయం మరింత రెట్టింపు కావాలని మంత్రి ఆకాంక్షించారు.

బాబువి ఊసరవెల్లి రాజకీయాలు

వైఎస్సార్ సిపి రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

మనతెలంగాణ/ మిర్యాలగూడ (నల్లగొండ జిల్లా) : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఉద్యమస్ఫూర్తి కల్గించింది వైఎస్సార్ సిపినే అని, ముఖ్యమంత్రి చంద్రబాబుది ఊసరవెల్లి రాజకీయాలని వైఎస్సార్ సిపి రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ సిపి ప్రత్యేక హోదా కోసం తీవ్రంగా కృషి చేస్తుండగా కేంద్ర కేబినెట్‌లో తెలుగుదేశం పూర్తిగా విఫలమైందన్నారు. మే చివరి వారం లేదా జూన్‌లో 54 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకుంటామన్నారు. సిఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనసభ్యులు సం పత్‌కుమార్‌లను సస్పెన్షన్ చేయడం అప్రజాస్వామికమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఇంజం నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

భర్తను దారుణంగా హత్యచేసిన భార్య

వివాహేతర సంబంధమే కారణం



మన తెలంగాణ/ షాపూర్‌నగర్: శ్రీకాకుళం జిల్లా గీతాపురం మండలం వంగూరు గ్రామానికి చెందిన సంహాచలం(42) విజయ దంపతులు బ్రతకు దెరువు నిమిత్తం నాలుగేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి స్థానికంగా కుత్బుల్లాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఇంటర్ మొదటి సంవత్సరం ఒకరు, తొమ్మిదవ తరగతి మరోకరు చదువుతున్నారు. వృత్తిరిత్యా సింహచలం బొంతలు అమ్మే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూన్నాడు. ఇదే క్రమంలో అదే ప్రాంతానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి గౌరినాయుడుతో పరిచయం ఏర్పడంతో సింహాచలం ఇంటికి గౌరినాయుడు వస్తూ పోతూ ఉండేవాడు. ఈ క్రమంలో గౌరినాయుడికి విజయతో పరిచయం ఏర్పడి అదికాస్త అక్రమ సంభందానికి దారితీసింది. ఈ తతంగం దాదాపు నెలలుగా సాగడంతో చుట్ట పక్కలవారికి వీరి వ్యవహారం తెలిసిపోయి భర్త సింహచలంకు అనుమానం వచ్చేలా చేసింది. దీంతో సింహచలం పలుమార్లు భార్య విజయతో ఈ విషయమై గొడవ కూడా పెట్టుకొని హెచ్చరించగా విజయ ప్రియూడుతోకలిసి అతని అడ్డుతొలగించుకోవాలని ప్లాను ప్రకారం ప్రియూడు గౌరినాయూడిని ఇంటికి పిలిచింది. ఇద్దరు కలిసి సింహచలం ఇంటికి వచ్చే వరకు ఉన్నారు. ఇద్దరిని ఇంట్లో ఒకే చోట చూసిన భర్త సింహచలం ఇదేం దంటూ నిలదీశాడు. ఇదే క్రమంలో ఇద్దరూ కలిసి భర్త సింహచలంను వైరుతో గొంతు నులిమి హతమార్చారు. గురువారం రాత్రి ఇంట్లోనే హతమార్చిన వీరు పిల్లలు వచ్చే సరికి సహజ మరణంగా చిత్రీకరించారు. ఏడుస్తూ కన్నీటి పర్యంతమైన విజయను చూసిన పలువురు మొదట నిజమేనని నమ్మారు. శనివారం దహన సంస్కారాలకు సింహచలం మృతదేహన్ని ఫ్రిజర్ బాక్స్‌లో నుంచి తీయగా ఒంటిపై దెబ్బలు కనిపించాయి. దహన సంస్కాలరాలకు వచ్చిన బంధువులు చుట్టుపక్కల వారు గమనించ్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆరా తీయగా అస్సలు విషయం భయట పడింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించిన జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్టు

మన తెలంగాణ/ వికారాబాద్ రూరల్ (వికారాబాద్ జిల్లా) : డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ టి.క్రిష్ణ ప్రసాద్ ఐపిఎస్ ఆదేశాల ప్రకారం రైల్వేలు, రహదారి భద్రతా మార్గాలలో సాధారణ తనిఖీ చేస్తుండగా అహ్మద్ సిద్ధిఖీ (43) వికారాబాద్ ఫ్లాట్ మీద అనుమానాస్పదంగా తిరుగుతుండగా వికారాబాద్ రైల్వే పోలీసులు పట్టుకొని విచారించగా అతని వద్ద విలువైన ఆభరణాలు లభ్యమైనాయని తెలిపినారు. అతని వద్ద రూ.18 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు లభించాయని, ఇండ్లలో ప్లంబర్‌గా చేస్తూ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించేవాడన్నారు. అతను హైదారాబాద్‌లోని గోల్కొండ ప్రాంతంలో నివశిస్తూ వికారాబాద్, మహబూబ్‌నగర్ పరిసర ప్రాంతాలలో దొంగతనం చేసేవాడని వారు తెలిపారు. పలు దొంగతనాల కేసుల్లో 10 సార్లు అరెస్టు చేయబడినాడని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.శ్రీనివాస్, ఐఆర్‌పి కెఆర్‌సి రెడ్డి, ఎస్ఐఆర్‌పి మహబూబ్‌నగర్ పి.రాఘవేందర్ గౌడ్, బి.ప్రమోద్‌కుమార్, ఎస్ఐఆర్‌పి, నేర విభాగం పోలీసులు ఎం.రాజశేఖర్, ఆర్‌పిఎఫ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నందుకు రాజేంద్ర ప్రసాద్ అభినందించారని ఆయన తెలిపారు. సికిందరాబాద్ నగర పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

మనతెలంగాణ/ శేరిలింగంపల్లి : గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్ సంఘటన శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అసిస్టెంట్ ఎక్సైజ్ సుపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపిన ప్రకారం శేరిలింగంపల్లిలోని గోపినగర్‌కు చెదిన ఎం.వేమన్న (24) లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని ఖాళీ స్థలంలో గంజాయి అమ్ముతున్నారని సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు గంజాయి అమ్ముతున్న వేమన్న అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. అతని వద్ద 1.205 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేస్తున్న డి.శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి ఎక్సైజ్ సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ దయానంద్ ఉన్నారు.

రాజ్‌భవన్‌లో ఉగాది సంబురాలు

• వేడుకలలో కొత్త సంప్రదాయం : సిఎం కెసిఆర్ • పండుగలు ప్రకృతితో ముడిపడి ఉన్నాయి : ఉప రాష్ట్రపతి వెంకయ్య



మన తెలంగాణ / హైదరబాద్ : విళంబి నామ సంవత్సర ఉగాది వేడుకలను రాజ్ భవన్‌లో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గవర్నర్ దంపతులు ఇఎస్‌ఎల్ నరసింహన్, విమలా నర్సింహన్‌లు ఆతిథ్యమిచ్చిన ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావులు ముఖ్య అతిథులులా హాజరైనారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ స్వామి గౌడ్ , అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి, డిప్యూటి సిఎం మహ్మద్ మహమూద్ అలీ, మంత్రులు జగదీశ్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నాయిని నర్సింహారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, ఎంఎల్‌ఏలు కిషన్ రెడ్డి , ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె. జోషి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు పలువురు ఇతర ప్రజా ప్రతినిధులు , ఉన్నతాధికారులు హాజరైనారు. ఈ సందర్బంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒగ్గడోలు విన్యాసం, దేవనార్ స్కూల్ అంద విద్యార్థులు ప్రదర్శించిన సీతా స్వయం వరం కార్యక్రమాలతో పాటు గోదా కళ్యాణం, దశావతారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మన జీవితం , పండుగలు అంతా ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, ప్రకృతితో మమేకమై జీవించడమే భారతీయ సంస్కృతిలో భాగమని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఉగాది పండుగ నవ్యత, వినూత్నతకు చిహ్నమని పేర్కొన్న ఆయన తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పచ్చడి మాదిరే జీవితంలోనూ షడ్రుచులు ఉంటాయని వ్యాఖ్యానించారు. ఈ షడ్రుచులను మనం ఎలా ఆస్వాదిస్తామో జీవితంలో జరుగబోయే పరిణామాలను కూడా అలాగే ఎదుర్కోవాలన్నారు. పండుగలు, ప్రకృతికి ఉన్న అవినాభావ సంబంధాలను గుర్తు చేసుకోవాన్నారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తూ ప్రమాదం కొని తెచ్చుకుంటున్నామని వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తేట తెలుగులో గవర్నర్ చేసిన ప్రసంగం అందర్నీ అకట్టుకుంది. తెలుగు పండుగ ఉగాది మానవతా సంవత్సరమని గవర్నర్ వ్యాఖ్యానించారు.

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి

రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకల ఉత్సవాలతో గవర్నర్ నరసింహన్ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని సిఎం కెసిఆర్ అన్నారు. తెలుగు పండుగలను ఆరాధిస్తున్న నరసింహన్‌కు రాష్ట్ర ప్రజలందరి తరఫున ధన్యవాదములు తెలియజేస్తున్నానన్నారు. విళంబి నామ సంవత్సరంలో ప్రజలు శుఖశాంతులతో జీవించాలనిఆకాంక్షిస్తున్నానన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని ఆకాంక్షిస్తున్నట్లు సిఎం కెసిఆర్ తెలిపారు.

ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎల్పీ ఉప నేత జీవన్‌రెడి



మన తెలంగాణ/ కరీంనగర్ టౌన్ : ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న కా ళేశ్వరం ప్రాజెక్టు లోని ఆరు, ఏడు, ఎనిమిది ప్యాకెజి నిర్మాణాలు ప్రాణిహిత చేవెళ్లలో భాగమేనని, వీటికి కాంగ్రెస్ పాలనలలోనే టెండర్లు పూర్తి చేసి ప్రా రంభించింది నిజం కాదా అని ప్రశ్నిస్తూ, టిఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని యథావిధిగా చేపడితే కాంగ్రెస్‌కి పేరు వస్తుందని కాళేశ్వరంగా రీడిజైన్ చేశారని అన్నారు. ప్రాజెక్టు అంచనా లక్షకోట్లకి చేర్చారని, ప్రాజెక్టుని గవర్నర్ సందర్శించి ఆసియా ఖండంలోనే లేదని మాట్లాడడం విడ్డూరమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ ఏడాది ఎల్లంపల్లి ప్రాజెక్టులోని నీరు వృథాగా పోయిందని, కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజి 6, 7, 8 పనులు డిజైన్‌లలో మార్పులు చేస్తే ఎందుకు తెలపలేదన్నారు. రాష్ట్ర అప్పులు రూ. లక్ష 40 వేల కోట్లని కెసిఆర్ చెబుతున్నారని, కార్పొరేషన్ల అప్పులు కలిపితే 2రూ. లక్షల కోట్లకి చేరిన సంగతి మరిచారా అని ఆయన ప్రశ్నించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కంటే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరు వరకు ప్రభుత్వం చేసిన మార్పులు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మేడారం చెరువు పనులను జాప్యం చేయడం వలన ఎస్సారెస్పి రైతాంగం ఖరీఫ్ రబీ పంటలు కోల్పోతున్నది వాస్తవం కాదా?అన్నారు. ప్రాణహిత చేవెళ్లలోని తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 60 శాతం కాలువ పంటలు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు కర్ర రాజశేఖర్, మాజీ జడ్పీ చైర్మన్ లక్ష్మ ణ్ కుమార్, పిసిసి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి గందె మాధవిమహేష్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

• మహిళల సమస్యల పరిష్కారానికే వన్‌స్టాఫ్ సెంటర్లు • త్వరలో అన్ని జిల్లాల్లో సెంటర్ల ఏర్పాటు
• ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



మనతెలంగాణ/ వరంగల్ బ్యూరో: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వన్‌స్టాఫ్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇవి మహిళలకు ఎంతగానో దోహద పడుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. శనివారం హన్మకొండలో ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలకు అన్నివిధాలుగా అండగా ఉంటూ వేధింపులు, హింస నుంచి వారికి రక్షణ కల్పించే విధంగా వన్‌స్టాప్ సెంటర్ హన్మకొండలో ఏర్పాటు చేయడం, మహిళల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని ఆయనన్నారు. గతంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు జరిగిన, గృహహింస చేసిన మహిళలు అనేక కేంద్రాలకు తిరగవలసి వచ్చేదని సమస్య పరిష్కారానికి ఫిర్యాదు చేయడానికి ఇంకా అలాంటి ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, నూతనంగా ఏర్పాటు చేసిన 21 జిల్లా కేంద్రాల్లో కూడా వన్‌స్టాప్ మహి ళా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయుటకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం కూడా మిగతా జిల్లాలలో వన్‌స్టాప్ సెంటర్‌లను మం జూరి చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించిందని, త్వరలోనే మిగతా జిల్లాల్లో వన్‌స్టాఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా మహిలా సమస్యలను ఒక వేదిక ద్వారా పరిష్కరించుటకు ఆయనన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపుల నుంచి రక్షణ కల్పించడానికి అనేక సహాయ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగిందని, షీటీంలు, 181 హెల్ప్‌లైన్, డివి సెల్ఫ్ గతంలో పనిచేస్తున్నాయని వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి అన్నారు. మహిళలకు తక్షణ సహాయంలో భాగంగా కౌన్సిలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం, పోలీసు సహాయం 24 గంటలు ఇట్టి సహాయాలు అందించడానికి ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.పద్మ, ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు వినయభాస్కర్, ఆరూరి రమేష్, మహిళా కో ఆర్డినేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జి.సుధారాణి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దంపతుల ఆత్మహత్యాయత్నం



మన తెలంగాణ/ హుస్నాబాద్ (కరీంనగర్ జిల్లా) : రైతు దంపతులు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట కలకలం రేపింది. వివరాల ప్రకారం నియోజకవర్గంలోని కోహెడ మండలంలోని కూరెల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేతిరెడ్డి బాల్‌రెడ్డి, భార్య వెంకటవ్వ దంపతులు గత ఆరు నెలల నుంచి భూసమస్య పరిష్కారం కోసం మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మనస్థాపంతో ఉండగా శుక్రవారం రోజున భూ శుద్ధీకరణ పహాణీ పత్రాలు గ్రామంలో అందిచారు. అందులో బాల్‌రెడ్డి పహాణీ రాలేదని మనస్థాపానికి గురైన దంపతులు ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సర్వే నంబర్ 550లో 4 ఎకరాల 21 గుంటలు ఉండగా బాల్‌రెడ్డి తమ్ముడు అయిన రాంచందర్‌రెడ్డి ఆ భూమిలో 3 ఎకరాల భూమి అదే గ్రామానికి చెందిన గడ్డం కనుకయ్యకు అమ్మగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగి కోర్టుకు వెళ్లగా కోర్టు తీర్పు సైతం బాల్‌రెడ్డికి అనుగుణంగానే వచ్చినా గాని భూమి కొన్న వ్యక్తి ఆ భూమిని ఇవ్వడానికి తిరస్కరించడంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా వారు సైతం పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలియజేశారు.

నేత కార్మికుడి ఆత్మహత్య

మనతెలంగాణ/ రామన్నపేట (యాదాద్రి భువనగిరి జిల్లా) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం తొండల్‌వాయి గ్రామానికి చెందిన మి ర్యాల వెంకటేశం(45)కు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పద్మతో 25 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వృత్తి రిత్యా చేనేత కార్మికుడు అయిన వెంకటేశం గ్రామములో పని దొరకకపోవడంతో తన అత్తగారి గ్రామమైన సిరిపురంకు భార్య, తన ఇద్దరు కూతుళ్ళను తీసుకొని వచ్చి చేనేత పని చేసుకుంటూ జీవితాన్ని గడిపాడు. జీవనోపాధి కోసం పక్క గ్రామమైన వెల్లంకికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ చేనేత కూలి పని చేయ సాగాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావటం కుటుంబ పోషణ భారం కావడంతో మనస్థాపం చెందిన వెంకటేశం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

200 సబ్సిడీ గొర్రెల పట్టివేత



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాతం గళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో సబ్సిడీ గొర్రెలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అరె స్ట్ చేశారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ గొర్రెలను పొందిన లబ్ధిదారులైన చీర్లవంచ గ్రామానికి చెందిన బాస మల్లేశం, రహీంఖాన్‌పేటకు చెందిన గుడిసె దేవయ్య, ఏనుగుల కనకయ్యలు 200 సబ్సిడీ గొర్రెలను చీర్లవంచకు చెంది న కురేషి రెహ్మాన్, చింతల్ ఠాణాకు చెందిన మొహ్మద్ అహ్మద్, అబ్దుల్ రజాక్, కొదురుపాకకు చెందిన మల్యా ల బాలయ్యలకు అమ్మేశారు. కాగా సబ్సిడీ గొర్రెలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎస్‌పి రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు దాడులు జరిపి రెండు లారీలలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 200 గొర్రెలను స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 125 రైతు వేదికల గుర్తింపు

• రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి : రాష్ట్ర 137 రైతు వేదికలకు గాను 125 రైతు వేధికలను గుర్తించడం జరిగిందని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం త్రిపురారం మండలం కంపాసాగర్‌లో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కెవికె 2018 కార్యక్రమాన్ని కలెక్టర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, రైతులకు ఈ శిక్షణ కేంద్రాలలో శిక్షణ ఇప్పించి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరిచేలా కృషి చేయాలని, వ్యవసాయాన్ని లాభసాటీగా మార్చేందుకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 125 రైతు వేదికలను గుర్తించామని, మిగతా వాటి కొరకు దాతలు ముందుకు వచ్చి అనువైన భూమిని అందించినట్లయితే అక్కడ కూడా రైతు వేదికలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రెండు పంటలు వేసే రైతులకు 8వేలు చొప్పున పంట పెట్టుబడి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, రైతు జీవన్ భీమా కొరకు రైతులలో అవగాహన పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన కింద 2 లక్షలు చెల్లించడం జరుగుతుందని, అది 50 సంవత్సరాలు గల వారికి మాత్రమే వర్తిస్తుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కెవికె కంపాసాగర్ ఇంచార్జీ బాలాజీనాయక్, అగ్రికల్చర్ ఏడి నర్సింగరావు, సీడ్ కార్పోరేషన్ డైరెక్టర్ నగేష్, మాజీ శాసనసభ్యులు రాంమూర్తియాదవ్, జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి వేధింపులకు విద్యార్థిని బలి



మన తెలంగాణ/ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడి వేధింపులకు ఓ విద్యార్థిని బలైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిల్కూర్ గ్రామంలో సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిల్కూర్ గ్రామానికి చెందిన కుమ్మరి యాదయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు పూజిత ఇంటర్ చదువుతుండగా చిన్న కూతురు తేజస్విని గ్రామంలోని శివసాయి ఇంటర్నేషనల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మెదక్ జిల్లా నర్సపూర్‌కు చెందిన బొల్లు ప్రశాంత్ గత కొన్ని రోజులుగా తేజస్విని ప్రేమ పేరుతో వేధిస్తున్నారు. గతవారం ప్రశాంత్ కొత్త సెల్ ఫోన్ కొని తేజస్వినికి ఇవ్వడానికి ప్రయత్నించిన నిరాకరించింది. సెల్‌ఫోన్ తీసుకోకపోవడంతో తేజస్వీనికి ప్రశాంత్ నుంచి వేధింపులు మరింత అధికమయ్యాయి. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన తేజస్విని శనివారం ఉదయం తెల్లవారు జామున కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా కిరోసిన్‌ను పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తాళలేక కేకలు వేయడంతో తల్లిదండ్రులు నిద్ర లేచి మంటలు ఆర్పే ప్రయత్నం చేయడంలో వారికి సైతం స్వల్పంగా గాయాలైయ్యాయి. పూర్తిగా కాలిన తేజస్విని అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఉపాధ్యాయుడి వేధింపులు మూలంగానే తమ కూతురు మరణించిందని తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహంతో శివసాయి ఇంటర్నేషనల్ పాఠశాల గేటు ఎదుట బైఠాయించారు. తేజస్విని మరణానికి కారణమైన ప్రశాంత్‌పై చర్యలు తీసుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు న్యా యం చేయాలన్నా డిమాండ్‌తో శనివారం సాయంత్రం వరకు మృతదేహంతో అక్కడే ఉన్నారు. మొయినాబాద్ సిఐ సునీత అనుమానాస్పద మరణం కింద కేసు నమోదు చేసుకుని విచారణ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడు ప్రశాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మైసిగండిలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకుల దుర్మరణం



మన తెలంగాణ/ ఆమనగల్లు/కడ్తాల(రంగారెడ్డి జిల్లా) : స్నేహితుని పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకోని మిత్ర బృందం ఇన్నోవా కారులో విహారయాత్రకు బయలుదేరారు. బయలుదేరిన గంటలోపే రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి చెందగా మరో ఏడుగురు మిత్రులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం ఎదుట శ్రీశైలం హైదారాబాద్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమనగల్లు సిఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్ఐ సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం హైదారాబాద్‌లోని మలక్‌పేట ప్రాంతానికి చెందిన ఎండి ఖాషిఫ్ పుట్టిన రోజు సందర్భంగా తన తోటి మిత్రులైన ఎండి. ఫిరోజ్ (25) మాదన్నపేట్, సయ్యద్. సమీర్ (24) మలక్‌పేట్, ఎండి. మోహిన్ (22) ఓల్డ్ మలక్‌పేట్, ఎండి. వహాజ్ (21) ఓల్డ్ మలక్‌పేట్, సయ్యద్. అబ్దుల్ ఖరీమ్ (30) మలక్‌పేట్, అస్గర్ అలీ (24) మలక్‌పేట్, రీయజ్ ఇక్బాల్ (29) సైదాబాద్, ఎండి అఫ్సర్ (25) మలక్‌పేట్ ప్రాంతానికి చెందిన మిత్రుల బృందం శ్రీశైలం డ్యాం చూడడానికి ఇన్నోవా వాహనంలో బయలుదేరారు. శనివారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవస్థానం ఎదుట, శ్రీశైలం–హైదారాబాద్ జాతీయ రహదారిపై ఆగిఉన్న టిప్పర్‌ను ఇన్నోవా వాహనం వేగంగా ఢీ కొనడంతో వాహనం నుజ్జునుజ్జయింది. వాహనం ముందు వరుసలో ఉన్న సయ్యద్. సమీర్, ఎండి.ఫిరోజ్‌లు వాహనంలో చిక్కుకోని అక్కడిక్కడే దుర్మరణం చెందారు. మృతి చెందిన సయ్యద్. సమీర్, ఎండి. ఫిరోజ్‌లను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మోహిన్, అస్గర్, ఖాషిఫ్‌ల పరిస్థితి విషమంగా ఉందన్నారు. గాయపడ్డ వారిని హైదారాబద్‌లోని వివిధ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తరలించారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందరయ్య తెలిపారు. మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

ఆ విషయాన్ని రహస్యంగా ఉంచను



ప్రేమ విషయంలో తాను ఎంతో పరిణితిగా ఆలోచిస్తానని చెప్పింది స్టార్ బ్యూటీ అనుష్క. తన దృష్టిలో యవ్వన ప్రాయంలో కలిగే ఓ మ్యాజిక్‌లాంటిదే ప్రేమ అని తేల్చి చెప్పింది. వయసు పెరిగే కొద్దీ భావోద్వేగాల తీవ్రత తగ్గిపోతుందని, టీనేజ్ రోజుల్లోని సంఘటనల్ని తలచుకుంటే సిల్లీగా అనిపిస్తాయని పేర్కొంది. తాజాగా అనుష్క ప్రేమ గురించి మాట్లాడుతూ "యవ్వనం ఆరంభంలో ప్రేమ గురించి ప్రతి ఒక్కరు తీయటి కలలుకంటూ ఉంటారు. జీవితంపై ఏమాత్రం అవగాహనలేని వయసు కాబట్టి ఒక్క ప్రేమ గురించి తప్ప వేరే విషయం గురించి ఆలోచించరు. చాలామంది తాము ప్రేమలో ఉన్నామనే కృత్రిమమైన భావన కలిగిఉంటారు. అందుకే టీనేజ్ ప్రేమ కథలు కొద్దిరోజుల్లోనే విఫలమవుతాయి. వయసు పెరిగే కొద్దీ ప్రేమపై మన అభిప్రాయాలన్నీ తప్పని అర్థమవుతుంది" అని తెలిపింది అనుష్క. మరి మీరెప్పుడైనా ప్రేమలో పడ్డారా అని అడగ్గా... "ఇప్పటివరకు నేను ప్రేమలో పడలేదు. ప్రస్తుతం నేను నా సినిమాల్ని మాత్రమే ప్రేమిస్తున్నాను. ఒకవేళ ఎవరినైనా ప్రేమిస్తే ఆ విషయాన్ని బహిరంగంగానే చెబుతాను. రహస్యంగా ఉంచను" అని చెప్పింది ఈ బ్యూటీ.

స్క్రిప్ట్ నచ్చితేనే చేస్తా



కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ హీరోహీరోయిన్లుగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎంఎల్ఎ'. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మిస్తున్న చిత్రమిది. ఈ చిత్రం ఈనెల 23న విడుదలకానుంది. ఈ సందర్భంగా హీరో కల్యాణ్‌రామ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...

లవ్‌స్టోరీ కూడా ఉంటుంది...

'ఎంఎల్ఎ' టైటిల్‌లోనే హీరో క్యారెక్టరైజేషన్ ఉంటుంది. కథానాయకుడు మంచి లక్షణాలున్న అబ్బాయి. ఇంతవరకు నేను పూర్తి ప్రేమ కథా చిత్రం చేయలేదు. 'ఎంఎల్ఎ' చిత్రంలో లవ్ స్టోరీ కూడా ఉంటుంది. లవ్‌స్టోరీతో సినిమా ప్రారంభమవుతుంది. . ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తుంది ఈ చిత్రం.

కొత్త అనుభూతి...

సినిమాలో పోలిటిక్స్ కూడా ఉంటాయి. కానీ రాజకీయాల నేపథ్యంలోనే మొత్తం సినిమా అంతా ఉండదు. ఒక ఊరిలో ఉన్న సమస్యను హీరో ఎలా తీరుస్తాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. అదేవిధంగా హీరో విలన్‌ను ఓ విషయంలో ఛాలెంజ్ చేస్తాడు. ఆద్యంతం సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది.

వినోదమే ప్రధానంగా...

దర్శకుడు ఉపేంద్ర రాసిన డైలాగ్స్ ఎంతో బాగుంటాయి. రచయిత కావడం వల్ల అతను తనదైన స్టైల్‌లో సినిమాను తెరకెక్కించాడు. ఇక నేను డైలాగ్స్ చెప్పే విధానంలోనూ కొత్తదనం కనిపిస్తుంది. వినోదమే ప్రధానంగా దర్శకుడు సినిమాను తెరకెక్కించాడు. డిఫరెంట్‌గా ఉండే ఈ సినిమాలో హీరోను కొత్తగా చూపించాడు.

కమర్షియల్ అంశాలతో...

ఏ సినిమా అయినా స్క్రిప్ట్ నచ్చితేనే నేను చేస్తాను. కొత్తదనంతో కూడిన విభిన్నమైన చిత్రాలనే ఇప్పటివరకు చేశాను. ఇప్పుడు కూడా 'ఎంఎల్ఎ' స్క్రిప్ట్ నచ్చి చేశాను. కమర్షియల్ అంశాలతో కూడిన వినోదాత్మక చిత్రమిది. ఎంతో ఇష్టపడి ఈ సినిమా చేశాను. కొత్తదనాన్ని ఆశించే ప్రేక్షకులకు సినిమా ఎంతగానో నచ్చుతుంది.

యూనివర్సల్ మూవీ చేస్తున్నా...

సూపర్‌హిట్ సినిమా పటాస్ తర్వాత పూరీతో ఇజం చేశాను. ఇజం నాకు పూర్తి సంతృప్తినిచ్చింది. ఇప్పుడు కమర్షియల్ మూవీ 'ఎంఎల్ఎ' చేశాను. ఇక దర్శకుడు జయేంద్రతో చేస్తున్న సినిమా యూనివర్సల్ స్క్రిప్ట్‌తో రూపుదిద్దుకుంటోంది.

మల్టీస్టారర్ చేయబోతున్నా...

ఇటీవల సాయిధరమ్‌తేజ్‌తో ఓ మల్టీస్టారర్ ఆఫర్ వచ్చినా స్క్రిప్ట్ నచ్చకపోవడంతో అది తెరకెక్కలేదు. అయితే నేను మరో మల్టీస్టారర్ చేయడానికి ఓకే చెప్పాను. జూన్‌లో ఈ సినిమా గురించి ప్రకటించడం జరుగుతుంది.

రవితేజ-కల్యాణ్‌కృష్ణల 'నేల టిక్కెట్టు'



ఎస్‌ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సోగ్గాడే చిన్ని నాయనా, రారండోయ్ వేడుక చూద్దాం వంటి సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన కల్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో రాజా ది గ్రేట్ చిత్రంతో అదరగొట్టిన రవితేజ హీరోగా ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. రామ్‌తాళ్లూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని ఉగాది పండుగ సందర్భంగా రవితేజ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఇక ఈ చిత్రానికి 'నేల టిక్కెట్టు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. క్లాస్, మాస్ మేళవింపుతో ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. దాదాపు 60 శాతం షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని మే 24న విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ అనుకుంటున్నారు. రవితేజ సరసన మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు, బ్రహ్మానందం, జయప్రకాష్, రఘుబాబు, సుబ్బరాజు, అలీ, పోసాని కృష్ణమురళి, అన్నపూర్ణమ్మ, ప్రియదర్శి, ప్రభాస్, శ్రీను, పృథ్వీ, సురేఖవాణి, ప్రవీణ్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ముఖేష్, సంగీతం: కార్తీక్, కూర్పు: ఛోటా కె.ప్రసాద్, కళ: బ్రహ్మ కడలి.

అదే నన్ను నిలబెట్టింది



నితిన్

వరుసగా నాలుగైదు ఫ్లాపులు వస్తే సినిమా ఇండస్ట్రీలో క్రేజ్ తగ్గడం, అవకాశాలు తగ్గిపోవడం చాలా సహజం. కానీ పదేళ్లపాటు హిట్ అన్నది లేకుండా వరుసగా ఫ్లాపులతో కాలం నెట్టుకుంటూ వచ్చాడు హీరో నితిన్. చివరికి విక్రమ్ కె.కుమార్ డైరెక్షన్‌లో వచ్చిన 'ఇష్క్' సినిమా నుంచి అతని కెరీర్ యు టర్న్ తీసుకుంది. ఇంత సుదీర్ఘ కాలం వైఫల్యాలను ఎదుర్కొన్న యంగ్ హీరో నితిన్ ఒక్కడే. అయితే వరుస ఫెయిల్యూర్లు తనకు ఎన్నో పాఠాలు నేర్పాయని అంటున్నాడు నితిన్. "పరాజయాలు ఎదుర్కొన్న సమయంలో అసలు ఎలాంటి సినిమాలు చేస్తే హిట్ అవుతాయో అస్సలు అర్థం కాలేదు. ఏ రకమైన స్క్రిప్టులు నాకు సరిపోతాయో తెలియలేదు. రక రకాల జోనర్లలో ప్రయోగాలు చేసుకుంటూ పోయాను. కానీ వాటిలో ఏదీ నాకు సెట్ కాలేదు. అన్ని ప్రయోగాలు నెగటివ్ రిజల్ట్‌నే ఇచ్చాయి. దీంతో చాలా అసంతృప్తికి గురయ్యాను. కానీ ఏదో ఒక రోజు బౌన్స్ బ్యాక్ అవుతానన్న నమ్మకం నాకుండేది. నేను మానసికంగా చాలా ధృడంగా ఉంటాను. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఓపికగా నా ప్రయత్నం చేస్తూనే వచ్చాను. అదే నన్ను నిలబెట్టింది" అని తన విజయం రహస్యం గురించి నితిన్. ఇటీవల నితిన్ హీరోగా భారీ బడ్జెట్‌తో తీసిన యాక్షన్ బేస్డ్ మూవీ 'లై' బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. దీంతో మరోసారి తనకు కలిసొచ్చిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో 'ఛల్ మోహన రంగ' సినిమా చేశాడు. లై సినిమాలో నితిన్‌కు జోడీగా నటించిన మేఘా ఆకాష్ ఇందులో కూడా హీరోయిన్‌గా నటించింది. వచ్చే నెలలో ఈ సినిమా థియేటర్లకు రానుంది. దీంతోపాటు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో దిల్‌రాజు బ్యానర్‌లో అతను 'శ్రీనివాస కళ్యాణం' సినిమా కూడా చేస్తున్నాడు.

సురేష్ ప్రొడక్షన్స్‌లో సినిమా



నాగచైతన్య

జయాపజయాలతో సంబంధం లేకుండా కెరీర్‌ను ఓ లెవెల్‌లో తీసుకువెళ్తున్న హీరో నాగచైతన్య. అతని కెరీర్‌లో ఎన్ని సక్సెస్‌లు ఉన్నాయో అన్ని ఫెయిల్యూర్లు కూడా ఉన్నాయి. తమ సొంత బ్యానర్ అన్నపూర్ణ స్టూడియోలో సినిమాలు చేసి సక్సెస్ అందుకున్న నాగచైతన్య తన మేనమామ సురేష్‌బాబుకు చెందిన బ్యానర్‌లో ఇంత వరకు ఒక్క చిత్రం కూడా చేయలేదు. అయితే చైతన్యతో సినిమా చేయాలని గతంలో సురేష్‌బాబు పలుసార్లు ప్రయత్నించినా ఏదో ఒక కారణంగా ఆ కాంబినేషన్ కుదరడం లేదు. వాస్తవానికి 'సవ్యసాచి' చిత్రాన్ని సురేష్‌బాబే నిర్మించాలి. కానీ చివరి నిమిషంలో దర్శకుడి కారణంగా మైత్రీ మూవీ మేకర్స్ వారి చేతుల్లోకి ఆ సినిమా వెళ్లింది. అది కూడా పెద్ద బ్యానర్ కావడంతో చైతన్య ఆ చిత్రం చేశాడు. ఇక కళ్యాణ్‌కృష్ణ దర్శకత్వంలో వెంకటేష్‌నాగచైతన్య మల్టీస్టారర్ అనుకున్నారు కానీ అది కూడా సెట్ కాలేదు. ఈసారి ఎలాగైనా మేనల్లుడు చైతన్యతో సినిమా చేయాలని సురేష్‌బాబు నిర్ణయించుకున్నాడు. మరో ప్రొడక్షన్‌తో కలిసి సురేష్‌బాబు ఈ సినిమాను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. దర్శకుడు బాబీ చెప్పిన కథ నాగచైతన్యకు సెట్ అవుతుందని భావించి అదే స్క్రిప్ట్‌ను సురేష్‌బాబు ఫైనల్ చేసినట్లు సమాచారం. త్వరలో ఈ చిత్రం గురించి పూర్తి వివరాలు తెలియరానున్నాయి.



కె.ఎల్.దామోదర్ ప్రసాద్, గణేశ్‌రాజ్, తరుణ్, ఎత్తరి గురురాజ్, సీతారామరాజు తదితరులు

యూనివర్సల్ పాయింట్‌తో 'ఆనందం'

సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్ మలయాళంలో సూపర్‌డూపర్ హిట్ అయిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులోకి అనువదించి ఈనెల 23న విడుదల చేయనున్నారు. మలయాళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రానికి గణేశ్‌రాజ్ దర్శకత్వం వహించారు. కేరళ టాప్ హీరో నివిన్‌పాల్ గెస్ట్ రోల్ చేసిన ఈ చిత్రంలో దాదాపు అందరూ కొత్తవారే నటించారు. ఈ చిత్రానికి వీరా వెంకటేశ్వరరావు, వి.ఆర్.బి.రాజు, రవివర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సచిన్ వారియర్ సంగీతాన్ని అందించిన ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ "మా సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఎంత ఆనందంగా థియేటర్‌కు వస్తారో... అంతే ఆనందంగా బయటకు వెళ్తారు. ముఖ్యంగా సెకండాఫ్ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తుంది. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు ఎంజాయ్ చేసే చిత్రమిది. సినిమా చూసిన వారికి కాలేజీ రోజులు గుర్తుకు వస్తాయి. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ సినిమా మలయాళంలో 20 కోట్ల రూపాయలను వసూలు చేసింది. తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని భావిస్తున్నాం" అని అన్నారు. కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ "సీనియర్ నిర్మాత సీతారామరాజు సమర్పణలో వస్తున్న ఈ చిత్రం తప్పకుండా బావుంటుంది. ఆనందం సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. సినిమాలో మంచి భావోద్వేగాలున్నాయి" అని తెలిపారు. దర్శకుడు గణేశ్‌రాజ్ మాట్లాడుతూ "2010 నుండి ఈ కథ రాసుకుంటూ వచ్చాను. 2016లో మలయాళంలో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఓ ట్రిప్‌కు వెళ్లిన కాలేజీ విద్యార్థుల కథే ఈ చిత్రం. యూనివర్సల్ పాయింట్‌తో తెరకెక్కిన ఈ సినిమా తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నాను" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తరుణ్, పద్మరాజు, ఎ.వి.ఎస్.రాజు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



రాధికాఆప్టే

భర్తతో కాపురానికి చాలా ఖర్చవుతోంది!

తన భర్తతో గడపడానికి చాలా ఖర్చు చేయాల్సి వస్తోందని అంటోంది కథానాయిక రాధికా ఆప్టే. భర్త కోసం ఖర్చు తప్పడం లేదని ఆమె చెప్పింది. రాధికా ఆప్టే భర్త బెనెడిక్ట్ టేలర్ బ్రిటీష్ దేశస్థుడు. అతను మ్యూజిక్ కంపోజర్. బ్రిటన్‌లోనే ఉండే అతన్ని కలవడానికి రాధిక అప్పుడప్పుడూ అక్కడికి వెళ్తూ ఉంటుందట. బ్రిటన్‌కు వెళ్లడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కదా. నెలకు ఒకటి, రెండు సార్లు తాను బ్రిటన్‌కు వెళ్తానని... దీంతో చాలా ఖర్చు అవుతోందని ఈ భామ చెప్పింది. దీంతో తను ఎక్కువగా విమానంలో ఎకనామిక్ క్లాస్‌లోనే ప్రయాణిస్తానని రాధిక పేర్కొంది. ఈ విషయాన్ని ఫ్లైట్‌లో తనను చాలా మంది అడుగుతారని... బిజినెస్ క్లాస్‌లో కాకుండా ఎకనామిక్ క్లాస్‌లో ఎందుకు వెళ్తారు? అని అంటారని చెప్పింది. బ్రిటన్‌కు ఎక్కువ సార్లు ప్రయాణం చేయడంతో ఖర్చును తగ్గించుకోవడానికే తాను ఇలా చేస్తానని రాధికా ఆప్టే పేర్కొంది. ఒక్కోసారి అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకోవాల్సి వస్తుందని దీంతో ఖర్చు తప్పడం లేదంటూ ఆమె చెప్పింది. మొత్తానికి భర్తతో కాపురం చేయడమంటే తనకు ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని రాధిక పేర్కొంది.

మాఫియా డాన్‌గా శర్వానంద్



'స్వామిరారా' వంటి ట్రెండ్ సెట్టింగ్ మూవీతో దర్శకుడిగా పరిచయమయ్యాడు సుధీర్‌వర్మ. ఆతర్వాత అతను చేసిన దోచెయ్, కేశవ పర్వాలేదనిపించాయి. ఇప్పుడు సుధీర్‌వర్మ... శర్వానంద్ హీరోగా ఓ సినిమా చేయడానికి కమిటయ్యాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకొచ్చింది. కానీ అన్నీ కుదిరినా ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లడానికి ఆలస్యమైంది. 'మహానుభావుడు' తర్వాత ఈ చిత్రం చేయాల్సిన శర్వానంద్... హను రాఘవపూడి దర్శకత్వంలో 'పడి పడి లేచె మనసు' సినిమా మొదలుపెట్టాడు. ఆ చిత్రాన్ని దాదాపు సగం పూర్తిచేశాడు. ఈ చిత్రం తర్వాత సుధీర్‌వర్మతో శర్వానంద్ సినిమా మొదలవుతుందట. ఈ చిత్రం కోసం కోటి రూపాయల ఖర్చుతో భారీ సెట్ నిర్మాణం పూర్తయినట్లు సమాచారం. కొన్ని రోజుల్లోనే సినిమా షూటింగ్ మొదలవుతుందట. శర్వానంద్ మాఫియా డాన్ పాత్రలో కనిపించబోయే ఈ చిత్రం యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలిసింది. దాదాపు రూ.20 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరన్నది ఇంకా తేలలేదు.

బాయ్‌ఫ్రెండ్‌ని పెళ్లి చేసుకున్న శ్రియా



తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన శ్రియా బాలీవుడ్‌లో కూడా మెరిసింది. స్టార్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున, పవన్‌కళ్యాణ్, మహేష్‌బాబులతో కలిసి పలు సూపర్‌హిట్ సినిమాల్లో నటించింది. కొత్త హీరోయిన్ల రాకతో ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. ఇప్పటికీ ఆమెకు కొన్ని మంచి ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. అయితే శ్రియా తాజాగా తన బాయ్‌ఫ్రెండ్‌ను రహస్యంగా వివాహం చేసుకున్నట్లు సమాచారం. ముంబయ్‌లోని అంధేరీలో ఉన్న తన ఇంట్లోనే ఈనెల 12న రష్యాకు చెందిన క్రీడాకారుడు ఆండ్రీ కొశీవ్‌ను పెళ్లి చేసుకుందని తెలిసింది. ఈ పెళ్లికి శ్రియా తరపు బంధువులు, ఆండ్రీ తరపు బంధువులు కొందరు మాత్రమే హాజరయ్యారట. చిత్ర పరిశ్రమ నుంచి మనోజ్ బాజ్‌పాయ్, షబానాఆజ్మీ మాత్రమే వచ్చారట. వాళ్లిద్దరూ శ్రియా ఇంటికి దగ్గరలోనే ఉంటారని అందుకే వారిని పిలిచారని సమాచారం. ఇంట్లోనే ఎలాంటి హంగామా లేకుండా శ్రియా పెళ్లి చేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. శ్రియా పెళ్లి హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిందని తెలిసింది. ఆమె పెళ్లిరోజున గులాబీ రంగు చీరలో మెరిసిందట. ఈనెల 11న ప్రీ వెడ్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారట శ్రియా, ఆండ్రీ. ఇక గత 18 ఏళ్లుగా సినిమాల్లో నటిస్తోంది శ్రియా. 37 ఏళ్ల వయసులో ఇప్పుడు పెళ్లి చేసుకుంది. రష్యన్ క్రీడాకారుడు, పలు రెస్టారెంట్లకు యజమాని అయిన ఆండ్రీ, శ్రియా మధ్య ప్రేమాయణం చాలా నెలలుగా కొనసాగుతోంది. కానీ ఆ విషయం గురించి వాళ్లిద్దరూ ఎప్పుడూ నోరు విప్పలేదు.



20 ఏళ్లకుపైబడిన వాహనాలు ఇక తుక్కే!

న్యూఢిల్లీ: పాత వాణిజ్య వాహనాలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏదైనా వాణిజ్య వాహనం 20 సంవత్సరాలపాటు రోడ్లపై తిరిగితే ఇక దాన్ని తుక్కు కింద అమ్ముకోవాల్సిందే. ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ప్రత్యేక కార్యదర్శి అధ్యక్షతన వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో జరిగిన సమావేశం ఇందుకు సంబంధించిన ప్రత్యేక విధానానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. నీతి ఆయోగ్ సిఇఒ అమితాబ్ కాంత్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాలం తీరిన వాణిజ్య వాహనాలతో ఎదురవు తున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, రోడ్లపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2020 ఏప్రిల్ 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. తుక్కు కింద తొలగించిన పాత వాణిజ్య వాహనం స్థానంలో కొనుగోలు చేసే కొత్త వాణిజ్య వాహనాలకు జిఎస్‌టిలో కొంత రాయితీ ఇవ్వాలని కూడా సమావేశం సిఫారసు చేసింది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే దేశవ్యాప్తంగా 20 ఏళ్లకు పైబడిన దాదాపు 2.8 కోట్ల వాణిజ్య వాహనాలు తుక్కుగా మారతాయి.

నోవార్టిస్ ఎండి జావెద్ రాజీనామా



న్యూఢిల్లీ: నోవార్టిస్ ఇండియా వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జావెద్ జియా తన పదవి నుంచి దిగిపోవాలనుకుంటున్నట్లు శనివారం చెప్పారు. ఈ విషయాన్ని ఆయన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు తెలిపారు. నోవార్టిస్ ఇండియా కంపెనీ ఈ విషయాన్ని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బిఎస్ఇ)కు దాఖలు చేసిన ఫైలింగ్‌లో వివరించింది. ఆయన స్థానంలో తగిన వ్యక్తిని గుర్తించి నియమించే పనిని చేపట్టాలని నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీని కోరినట్లు బోర్డు బిఎస్ఇకి దాఖలు చేసిన ఫైల్‌లో పేర్కొంది. నోవార్టిస్ ఇండియా లిమిటెడ్ భారత్‌లో ఎముకలు, నొప్పి, క్యాల్షియం పోర్ట్‌ఫోలియో, గైనెకాలజీ, న్యూరోసైన్స్, గైనకాలజీ, యాంటీ టిబి, యాంటీ ఇనెఫిక్టివ్స్‌కు సంబంధించిన జనరిక్ బిజినెస్‌పై దృష్టి పెట్టింది.

19 నుంచి బిఎస్ఎన్ఎల్ మేళా

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉగాది పండుగను పురస్కరించుకుని బిఎస్ఎన్ఎల్ మెగా మేళాను నిర్వహిస్తోంది. ఈ నెల 19 నుండి 31వ తేదీ వరకు కొనసాగనున్న ఈ మెగా మేళాలో 3 జి సిమ్ కార్డులను ఉచితంగా అందజేయనున్నారు. కొత్త కనెక్షన్లపై 351 ఎబి డాటాను కూడా అందజేయనున్నట్లు బిఎస్ఎన్ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ వి. సుందర్ ఒక ప్రకటనలో తెఓలిపారు. ఈ నెలాఖరు వరకు రూ. 110 టాపప్ కార్డులపై పూర్తి టాక్‌టైమ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో విస్తరిస్తున్న వెస్ట్‌సైడ్

మన తెలంగాణ / హైదరాబాద్ : టాటా గ్రూప్ ఫ్యాషన్ రిటైల్ చెయిన్ సంస్థ వెస్ట్ సైడ్ హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో తన నాల్గో స్టోర్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కార్యకలాపాలను మరింతగా విస్తరించినట్లు తెలిపింది. ముంబై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ కంపెనీకి దేశ వ్యాప్తంగా 56 నగరాల్లో 123 వెస్ట్‌సైడ్ స్టోర్లను కల్గి ఉంది. టాటా నుండి అత్యుత్తమ నాణ్యత కల్గిన ఇతర ఇంటీరియర్స్‌ను అందించనుంది.

డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు ఝలక్!



హైదరాబాద్: దేశీయ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఎ) నుంచి ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. హైదరాబాద్ సమీపంలోని మెదక్ జిల్లా జిన్నారంలో ఉన్న ఎపిఐ ప్లాంట్–1లో ఎఫ్‌డిఎ తనిఖీలు నిర్వహించి నాలుగు అభ్యంతరాలు లేవనెత్తింది. ఈ మధ్య బొల్లారంలోని ఎపిఐ ప్లాంట్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు చేపట్టి ఐదు అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. జిన్నారం ఎపిఐ ప్లాంట్ 1లో శుక్రవారం ఎఫ్‌డిఎ తనిఖీలు పూర్తి చేసి నాలుగు అభ్యంతరాలతో ఫారమ్ 483 జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. నిర్దేశిత సమయంలో ఎఫ్‌డిఎ అభ్యంతరాలకు ప్రత్యుత్తరమివ్వనున్నట్లు తెలిపింది. అయితే ఎఫ్‌డిఎ ఎలాంటి అభ్యంతరాలను లేవనెత్తిందనేది మాత్రం డాక్టర్ రెడ్డీస్ వెల్లడించలేదు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28950	30962.57	0%
ముంబై	29790	31860.96	0.27%
ఢిల్లీ	29550	31604.28	0%
కోల్‌కతా	29830	31903.74	0.63%
కేరళ	28050	30000.00	0%
బెంగళూరు	28400	30374.33	0%
హైదరాబాద్	28950	30962.57	0.1%
గల్ఫ్	1393.62	1490.50	0.63%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	41400.00	41500.00	–0.24
ముంబై	41400.00	41500.00	–0.24
ఢిల్లీ	41400.00	41500.00	–0.24
కోల్‌కతా	41400.00	41500.00	–0.24
హైదరాబాద్	41400.00	41500.00	–0.24




కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	330	విశాఖపట్నం	325
వరంగల్	332	చిత్తూరు	363
విజయవాడ	317	చెన్నై	370
గోదావరి	317	బెంగళూరు	365

ఆర్‌బిఐకి తగిన పర్యవేక్షణ అధికారాలు

ఉర్జిత్ పటేల్ వాదనతో విభేదించిన ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రంగరాజన్



న్యూఢిల్లీ: భారత రిజర్వు బ్యాంకు(ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ సి. రంగరాజన్ ఆర్‌బిఐ పర్యవేక్షణ అధికారాల విషయంలో ప్రస్తుత ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌తో విభేదించారు. ఆర్‌బిఐకి బ్యాంకింగ్ రంగాన్ని పర్యవేక్షించే తగినన్ని అధికారాలున్నాయన్నారు. అయితే తప్పు చేసే బ్యాంకర్లపై చర్య తీసుకునే ముందు ప్రభుత్వాన్ని సంప్రదించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకింగ్ రంగంలో మోసాలపై ఉర్జిత్ పటేల్ ఆందోళన వ్యక్తం చేస్తూ ఆర్‌బిఐకి మరిన్ని అధికారాలు కావాలని డిమాండ్ చేసిన కొన్ని రోజులకే సి. రంగరాజన్ ఈ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఆయన 1992 నుంచి 1997 వరకు ఆర్‌బిఐ గవర్నర్‌గా పనిచేశారు.

వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన సహచరుల మోసం తరువాత ఆపేసిన భరోసా లేఖలు(లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్స్) గురించి ప్రస్తావిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుని వాటిని తిరిగి ప్రవేశపెట్టవచ్చని రంగరాజన్ అన్నారు. భరోసా పత్రాల ద్వారానే పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ. 13,000 కోట్ల మేరకు మోడీ, ఆయన సహచరులు మోసగించారు.

'ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలా?' అని అడిగిన ప్రశ్నకు రంగరాజన్ సమాధానమిస్తూ 'ఆ విషయాన్ని వేరుగా చర్చించాల్సి ఉంది' అన్నారు. 'కుంభకోణం, మోసం జరిగినప్పుడు మాత్రమే ఈ అంశాన్ని చర్చించాల్సిన పనిలేదు. మోసాలు, కుంభకోణాలనేవి కేవలం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే కాక ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా జరగవచ్చు' అన్నారు. 'రూపాయి విలువ తగ్గేందుకు అవకాశం ఉంది అని నేను భావిస్తున్నాను' అని కూడా ఆయన చెప్పారు. కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాన్ని పెంచాలని తీసుకున్న నిర్ణయం సరైంది కాదని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

నీరవ్ ప్రణాళికలు దడ పుట్టించాయి: విపుల్


ముంబయి: వేలకోట్ల మేరకు బ్యాంకులను ముంచేసి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీపై విపుల్ అంబానీ కీలక వ్యాఖ్యలు చేశారు. నీరవ్ వ్యాపార విస్తరణ క్రమం తనను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో మరింత విస్తరించేలా భారీ ప్రణాళికలను రూపొందించుకున్నారని రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కజిన్, 'టవర్ క్యాపిటల్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విపుల్ అంబానీ వెల్లడించారు. నీరవ్ మోడీకి చెందిన 'ఫైర్‌స్టార్ గ్రూపు'కు విపుల్ అంబానీ పనిచేశారు కూడా. 1999లో వ్యాపారాన్ని ప్రారంభించిన నీరవ్ మోదీ ఐదేళ్లు తిరక్కుండానే తన ఆభరణాల వ్యాపార సంస్థ 'ఫైర్‌స్టార్ గ్రూప్' ను విదేశాల్లోనూ విస్తరించాడని తెలిపారు. అప్పటికే ఆరు అంతర్జాతీయ నగరాలకు తన వ్యాపారాన్ని విస్తరింపజేసిన నీరవ్ 2015లో మరింత దూకుడు పెంచాడన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన తన వ్యాపార సామ్రాజ్యాన్ని 2020 నాటికి 12 దేశాల్లో విస్తరించాలని భావించాడట. ఈ సందర్భంగా 30కి పైగా దుకాణాలను నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేస్తానని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్'లో నీరవ్ వెల్లడించిన విషయాన్ని విపుల్ ఉటంకించారు. అంతటి విస్తరణా కార్యక్రమాల్ని చూసిన ఎవరికైనా ఔరా.! అనిపిస్తుందని ఆయన తెలిపారు. ప్రఖ్యాత నటి, మోడల్ నవోమీ వాట్స్ నుంచి జూనియర్ ట్రంప్ వరకు నీరవ్ బిజినెస్ మోడల్‌ను చూసి అలా ఆశ్చర్యపోయిన వారేనని అన్నారు. ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ర

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెరగనున్న మూల వేతనం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం కింది స్థాయి ఉద్యోగుల మూల వేతనాన్ని(బేసిక్ పే) పెంచాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. 1 నుంచి 5 వరకున్న మ్యాట్రిక్స్ స్థాయిలో ఉన్న అధికారులకు కూడా ఇది వర్తించనుంది. ప్రస్తుతం ఏడవ వేతన సంఘం కింది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు బేసిక్ పే రూ. 18,000గా ఉంది. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.57 నుంచి మూడు రెట్లు మోడీ ప్రభుత్వం పెంచే అవకాశముందని తెలుస్తోంది. అంటే దీంతో ప్రస్తుతమున్న కనీస బేసిక్ వేతనాన్ని రూ. 18,000 నుంచి రూ. 21,000కు పెంచనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఆరంభానికి ముందే ఈ ప్రతిపాదనను కేబినెట్ ముందు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పెట్టనున్నారు. 7వ వేతన సంఘం సిఫార్సులకు మించి పెంచే విషయాన్ని ప్రభుత్వం ఏప్రిల్ నెలలో ఎప్పుడైనా పరిశీలించే అవకాశముందని సమాచారం. గత వేతన సంఘం కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 7వ వేతన సంఘం కింద మూల వేతనాన్ని పెంచేందుకు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57గా సిఫార్సు చేసింది. దాంతో వారికి అంతకు ముందున్న మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరుగింది. కానీ కార్మిక సంఘాలు మూల వేతనాన్ని(బేసిక్ పేను) ఇంకా పెంచాలని, దానిని రూ. 26,000 చేయాలని, అందుకు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 3.68కి పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరంభ వేతనం(ఎంట్రీ లెవల్ పే)కు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను మార్చడం విపరీతమేమి కాబోదని నేషనల్ అనామలీ కమిటీ(ఎన్ఎసి) స్పష్టం చేసింది. మార్చి నెల మొదట్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం(డిఎ), కరువు సాయం(డిఆర్)ను మంత్రివర్గం ఆమోదించింది. ఈ నిర్ణయం వల్ల 1.10 కోట్ల కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, పెన్షనర్లకు వారి బేసిక్ పేలో డిఎ 5 శాతానికి బదులు 7 శాతం పెరిగింది. ఈ పెరుగుదల 2018 జనవరి 1 నుంచి అమలులోకి తెచ్చారు. డిఎ, డిఆర్‌ను పెంచడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 6077.72 కోట్ల భారం పడింది. కేంద్ర మంత్రివర్గం 7వ వేతన సంఘం సిఫార్సులను 34 మార్పులతో 2017 జూన్ నెలలో ఆమోదించింది. భత్యాల మార్పుల వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.30748 కోట్ల భారం పడింది. ఈ మార్పులు 2017 జులై 1నుంచి అమలులోకి తెచ్చారు.

'డార్జిలింగ్ టీ'కి బెంగాల్ ప్రభుత్వం సాయం



కోల్‌కతా: భౌగోళిక సూచిక(జిఐ) ట్యాగ్, లోగో పొందిన తొలి భారతీయ ఉత్పత్తి డార్జిలింగ్ టీ. అయితే ఈ సీజన్‌లో డార్జిలింగ్ టీ ఉత్పత్తి బాగా కొరత ఏర్పడ్డంతో డార్జిలింగ్ హిల్స్‌లోని తేయాకు ఉత్పత్తిదారులు తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి మార్కెటింగ్, బ్రాండింగ్ విషయంలో సహకారాన్ని అందించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ముందుకొచ్చింది. గత ఏడాది గూర్ఖ జనముక్తి మోర్చా ప్రత్యేక రాష్ట్రం కోరుతూ 100 రోజులపాటు బంద్ పాటించడంతో డార్జిలింగ్ కొండప్రాంతంలో తేయాకు ఉత్పత్తి దాదాపు ఆగిపోయిందనే చెప్పాలి. హఠాత్తుగా డార్జిలింగ్ టీ లభించకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్‌లో డార్జిలింగ్ టీ బ్రాండ్‌కు ముప్పేర్పడినట్లయిందని తేయాకు ఉత్పత్తిదారులు భావించారు. డార్జిలింగ్ టీకి బ్రాండ్, మార్కెటింగ్ విషయంలో ఏమేరకు సహకారం అందించాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయించాల్సి ఉందని పశ్చిమ బెంగాల్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వందనా యాదవ్ అన్నారు. డార్జిలింగ్ టీకి సంబంధించిన దాదాపు 30 బ్రాండ్లను రూపొందించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం యోచిస్తోంది. కోల్‌కతాలో సిఐఐ నిర్వహించిన కార్యక్రమంలో వందనా యాదవ్ ప్రసంగించిన తరుణంలో ఈ విషయాలు చెప్పారు. డార్జిలింగ్ టీకి జర్మనీ, జపాన్, అమెరికా, ఇంగ్లాండ్ తదితర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

'తేయాకు తోటలు సంవత్సరం పొడుగునా మూతపడ్డాయి. మా తప్పు ఏమి లేకున్నా సంవత్సరం పంట దిగుబడికాలేదు. ఇప్పుడు మేము తేయాకు శ్రామికులకు వేతనాలు, బోనస్ తదితరాలు ఇవ్వాల్సి ఉంది. మాకు మద్దతుగా రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరుకుంటున్నాం' అని డార్జిలింగ్‌లోని ఓ తేయాకు ఎస్టేట్ యజమాని చెప్పారు.

నేటి నుంచి ఉబెర్, ఓలా డ్రైవర్ల నిరవధిక సమ్మె




ముంబయి: ఉబెర్, ఓటా క్యాబ్ సంస్థల డ్రైవర్లు మార్చి 18(ఆదివారం) అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ డ్రైవర్ల సమ్మె ముంబయి, న్యూఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి ప్రముఖ నగరాల్లో తప్పదని తెలుస్తోంది. 'ఓలా, ఉబెర్ డ్రైవర్లకు పెద్ద హామీలు ఇచ్చాయి. కానీ నేడు డ్రైవర్లు తమ ఖర్చులు కూడా పొందలేని స్థితి నెలకొంది. వారు రూ. 5 నుంచి 7 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. దాంతో నెలకు రూ. 1.5 లక్షలైన సంపాదించాలని ఆశించారు. కానీ క్యాబ్ కంపెనీల నిర్వహణ లోపం వల్ల దాంట్లో సగం కూడా పొందలేకున్నారు' అని మహారాష్ట్ర నవనిర్మాణ్ వాహతుక్ సేనకు చెందిన సంజయ్ నాయక్ చెప్పారు. మహారాష్ట్ర నవనిర్మాణ్ వాహతుక్ సేనాయే ఈ సమ్మెను నిర్వహిస్తోంది. కిరాయి ట్యాక్సీ కంపెనీలు తమ కంపెనీ వాహనాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ డ్రైవర్ల సొంత వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. దాంతో వారి వ్యాపారం మందగించిందన్నారు. ఎలాంటి తనఖీలు లేకుండానే ముద్ర పథకం కింద లోన్ గ్యారంటీ లెటర్లను డ్రైవర్లకు ట్యాక్సీ కంపెనీలు ఇచ్చాయని, దాంతో చాలామంది తమ ఖర్చులు కూడా వెళ్లనందున రుణ కిస్తులను చెల్లించక ఎగవేస్తున్నారని కూడా సంజయ్ నాయక్ చెప్పారు. ఓలా, ఒబెర్ ట్యాక్సీ కంపెనీకి చెందిన క్యాబ్‌లు దాదాపు 45,000 వరకు ముంబయిలోనే ఉన్నాయి. అయితే ట్యాక్సీ కార్ల బిజినెస్ మందకొడిగా సాగుతున్నందున ముంబయిలో దాదాపు 20 శాతం తగ్గుదల కనిపిస్తోంది.

ఎన్‌డిటివికి సెబీ జరిమానా




న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను, వాటాల అమ్మకం వంటి కొన్ని విషయాలు వెల్లడించని కారణంగా మీడియా సంస్థ ఎన్‌డిటివికి మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రూ. 10 లక్షల జరిమానా విధించింది. ఎన్‌డిటివి ప్రమోటర్లు ప్రణయ్ రాయ్,రాధికా రాయ్, నాటి గ్రూపు సిఇఒ విక్రమాదిత్య చంద్ర, కాంప్లియన్స్ ఆఫీసర్ అనూప్ సింగ్ జునేజాలకు చెరి రూ. 3 లక్షల జరిమానా కూడా విధించింది. నాలుగేళ్ల కాలంలో కంపెనీ టాప్ ఎగ్జిక్యూటివ్‌లు కొన్ని వాటాలు అమ్మేయడం, రూ. 450 కోట్ల ఆదాయపు పన్ను గురించి అడగ్గా విషయాన్ని వెల్లడించకుండా ఆలస్యం చేయడం వంటివి సెబీ దర్యాప్తులో వెలుగు చూడ్డంతో ఈ జరిమానాలు విధించింది. జరిమానాలకు సంబంధించిన 23 పేజీల ఉత్తర్వును సెబీ మార్చి 16న జారీ చేసింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ కె.వి.ఎల్. నారాయణ రావుకు కూడా సెబీ నోటీసులు జారీ చేసినప్పటికీ ఆయన మరణించినందున చర్యలను ఆపేసింది. రూ. 450 కోట్ల ఇన్‌కం ట్యాక్స్ డిమాండ్ వివరాలు వెల్లడించనందున వివిధ ప్రక్రియల ద్వారా ఇదివరకే ఎన్‌డిటివికి రూ. 200 కోట్లు జరిమానా విధించారు. లిస్టింగ్ అగ్రిమెంట్‌లోని 36వ క్లాజ్‌ను ఉల్లంఘించినందుకు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్, చంద్రలకు రూ. 3 లక్షల చొప్పున జరిమానా విధించింది. ఎన్‌డిటివిలో వాటాదారు అయిన క్వాంటమ్ సెక్యూరిటీస్ చేసిన ఫిర్యాదు మేరకు సెబీ దర్యాప్తును జరిపింది. ఆదాయపు పన్ను శాఖకు వివరాలు వెల్లడించనందునే ఫిర్యాదు చేసిందా సంస్థ. ఎన్‌డిటివి వైస్ చైర్‌పర్సన్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినట్లు కూడా ఆరోపణ ఉంది.

రికార్డు దిశలో మారుతి స్విఫ్ట్ అమ్మకాలు



ముంబయి: దేశీయ దిగ్గజ ఆటో మొబైల్ సంస్థ మారుతి సుజుకీ కార్ల అమ్మకాల్లో దూసుకెళ్తోంది. మార్కెట్లోకి విడుదల చేసిన కొన్ని రోజుల్లోనే వేలల్లో కార్ల బుకింగులు అవుతున్నాయి. ఏ పేరుతో విడుదల చేసినా సరే వినియోగదారులు ఇట్టే బుకింగులు చేసుకుంటున్నారు. ఈ సంస్థ 2018 జనవరి 18న 'థర్డ్ జనరేషన్ ప్రీమియం హ్యాచ్ బ్యాక్' పేరుతో స్విఫ్ట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆరంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ 90 వేల బుకింగులను అందుకుంది. మరో వారంలో ఇది లక్ష బుకింగుల మార్కును దాటుతుందని మారుతి సుజుకీ సంస్థ తెలిపింది. అలా జరిగితే అతి తక్కువ కాలంలో ఈ ఘనత సాధించిన తొలి కంపెనీగా రికార్డుకెక్కుతామని ప్రకటించింది. గతంలో పలు కార్లు ఈ రికార్డును అందుకున్నాయని, అయితే వాటికి చాలా సమయం పట్టినట్లు తెలిపింది. త్వరలో ఈ అరుదైన రికార్డుకు తమ సంస్థ చేరుకోగలదని వెల్లడించింది. ఈ కారుకున్న ప్రత్యేక క్రేజ్ కారణంగానే బుకింగులు జరుగుతున్నాయని తెలిపింది.

బ్యాంకుల ప్రైవేటీకరణలో ప్రభుత్వం విఫలం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించడం ద్వారా భారత బ్యాంకింగ్ విధానాన్ని సంస్కరించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైందని మోర్గాన్ స్టాన్లీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ వ్యూహకర్త, అధిపతి రుచిర్ శర్మ అన్నారు. 'రైజింగ్ ఇండియా' సదస్సులో శనివారం ఆయన ప్రసంగిస్తూ భారత్‌లో బ్యాంకింగ్ రంగాన్ని సంస్కరించకపోవడం అన్నది పెద్ద లోపం అన్నారు. సామాజిక లక్ష్యాన్ని చేరుకోడానికి ప్రతి దేశంలో కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు ఉండాలి, కానీ ఏ దేశం కూడా భారత్‌లా సమతుల్యతను కోల్పోలేదని చెప్పారు. 'ప్రభుత్వ బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా చల్లబడిపోతున్నాయి. క్రెడెన్షియల్స్ ఉన్న కంపెనీలకే రుణాలు దక్కే పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల చిన్న, మధ్య తరహా కంపెనీలు దెబ్బతింటున్నాయి. రిస్కులు తప్పించుకునే విధానాలు రూపొందాయి. భారత్‌లో పరపతి వాతావరణం ఏ మాత్రం బాగాలేదు' అని రుచిర్ శర్మ పేర్కొన్నారు. 2014లో 23000 మంది కోటీశ్వరులు దేశం వదిలిపోయారు. 2017లో 7000 మంది కోటీశ్వరులు దేశాని వదిలిపోయారు. చైనా తర్వాత ఎక్కువ మంది కోటీశ్వరులు వదిలేసిన దేశం మనదే. ప్రపంచంలో ఏ దేశంలో కూడా కోటీశ్వరులు ఇంతలా దేశం వదిలిపోరు అని ఆయన ఉదాహరించారు. 'అవినీతిపరులు దేశం నుంచి వెళ్ళిపోవడమే మంచిదని కొందరు అనొచ్చు, కానీ దేశం పురోగమించాలంటే దేశీయ మదుపరుల పెట్టుబడి చాలా అవసరం' అని ఆయన వివరించారు. 'జపాన్, చైనా, తైవాన్ విజయగాధలను మీరు చూసినట్టయితే అవన్నీ ఎగుమతుల ద్వారా సంపన్నమయ్యాయి. తక్కువ ధర వస్తువులను అవి ఉత్పత్తి చేస్తున్నాయి. తద్వారా పెద్ద ఎత్తున ఉపాధిని కల్పిస్తున్నాయి. తక్కువ ధర ఉత్పత్తులను తయారుచేయడాన్ని చైనా వదిలేశాక మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, కాంబోడియా, వియత్నాం వాటిని ఉత్పత్తి చేయడంలో ఊపందుకున్నాయి. మనం కూడా తక్కువ ధర ఉత్పత్తులను ఉత్పత్తి చేయాలంటే మన మౌలిక వసతులను, కార్మిక చట్టాలను మెరుగుపరచాలి' అని కూడా ఆయన శర్మ చెప్పారు.

'ద్రవిడ నాడు' ఏర్పాటును స్వాగతిస్తా : స్టాలిన్



చెన్నై: దక్షిణాది రాష్ట్రాలు అన్నీ 'ద్రవిడ నాడు' ఏర్పాటుకు డిమాండ్ చేసే పరిస్థితి వస్తే తాను స్వాగతిస్తానని డిఎంకె నేత ఎంకె స్టాలిన్ తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి ఉమ్మడి 'ద్రవిడ నాడు' ఏర్పాటు చేస్తాయా అని అడిగితే అదే జరిగితే నేను స్వాగతిస్తారు. అలా జరగొచ్చని కూడా నమ్ముతున్నాను అని స్టాలిన్ సమాధానమిచ్చారు. ఆర్‌కె నగర్ ఎమ్మెల్యే టిటివి దినకరన్ దీనిపై శనివారంనాడు స్పందించారు. 'ద్రవిడ నాడు'కు అసలు అవకాశమే లేదని ఆయన అన్నారు. డిఎంకె అధికారంలో ఉన్నన్ని రోజులూ ఆయన ఏమి చేశారని స్టాలిన్‌ను నిలదీశారు. ప్రస్తుతం ఆయన కావేరీ అంశంపై దృష్టి సారిస్తే మంచిదని దినకరన్ హితవు పలికారు. కాగా, 'ద్రవిడ నాడు'ను స్వాగతిస్తున్నట్టు తాను చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీయడంతో స్టాలిన్ వెంటనే స్పందించారు. తాను ఒక ప్రశ్నకు సమాధానంగానే ఆ విషయం చెప్పానని, దాని అర్థం తాను 'ద్రవిడ నాడు' ప్రచారానికి శ్రీకారం చుడతానని కాదని అన్నారు. కాగా, తమిళ, మలయాళ, తెలుగు, కన్నడ భాష మాట్లాడే ప్రజలకు 'హోం ల్యాండ్' ఉండాలన్న ఇవి రామస్వామి పెరియార్ ఆలోచనకు ప్రతిరూపమే 'ద్రవిడ నాడు'గా చెబుతారు. 1940 దశకంలో ఆయన డిఎంకెను స్థాపించినప్పుడు పార్టీ సిద్ధాంతాల్లో ఇది కూడా ఒకటిగా ఉందని పార్టీ వర్గాల సమాచారం.

తుపాకీతో సెల్ఫీ.. ప్రాణాలు తీసింది

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్‌లో లైక్‌ల కోసం తుపాకీతో ఫోటో పెట్టాలనుకున్న ఓ యువకుడు ఏకంగా ప్రాణాలనే కోల్పోయిన వైనమిది. ఢిల్లీ శివారు ప్రాంతమైన విజయ్ విహార్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తొలిసారి తుపాకీ చూసిన మోజులో విజయ్ (22) దాంతో ఫోటోలు దిగి ఫేస్‌బుక్‌లో పెట్టాలనుకున్నాడు. పొరుగింట్లో ఉండే చోటూ (27) కూడా అతడితో పాటే ఉన్నాడు. ఫోటోలు తీసుకుంటున్న క్రమంలో గన్ ఒక్కసారిగా పేలింది. బుల్లెట్ విజయ్ ఛాతీలోకి దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయ్‌ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రెండు నెలల క్రితమే ఉద్యోగం సంపాదించేందుకు ఢిల్లీలో అతడి మామయ్య ఇంటికి వచ్చాడు. అతడితో సన్నిహితంగా ఉండే చోటు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు రోహిణి డిసిని రాజ్‌నీశ్ గుప్తా వెల్లడించారు.

డబ్ల్యుటిఒ సమావేశానికి హాజరు కాలేం

న్యూఢిల్లీ : తమ రాయబారులు వేధింపులకు గురవుతున్నారంటూ భారత్, పాకిస్థాన్ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో ఢిల్లీలో జరగబోయే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) సమావేశానికి తాము హాజరుకాలేమని పాక్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ దేశ దౌత్య వర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. మార్చి 19, 20 తేదీల్లో ఢిల్లీ వేదికగా డబ్ల్యుటిఒ మంత్రిత్వ స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని పాక్ వాణిజ్యశాఖ మంత్రి పర్వేజ్ మాలిక్‌కు గత నెలలో భారత్ ఆహ్వానం పంపింది. అయితే ప్రస్తుతం ఆయన ఈ సమావేశానికి రావడం లేదు. 'ఇటీవల ఇరు దేశాల మధ్య చోటుచేసుకున్న విభేదాల నేపథ్యంలో డబ్ల్యుటిఒ సమావేశం నుంచి పాకిస్థాన్ తప్పుకుంటుంది' అని పాక్ దౌత్యవర్గాలు తెలిపాయి. సదస్సుకు రాకూడదని పాక్ చివరి నిమిషంలో నిర్ణయం తీసుకుందని.. దీనిపై తాము స్పందించబోమని భారత అధికారులు చెబుతున్నారు. ఇటీవల భారత్, పాక్ మధ్య దౌత్యాధికారుల విషయమై విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. భారత్‌లో తాము వేధింపులకు గురవుతున్నామంటూ పాక్ హైకమిషన్ సిబ్బంది ఫిర్యాదు చేశారు.

అజ్మీర్ దర్గాకు చాదర్ పంపిన మోడీ

న్యూఢిల్లీ : ఖాజా మొయినుద్దీన్ ఛిస్తీ అజ్మీర్ షరీఫ్ దర్గాకు ప్రధాని నరేంద్ర మోడీ చాదర్‌ను పంపించారు. శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీకు మోడీ ఈ చాదర్‌ను అందజేశారు. గత మూడేళ్లుగా అజ్మీర్ దర్గాకు చాదర్‌ను మోడీ సమర్పిస్తున్నారు. వరుసగా ఇది నాలుగో సంవత్సరం. నఖ్వీ సోమవారం చాదర్‌ను దర్గాకు సమర్పించనున్నారు. అజ్మీర్ దర్గా భారతదేశ మహోన్నత ఆధ్యాత్మిక సంప్రదాయానికి చిహ్నామని నఖ్వీ పేర్కొన్నారు. సాంఘిక, సాంస్కృతిక సామరస్యాల కలబోతను ఎట్టి పరిస్థితుల్లోనూకాపాడేందుకు.. భారతదేశ జాతీయ సమైక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ బదిలీ

న్యూఢిల్లీ : చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్ల దాడిలో 9 మంది జవాన్లు మృతి చెందిన ఘటన నేపథ్యంలో 212వ బెటాలియన్ కమాండెంట్‌ను సిఆర్‌పిఎఫ్ బదిలీ చేసింది. కమాండింగ్ ఆఫీసర్ (సిఒ) ప్రశాంత్ ధర్‌ను ఈశాన్య సెక్టార్‌కు బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశామని, ఘటనపై విచారణ సాగుతోందని అధికారులు తెలిపారు. ఈ ఘటన విషయంలో సిఒ వైఫల్యం ఆరోపణలపై అతనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన అనంతరం దాడి జరిగిన రోజు ఉదయం ఐదు కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్న కిస్టారం పాలోడి రోడ్డులో ఎలాంటి కదలికలను అనుమతించరాదని ఫీల్డ్ కమాండర్ల ద్వారా సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ (డిజి) సూచించారని వారు వెల్లడించారు.

మహిళలకూ లైన్‌మెన్ల ఉద్యోగావకాశం

మన తెలంగాణ/ హైదరాబాద్: జూనియర్ లైన్‌మెన్ల ఉద్యోగాలకు మహిళల దరఖాస్తులను కూడా స్వీకరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ లిమిటెడ్ (టిఎస్‌ఎన్‌పిడిసిఎల్)కు ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థలో జూనియర్ లైన్‌మెన్ల పోస్టులకు మహిళలు కూడా పోటీ పడవచ్చునని, అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని న్యాయమూర్తి ఎంఎస్ రామచంద్ర రావు స్పష్టం చేశారు. జెఎల్‌ఎం మాన్యువల్ పోస్టులు కేవలం మగవారికే పరిమితం చేస్తూ సంస్థ వెలువరించిన ఉద్యోగ ప్రకటనను హుమేరియా అంజుమ్, వి మమతలు సవాలు చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఈ పోస్టులకు ఎంపిక జాబితాలను వెలువరించరాదని న్యాయస్థానం తెలిపింది. జెఎల్‌ఎం పోస్టులకు మహిళల దరఖాస్తులను ఎందుకు నిరాకరిస్తున్నారో తెలియడం లేదని, ఆధునిక యుగంలో కూడా శారీరక బలహీనతల పేరిట మహిళలను ఈ ఉద్యోగాలకు దూరం చేయడం తగదని, మహిళ ఓ వైపు అంతరిక్షంలోకి దూసుకుపోతున్న తరుణంలో లైన్‌మెన్ల ఉద్యోగాలను తిరస్కరిస్తారా? ఈ విధంగా అయితే వారికి రిజర్వేషన్ల కల్పన ఎప్పటికీ కల్పనగానే ఉంటుందా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

ఉత్తరప్రదేశ్‌లో ఐఎఎస్‌ల బదిలీ

గోరఖ్‌పూర్‌లో పార్టీ ఓటమి నేపథ్యంలో యోగి నిర్ణయం



లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని 16 మంది జిల్లా కలెక్టర్లు సహా మొత్తం 37 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేశారు. ఇటీవల గోరఖ్‌పూర్, ఫూల్పూర్ నియోజకవర్గాల్లో జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలయిన విషయం విదితమే. గోరఖ్‌పూర్ స్థానంలో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఇక్కడ బిజెపి పరాజయం పొందగా.. సమాజ్ వాదీ పార్టీ ఘన విజయం సాధించింది. కాగా ఉప ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులు కూడా కాకముందే యోగి ప్రభుత్వం భారీ ఎత్తున ఉన్నతాధికారులకు స్థానచలనం కల్పించడం చర్చనీయాశంగా మారింది. బదిలీ అయిన వారిలో గోరఖ్‌పూర్ కలెక్టర్ రాజీవ్ రౌతేలా కూడా ఉన్నారు. బుధవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజీవ్ కౌంటింగ్ కేంద్రంలో మీడియాకు అనుమతి నిరాకరించి వార్తల్లోకి ఎక్కారు. తాజాగా ఆయన స్థానంలో గోరఖ్‌పూర్ కలెక్టర్‌గా డివిజినల్ కమిషనర్ దేవీపాటన్‌కు పదోన్నతి కల్పించారు. కాగా రాష్ట్రంలో మతోన్మాదం పెరుగుతోందంటూ ఇటీవల సోషల్‌మీడియాలో వివాదం రేపిన కలెక్టర్ రాఘవేంద్ర సింగ్‌పైనా బదిలీ వేటు పడింది.

ఎఐసిసి మెంబర్‌గా చంద్రశేఖర్



ఢిల్లీ : ఐఎన్‌టియుసి నేత ఆర్‌డి చంద్రశేఖర్ ఎఐసిసి సభ్యునిగా నియామకమయ్యారు. ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి సిఫార్సు మేరకు చంద్రశేఖర్‌ను ఎఐసిసి మెంబర్‌గా నియమిస్తూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాలు జారీ చేశారు. చంద్రశేఖర్ తెలంగాణ, ఎపి రాష్ట్రాలకు ఐఎన్‌టియుసి,ప్రధానకార్యదర్శిగా, కొనసాగుతున్నారు. తనను ఎఐసిసి సభ్యునిగా నియామకం చేయడంపై చంద్రశేఖర్ రాహుల్ గాంధీకి, సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ తెగ ఊదేస్తున్నారు!

● ధూమపానం బారిన అమ్మాయిలు, అబ్బాయిలు ● దేశంలో ప్రతిరోజు పొగ తాగుతున్న 6.25 లక్షల మంది చిన్నారులు

న్యూఢిల్లీ : ఆధునిక జీవన శైలికి అలవాటు పడ్డ యువత కూడా ధూమపానానికి బానిసై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అని ఎన్నిసార్లు హెచ్చరించినా కొందరు ఏ మాత్రం పట్టించుకోరు. పెద్దలే కాదు చిన్నారులు కూడా ఈ దురలవాటుకు బానిసలుగా మారుతున్నారు. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణకులోనై తమ జీవితాలను కోల్పోతున్నారు. మన దేశంలో 6.25లక్షల మంది చిన్నారులు రోజూ పొగతాగుతున్నట్లు ఇటీవల విడుదలైన ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. వారంతా 10 నుంచి 14ఏళ్ల వయసు మధ్యవారే కావడం గమనార్హం. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ (ఎసిఎస్), వైటల్ స్ట్రాటజీస్ సంయుక్తంగా గ్లోబల్ టొబాకో అట్లాస్ డేటా పేరుతో నివేదిక విడుదల చేశాయి. దీని ప్రకారం.. ఏటా భారత్‌లో పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా 9.32 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే వారానికి 17,887 పొగాకు సంబంధిత మరణాలు చోటు చేసుకుంటున్నాయి. మనదేశంలో 15 ఏళ్లు అంతకంటే పైబడిన వయసు గల వారిలో 10.3కోట్ల మంది ప్రజలు రోజూ పొగతాగుతున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. వీరిలో 9కోట్ల మంది పురుషులు కాగా..1.3కోట్ల మంది మహిళలున్నారు. ఇక 10 నుంచి 14 ఏళ్ల వయసు గల వారిలో 6.25లక్షల మంది నిత్యం సిగరెట్లు తాగుతున్నట్లు తేలింది. వీరిలో 4.29లక్షల మంది అబ్బాయిలు కాగా.. 1.95లక్షల మంది అమ్మాయిలు. 2016లో భారత్‌లో 82.12 బిలియన్ల సిగరెట్లు ఉత్పత్తి అయినట్లు డేటా పేర్కొం ది. 'పొగాకు వల్ల అనేక వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా కొన్ని రకాల క్యాన్సర్లకు, గుండెపోటు తదితర వ్యాధులకు పొగాకు కారణమే. పొగాకు వినియోగాన్నినిర్మూలించేందుకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని ముంబయిలోని టాటా మెమోరియల్ ఆస్పత్రి సీనియర్ సర్జన్ ఒకరు చెప్పారు.



ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

ఎస్‌పిలో చేరిన మంత్రి స్వామి అల్లుడు

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. అసలే లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఓటమి బాధతో ఉన్న ప్రభుత్వానికి ఇది ఎదురు దెబ్బే. రాష్ట్ర మంత్రి స్వామి ప్రసాద్ మౌర్య అల్లుడు నవల్ కిషోర్ శనివారం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)లో చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, మరో నేత అజం ఖాన్ సమక్షంలో మౌర్య అల్లుడు నవల్ కిషోర్ ఎస్‌పిలో చేరుతున్నట్లు ప్రకటించారు. స్వామి ప్రసాద్ మౌర్య గతంలో బిఎస్‌పిలో ఉన్నారు. 2016 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన బిఎస్‌పి నుంచి బిజెపిలో చేరి, ఎన్నికల్లో విజయం సాధించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్మిక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలైన విషయం తెలిసిందే. యోగికి కంచుకోటలాంటి గోరఖ్‌పూర్‌ను ఎస్‌పి ఎగరేసుకుపోయింది. ఇది జరిగిన మూడు రోజుల వ్యవధిలోనే బిజెపి మంత్రి కుటుంబ సభ్యుడు ఎస్‌పిలో చేరడం ఆ పార్టీకి ఎదురు దెబ్బ తగిలినట్టయింది.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

కాంచీపురం/నాగపట్నం : తమిళనాడులో శనివారం రెండు ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. తమిళనాడు కాంచీపురం జిల్లాలో ఐటి ఉద్యోగులు ప్రయాణిస్తున్న కారు లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు ఐటి ఉద్యోగులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. బాధితులంతా 20 నుంచి 25 ఏళ్ల వయస్సు గలవారేనని, శనివారం ఉదయం వారంతా పుదుచ్చేరికి వెళ్తుండగా కాంచీపురం సమీపంలోని కొలంపక్కం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా,ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ కన్నుమూసింది. ఘటన నేపథ్యంలో తిరుచ్చి–చెన్నై రహదారిపై వాహన రాకపోకలకు గంటకుపైగా తీవ్ర అంతరాయం కలిగింది. మరో ఘటనలో కేరళకు చెందిన యాత్రికులు కారులో ప్రయాణిస్తుండగా వారి వాహనం నాగపట్నం సమీపంలో ఓ వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు యాత్రికులు ప్రాణాలు కోల్పోగా, మరి నలుగురు గాయపడినట్లు పోలీసులు పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రం పాలక్కాడ్ నుంచి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తమిళనాడు నాగపట్నం జిల్లా వెలంకాన్నికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు వారు చెప్పా రు. కారు వెలంకన్నికి సమీపిస్తుండగా వాహనం ముందు ఎద్దులబండి ఉన్నట్లు డ్రైవర్ గుర్తించాడు. దాన్ని తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో ముగ్గురు ప్రమాదస్థలిలోని మృత్యువాత పడగా, మిగిలిన ఇద్దరికి గాయాల కావడంతో వారని నాగపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు పోలీసులు వెల్లడించారు. అదే విధంగా వ్యాన్‌లో ఇద్దరికి కూడా గాయాలు అయ్యాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

దేశ రక్షణ కోసం అవసరమైతే సరిహద్దు దాటుతాం

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ : దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు అవసరమైతే భద్రతా బలగాలు సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి)ని దాటుతాయని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జమ్మూకశ్మీర్ భారతదేశ అంతర్భాగమని ఆయన స్పష్టం చేశారు. కశ్మీర్ సమస్యకు నరేంద్ర మోడీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నదని అన్నారు. ఇందుకు గాను మధ్యవర్తిని ఇప్పటికే నియమించిందని,చర్యలు జరపడానికి ముందుకు వస్తే సిద్ధంగా ఉన్నామని తెలియజేశా రు. 'భారతదేశ సమగ్రతను కాపాడటం ఒక్కటే కా దు, దేశాన్ని కాపాడుకోవడం కోసం అవసరమైతే సరిహద్దు దాటుతాం' అని స్పష్టం చేశారు. 'అమెరికా తీవ్రవాదికి పాకిస్తాన్ రాజకీయ చట్టబద్ధతను కల్పించింది. హాఫీజ్ సయీద్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించింది. అతడు ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాడు, పార్లమెంటులో అడుగుపెట్టబోతున్నాడు. ఇది ఆశ్చర్యాన్ని కలిగించే విషయం' అని ఆయన పేర్కొన్నారు.'అమాయక కశ్మీరీయువతకు జిహాదీలో శిక్షణఇవ్వడానికి యత్నిస్తున్న వారికి నేనొకటి చెప్పదల్చుకున్నాను.వారు ముందుగా అసలు ఇస్లాంలో జిహా దీ ఉద్దేశమేమిటన్నది నేర్చుకోవాలి' అని అన్నారు. మొట్టమొదటి సారిగా రాళ్లదాడులు చేసిన వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీకి ఆయన విజ్ఞప్తి చేశారు.

మద్దతు ధరలపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

ప్రధాని మోడీ విమర్శ



న్యూఢిల్లీ : రైతులకు మద్దతు ధరల విషయంలో ప్రతిపక్షాలు కావాలనే అయోమయం సృష్టిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు.పంటలకు ఉత్పత్తి వ్యయంలో కనీసం ఒకటిన్నర శాతం మేర ఉండేలా మద్దతు ధరలను ఖరారు చేశారని, ఈ మేరకు బడ్జెట్ సమావేశాలలో వెల్లడించారని ప్రధాని తెలిపారు.అయితే ఈ అంశంపై ప్రతిపక్షాలు రైతాంగాన్ని పక్కదోవపట్టిస్తున్నాయని, మద్దతుధరలు సముచితంగా లేవని ఆరోపిస్తున్నాయని ప్రధాని మండిపడ్డారు. శనివారం ప్రధాని మోడీ ఇక్కడ మూడు రోజుల కృషి ఉన్నతి మేళాను ప్రారంభించారు. రైతులు పంటల ఊడ్పులను కాల్చివేయరాదని, కాల్చివేయడం ద్వారా కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు అందేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ప్రధాని వెల్లడించారు. రైతులు మరింత భారీ విస్తీర్ణంలో నూనెగింజలను ఉత్పత్తి చేయాలని, దీని వల్ల వంటనూనెల దిగుమతి భారం తగ్గుతుందని తెలిపారు. 2022 నాటికి యూరియా వాడకాన్ని కనీసం సగానికి సగం తగ్గించుకోవల్సి ఉందన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించే దిశలో అన్ని చర్యలూ తీసుకున్నట్లు వెల్లడించారు. అ న్ని నిర్దేశిత పంటలకు సాగు వ్యయంలో కనీసం 1.5 శాతం మేర ఉండేలా కనీస మద్దతు ధరలను ఖరారు చేసినట్లు ప్రధాని వెల్లడించారు. అయితే కొందరు కావాలనే ఈ మద్దతు ధరలపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, రైతాంగంలో నిరాశ నిస్పృహలను కల్పిస్తున్నారని ప్రధాని మోడీ విమర్శించారు. ఉత్పత్తి వ్యయం ఖరారులో నిర్దిష్ట నిబంధనలు ఉంటాయని సాగు వ్యయ జాబితాలోని అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. పనిలోకి తీసుకున్న వ్యవసాయ కూలీలు, సొంత లేదా అద్దె వ్యవసాయ యంత్రాల వ్యయం, పశువుల ఖర్చు, విత్తనాలు, ఎరువులు, సాగునీటి ఖర్చు, రాష్ట్ర ప్రభుత్వాలకు కట్టే రెవెన్యూ, మూల పెట్టుబడిపై వడ్డీ, , లీజుకు తీసుకున్న భూములకు చెల్లించే మొత్తాలు వంటి వాటిని సాగు వ్యయం లెక్కలోకి తీసుకుంటారని ప్రధాని వివరించారు.

స్థానిక భాషలలో ఎంబిబిఎస్

ఉప రాష్ట్రపతి అభిలాష



చెన్నై : ఎంబిబిఎస్ వంటి వృత్తి విద్యా కోర్సులను భారతీయ భాషలలో బోధించాల్సి ఉందని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. భారతీయ చరిత్ర, వారసత్వం, సంస్కృతిలకు ప్రాధాన్యతను ఇస్తూ విద్యావ్యవస్థను రూపొందించాల్సి ఉందని తెలిపారు. హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ స్వర్ణోత్సవ స్నాతకోత్సవ సభలో ఉప రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ భాషలలోనే ఎంబిబిఎస్ డిగ్రీ పొందేందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదని ఉప రాష్ట్రపతి ప్రశ్నించారు. విద్యార్థులకు వారి మాతృభాషలలోనే విద్యాభ్యాసం చేయాలని తాను తరచూ చెపుతూ వస్తున్నానని, ప్రాంతీయ భాషలలోనూ ఎంబిబిఎస్ వంటి చదువులు చదివే రోజులు రావాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.ఈ సభలో తమిళనాడు గవర్నర్ భన్వరీ లాల్ పురోహిత్, రాష్ట్ర మంత్రి డి జయకుమార్ ఇతరులు పాల్గొన్నారు.

టిడిపిపై కఠిన వైఖరి

● రాజీలేని పోరాటం తప్పదు ● బిజెపి అధిష్టానం కీలక నిర్ణయం



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఎన్‌డిఎతో టిడిపి తెగదెంపులు చేసుకున్న నేపథ్యంలో ఆ పార్టీ తమపై చేసే ఆరోపణలకు అంతే స్థాయిలో బదులివ్వాలని, ఆ పార్టీతో కఠినంగా వ్యవహరించాలని బిజెపి అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. ఎపి బిజెపి నేతలు శనివారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో భేటీ అయ్యా రు. పార్టీ అభివృద్ధి చెందాలంటే టిడిపితో రాజీలేని పోరాటం చేయకతప్పదని అమిత్ షా ఎపి నేతలకు సూచించినట్లు సమాచారం. ఒకవేళ మీతో కాకపోతే మీ స్థానాలను వేరే వారు భర్తీ చేస్తారని ఎపి నేతలతో అమిత్ షా కటువుగా మాట్లాడారని సమాచారం. అమిత్ షాతో జరిగిన ఈ భేటీలో ఎపి నేతలు రాం మాధవ్, పురంధేశ్వరీ, హరిబాబు, కామినేని శ్రీనివాసరావు, మాణిక్యాల రావు, సతీష్ జీ, విష్ణుకుమార్ రాజు, సోము వీర్రాజు, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాలను బిజెపి జాతీయ కార్యదర్శి రాంమాధవ్‌కు అప్పగిస్తూ నిర్ణయించింది. ఎన్డీఏ నుంచి టిడిపి వైదొలగడం బిజెపితో దోస్తీ కటీఫ్ చెప్పి.. ఆ పార్టీనే టార్గెట్‌గా చేస్తూ తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎపిలో బిజెపి అనుసరించాల్సిన వ్యూహం, టిడిపిని ఎలా ఎదుర్కోవాలి? బిజెపిపై, కేంద్రంపై విమర్శలు చేస్తున్న ఇతర పార్టీలపై ఎలాంటి వైఖరి అనుసరించాలనే దానిపై ఈ సమావేశంలో చర్చిచినట్లు సమాచారం. ఎపికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదని బిజెపి పై ఆరోపణలు చేయడమే కాకుండా ఏకంగా కేంద్రంపై అవిశ్వాసం పెట్టేందుకు చంద్రబాబు సిద్ధపడటంతో ఇక ఆ పార్టీ విషయంలో దూకుడుగా ముందుకువెళ్లాలని, చంద్రబాబు పరిపాలనలోని అవకతవకలను ఎత్తి చూపాలని అమిత్ షా సూచించినట్లు సమాచారం. సమావేశం అనంతరం ఎపి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ ఎపిలో ఏవరైతే భావోద్వేగాలు ప్రేరేపిస్తున్నారో వారికి సమాధానం చెప్పడంతో పాటుగా ప్రత్యేక హోదా కంటే ఎక్కువ ప్రయోజనాలు ఎపికి ఇస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. రాజకీయ పునరేకీకరణలో భాగంగా టిడిపి, వైఎస్సార్ పార్టీ, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలు బిజెపిపై హోదా విషయంలో దుష్ప్రచారం చేస్తున్నాయన్న విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని నిర్ణయించామన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో బిజెపి ఒంటరిగా ముందుకు వెళ్తుందని తెలిపారు. అనంతరం బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేంద్ర చేసిన సహాయం పై తీర్మానం చేయనున్నామని తెలిపారు. ఇప్పటి వరకు టిడిపి, బిజెపి రెండు కలిసే ఉన్నాయి, కాని టిడిపి తనంతట తానుగా మా పార్టీపై అవిశ్వాసంపెట్టి వ్యతిరేకంగా మారిందని ఆరోపించారు. బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఇంతకుముందు ప్రభుత్వంలో భాగస్వామిగా కార్యవర్గ సమావేశాలు నిర్వహించాం. ఇప్పుడు ప్రతిపక్షంగా కార్యవర్గ సమావేశాలు నిర్వహిస్తాం. మేము ఎప్పటికి ప్రజల పక్షంలోనే ఉంటామని తెలిపారు. రాష్ట్రానికి సహాయంపై మేము దోషులమనేది దుష్ప్రచారం ప్రశ్నలు అడిగితే సమాధానాలు చెప్పకుండా వేరే వారి స్క్రిప్ట్ అంటూ టిడిపి నేతలు మాటలు దాటవేస్తున్నారని ఆరోపించారు.

టిడిపి అవిశ్వాసమా... నో బిపి : అనంత్‌కుమార్

బెంగలూరు : తెలుగుదేశం పార్టీ అవిశ్వాస తీర్మానం వల్ల మోడీ ప్రభుత్వానికి ఇసుమంత నష్టం కూడా వాటిల్లబోదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ చెప్పారు. శనివారం ఇక్కడ నిర్వహించిన సేవ్ బెంగలూరు ప్రచార కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని తాము పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని, దీనిని ఎదుర్కొనేందుకు బిజెపి సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి పార్లమెంట్‌లోపలా వెలుపలా కూడా పూర్తి మద్దతు ఉందని, ఇక అవిశ్వాసాలతో ఫలితం ఏముంటుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు బిజెపి తగు విధంగానే జవాబు ఇస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా గురించి మిత్రపక్షం తెలుగుదేశం ఎన్‌డిఎతో తెగతెంపులు చేసుకున్న అంశాన్ని అనంత్‌కుమార్ ప్రస్తావించారు. ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకునే టిడిపి నిర్ణయం తీసుకుందని భావిస్తున్నట్లు, అయినా మోడీ ప్రభుత్వం ఎపి రూపకల్పనకు అదనంగా రూ 24వేల కోట్ల నిధులు విడుదల చేసిందని, ఇతర విధాలుగా కూడా ఏ రాష్ట్రానికి లేని రీతిలో సాయం అందిస్తోందని మంత్రి తెలిపారు. దీనిని టిడిపి గుర్తించలేదా? లేక ఇతర అంశాలతోనే ఎన్‌డిఎకు దూరం అయ్యారా? అనేది ప్రజలకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ ఇతర పక్షాలూ సహాయ నిరాకరణ ధోరణితో ఉన్నాయన్నారు.



మార్చి 20 నుంచి రాహుల్ మూడో విడత ఎన్నికల ప్రచారం

బెంగళూరు : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కర్నాటకలో మార్చి 20 నుంచి మూడో విడత ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు.గత రెండు పర్యటనల్లో ఉత్తర కర్నాటకలో ప్రచారం నిర్వహించిన ఆయన ఇప్పుడు దక్షిణ కోస్తా, మాల్నాడు ప్రాంతంలో ప్రచారం నిర్వహించబోతున్నారు. తన రెండు రోజుల పర్యటనలో ఆయన బిజెపి బలంగా ఉన్న ఉడిపి, దక్షిణ కన్నడ, చికమగళూరుతోపాటు మాజీ ప్రధాని, జనతాదళ్ సెక్యూలర్ అధ్యక్షుడు దేవేగౌడ స్వంత జిల్లా హసన్‌లో కూడా ప్రచారం నిర్వహిస్తారు. గతంలో మాదిరిగానే వివిధ మతాలకు చెందిన ప్రదేశాలను రాహుల్ సందర్శించనున్నారు.గోమతేశ్వరాలయం, రోసరియో చర్చి,ఉల్లాల్ దర్గా, శారదాంబ ఆలయాలనుఆయన సందర్శించనున్నారు. శృంగేరి శంకర మఠంకు చెందిన భారతీ తీర్థ స్వామీజీ, జగద్గురు శంకరాచార్యలతో రాహుల్ సమావేశం కానున్నారు. రాష్ట్రానికి చెందిన సీనియర్ నాయకులతోపాటు, స్థానిక నాయకులతో రాహుల్ పరస్పరం సంభాషించనున్నారు. పలు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించనున్నారు.

ప్రాణభయంతో పరుగులు!

● సిరియాలో ప్రజల వలసలు ● మూడు రోజుల్లో ఆఫ్రిన్‌ను విడిచిన రెండు లక్షల మంది

బైరుట్ : సిరియా ప్రజలు ప్రాణభయంతో వలసలు పోతున్నారు. తీవ్ర భయాందోళనల మధ్య పిల్లాపాపలతో పరుగులు తీస్తున్న దృశ్యాలు రోజూ దర్శనమిస్తున్నాయి. ఇక్కడ ఉగ్రవాదులు, ప్రభుత్వ బలగాల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజల పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. దాడుల్లో వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. గాయాల పాలవుతున్నవారికి లెక్కేలేదు. వీటి నుంచి తప్పించుకోవడానికి ఎంతో మంది తమ ప్రాంతాలు వదిలేసి పారిపోతున్నారు. సిరియా ఉత్తర ప్రాంతంలోని ఆఫ్రిన్ నగరం నుంచి మూడు రోజుల్లో దాదాపు రెండు లక్షల మంది పారిపోయారని సిరియాకు చెందిన మానవ హక్కుల పరిశీలన సంస్థ వెల్లడించింది. టర్కీ దళాల సహకారంతో సిరియా ప్రభుత్వ వర్గాలు కుర్దులను అణచడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగానే దాడులు చేస్తుండటంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు.శనివారం కూడా దాదాపు 50వేల మంది నగరం విడిచి వెళ్లిపోయారని బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల పరిశీలన సంస్థ తెలిపింది. ఇక్కడ పరిస్థితి అత్యంత భయంకరంగా ఉందని సంస్థ డైరెక్టర్ రమి అబ్దెల్ రెహమాన్ వెల్లడించారు. కుర్దిష్ పీపుల్స్ ప్రొటెక్షన్ యూనిట్స్ ఆధీనంలో ఉన్న ఆఫ్రిన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని సిరియా ప్రభుత్వం దాదాపుగా గత రెండు నెలలుగా దాడులు చేస్తోంది.ఆఫ్రిన్‌లో దాదాపు 3,50,000 మంది ఉండగా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కేవలం దక్షిణం వైపు నుంచి మాత్రమే ప్రజలు పారిపోవడానికి అనుమతి ఇచ్చారని రమి అబ్దెల్ తెలిపారు.



వైమానిక దాడుల్లో 30 మంది మృతి

తూర్పు గౌటాలో శనివారం వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 30 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు నెల రోజులుగా డెమస్కస్ శివార్లలో ఉన్న సిరియా తిరుగుబాటుదారుల స్థావరాలపై రష్యా మద్దతుతో సైనికులు భీకరంగాదాడులు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే దక్షిణ పాకెట్‌లోని జమల్కా పట్టణంలో దాడులు జరిపింది ఎవరనేది బ్రిటన్ ఆధారిత సిరాయ మానవహక్కుల సంఘం వెల్లడించలేకపోతుంది. ఫిబ్రవరి 18నుంచి రాజధాని శివార్ల లో ఉన్న తిరుగుబాటు దారుల స్థావరాలను దళాలు 70 శాతం స్వాధీ నం చేసుకున్నాయి. వలస వెళ్తున్న పౌరులను యుద్ధవిమానాలు లక్ష్యం గా చేసుకొని దాడులు చేసినట్లు మానవహక్కుల సంఘం హెడ్ రామి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఎన్‌క్లేవ్‌లో దళాలు దాడి చేసి సుమారు 1390 మంది పౌరులను చంపినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటిపై కూలిన అతి చిన్న విమానం

ఇంట్లో మంటలు చెలరేగి ఐదుగురు అగ్నికి ఆహుతి



మనీలా : ఫిలిప్పీన్స్‌లో ఓ విమానం కూలిపోయింది. ఐదుగురితో వెళ్తున్న అతి చిన్న ప్రయాణికుల విమానం ఉత్తర మనీలా టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఓ ఇంటిపై కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఐదుగురు మృత్యువాతపడగా, ఇంట్లో ఉన్న ఐదుగురు కూడా మృతి చెందినట్లు ఫిలిప్పీన్ పోలీసులు వెల్లడించారు. బులకాన్ ప్రావిన్స్ ప్లరైడల్ పట్టణంలో ఉన్న విమానాశ్రయం నుంచి ఆరు సీట్లు ఉన్న పైపర్ 23 అపాచీ విమానం శనివారం టేకాఫ్ అయిన వెంటనే ఓ ఇంటిపై కుప్పకూలిందని ఫిలిప్పీన్స్ పౌర విమానయాన సంస్థ అధికారిక ప్రతినిధి ఎరిక్ అపోలోనియా, పోలీసులు పేర్కొన్నారు. విమానం కూలిన వెంటనే ఇంట్లో మంటలు చెలరేగడంతో అందులో ఉన్న ముగ్గురు చిన్నారులు, ఓ తల్లి, బామ అగ్గికి ఆహుతయ్యారని, అలాగే విమానంలో ఉన్న ఐదుగురు ఫిలిప్పీన్ జాతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్లరైడల్ పోలీస్ చీఫ్ సూపరింటెండెంట్ జులియో లిజార్డో చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, అయితే ఇంట్లో ఇంకా ఎవరైనా మృతి చెంది ఉంటారా అన్న అనుమానంతో శోధిస్తున్నట్లు ఆయన వివరించారు.

ఆస్ట్రేలియాలో 'మార్కస్' బీభత్సం

మెల్‌బోర్న్: ఉత్తర ఆస్ట్రేలియాలో మార్కస్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. దీంతో ఆ దేశథం చిగురుటాకులా వణికింది. తుపాను ధాటికి అక్కడ కురుస్తోన్న భారీ వర్షాలకు తోడు గంటకు 130 కి.మీ వేగంతో వీస్తున్న గాలులు డార్విన్ నగరంలో పెను విధ్వంసం సృష్టించాయి. వందలాది చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫలితంగా దాదాపు 26వేల మందికి పైగా ప్రజలు విద్యుత్, నీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కస్ తుపాను తీవ్రత తగ్గుముఖం పట్టడంతో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

బ్రిటన్ దౌత్యాధికారుల తొలగింపు

మాస్కో : తాజాగా బ్రిటన్‌పై రష్యా ప్రతీకార చర్యలకు దిగింది. 23 మంది బ్రిటన్ దౌత్యాధికారులను తొలగించింది. వారంలోగా వారిని మాస్కో వదిలి వెళ్లాలని ఆదేశించినట్లు అక్కడ విదేశాంగ మంత్రి తెలిపారు. రష్యాలో బ్రిటన్ రాయబారి లారీ బ్రిస్టోతో సమావేశమై ఈ విషయాన్ని ఆయనకు వెల్లడించినట్లు తెలిపారు. అలాగే రష్యాలోని బ్రిటిష్ కౌన్సిల్‌ను కూడా మూసేయాలని, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జనరల్ కాన్సులేట్ తెరవడానికి బ్రిటన్‌కు ఇచ్చిన అనుమతులను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బ్రిటన్ 23 మంది రష్యా దౌత్యాధికారులను తొలగించిన రెండ్రోజుల్లోనే రష్యా కూడా అదే పని చేసి దెబ్బకు దెబ్బ కొట్టింది. ఇటీవల బ్రిటన్‌లో రష్యా మాజీ గూఢచారి సెర్గీ స్కృపాల్, ఆయన కుమార్తె యూలియా విష ప్రయోగం కారణంగా చనిపోయారు. నాడీ వ్యవస్థను దెబ్బ తీసే విషం వినియోగించి వారిని హత మార్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని బ్రిటన్ ప్రధాని థెరిసా మే వెల్లడించారు. అయితే ఈ విషాన్ని రష్యాలోనే తయారు చేశారని, వారి హత్య వెనుక రష్యా హస్తం ఉందని థెరిసా ఆరోపించారు. దీనిపై స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. కాగా బ్రిటన్ మాత్రం రష్యా ఆరోపణలను కొట్టి పారేసింది. ఈ వివాదం నేపథ్యంలోనే బ్రిటన్ గురువారం 23మంది రష్యా దౌత్యాధికారులను తొలగించింది. ఈ పరిణామాలతో మాస్కో, లండన్‌ల మధ్య ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్నాయి. బ్రిటన్ తమపై నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తోందని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

జైలులో లాలూకు అస్వస్థత




రాంచి : బిర్సాముండా జైలులో ఖైదీగా ఉన్న ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. ఆయనను రాజేంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆర్ఐఎంఎస్)లో చేర్చారు. ప్రస్తుతం ఆయన కార్డియాలజీ వార్డులో అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పశువుల దాణా కుంభకోణంలో లాలూ గత ఏడాది డిసెంబరు 23 నుంచి రాంచిలోని బిర్సా ముండా జైలులో శిక్ష అనుభవిస్తున్న విషయం విదితమే.

నాలుగో పశుగ్రాసం కేసు మార్చి19కి వాయిదా

నాలుగో పశుగ్రాసం కేసులో తీర్పును సిబిఐ ప్రత్యేక కోర్టు మార్చి19కి వాయిదా వేసింది. రెండు దశాబ్దాల క్రితం దమ్కా ట్రెజరరీ నుంచి బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రాలు రూ.3.13 కోట్లు ఉపసంహరించినట్లు ఆరోపణలు ఎదర్కొంటున్నారు. ఈ కేసుపై తీర్పు రెండోసారి వాయిదా పడిందని లాలూ న్యాయవాది ప్రభాత్ కుమార్ తెలిపారు. ప్రత్యేక సిబిఐ జడ్జి శివ్‌పాల్ సింగ్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనడంతో తీర్పును వాయిదా వేశారని ఆయన తెలిపారు. దమ్కా ట్రెజరీ కేసులో లాలూ, మిశ్రా, మాజీ ఐఎఎస్, పశుసంవర్థక శాఖ అధికారులతోపాటు 29 మందిపై ఆరోపణలు ఉన్నాయి. రెండో పశుగ్రాసంలో కేసులో లాలూ బిర్సాముండా జైలులో ఇప్పటికే జైలు శిక్ష అనుభవిస్తున్నారు. లాలూ మూడు కేసులలో, మిశ్రా రెండు కేసులలో ఇప్పటికే దోషులుగా తేలారు. రాంచిలోని దొరండా ట్రెజరీ నుంచి మోసపూరితంగా రూ.139 కోట్లు ఉపసంహరణకు సంబంధించిన లాలూపై ఐదో కేసు పెండింగ్‌లో ఉంది.

తక్కువ దూర మార్గాల్లో విరామ సమయాన

100కుపైగా రైళ్లు నడుపుతున్నాం



న్యూఢిల్లీ: రైళ్ల విరామ సమయం తగ్గించి తక్కువ దూరంగల మార్గాల్లో 100కు పైగా రైళ్లను నడుపుతున్నామని తమ శాఖ విశ్లేషణలో వెల్లడైందని రైల్వేశాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. శనివారం ఆయన 58వ నేషనల్ కాస్ట్ కన్వెన్షన్‌లో మాట్లాడారు. ఇందుకు ఆయన హజ్రత్ నిజాముద్దీన్, ఆగ్రాల మధ్య నడుస్తున్న గటిమాన్ ఎక్స్‌ప్రెస్ విరామ సమయాన్ని తగ్గించి దానిని గ్వాలియర్ వరకు అనంతరం ఝాన్సీ వరకు పొడిగించామని గోయల్ తెలిపారు. రైళ్లను పొడిగించడంతో ఎలాంటి ఖర్చు లేకుండా బుందేల్ ఖండ్ ప్రాంతం లబ్ధి పొందిందన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన తెలిపారు. దేశంలో అవినీతిని అరికట్టేందుకు కాస్ట్ అకౌంటింగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటీవల జరిపిన ఓ అధ్యయనం ప్రకారం అవినీతి కారణంగా రెండు శాతం జిడిపిని కోల్పోతున్నామని ఆయన తెలిపారు.

చైనా అధ్యక్షునిగా మళ్లీ ఎన్నికైన జిన్‌పింగ్



బీజింగ్ : పదవీ కాల వ్యవధిపై గడువును ఎత్తివేస్తూ చైనా పార్లమెంటు నిర్ణయం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో శనివారం నాడు చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ రెండోసారి తిరిగి ఎన్నికయ్యారు. ఆ దేశ రాజ్యాంగంలో అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే పదవిలో ఉండే నిబంధనను ఎత్తేస్తూ ఇటీవల చైనా పార్లమెంటు నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రెండో పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన జిన్‌పింగ్ అయిదేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అధ్యక్షుడిగా కొనసాగేందుకు అవకాశం వచ్చింది. శక్తివంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎంపికయ్యారు. కాగా, వాంగ్ చైనా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యా రు. కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ కెకియాంగ్ మినహా ఉన్నత స్థాయి అధికారులను, మంత్రి మండలిని,అక్కడి సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చేయనున్నారు. చైనాలోని అధికార కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి పదవీకాల పరిమితిని ఎత్తేస్తూ ప్రతిపాదించిన చట్ట సవరణను మార్చి 11న నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌కు చెందిన 2900మందిడిప్యూటీలంతా కలిసి ఆమోదించారు. రెండు పర్యాయాల కాల పరిమితి ప్రకారం జిన్‌పింగ్ 2023నాటికి కమ్యూనిస్ట్ నేషనల్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాల్సి ఉండేది. కానీ ఇప్పుడా అవసరం లేకుండా చేశారు. ఆయన 2013లో అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వాంగ్ అంటే చైనాలో అధికారులుభయపడిపోతున్నారు. జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమం వాంగ్ ఆధ్వర్యంలో జరుగుతోంది. వాంగ్ ఇప్పటికే వంద మంది మంత్రులు సహా 1.5మిలియన్ల మంది అధికారులకు శిక్షలు వేశారు.

కాబూల్‌లో కారు బాంబు పేలుడు

ముగ్గురు మృతి



కాబూల్ : కాబూల్‌లో శనివారం ఆత్మాహుతి దళ సభ్యుడు ఓ వాహనాన్ని పేల్చేసుకున్న దాడిలో ముగ్గురు పౌరులు మృతి చెందగా,పలువురు తీవ్రంగా గాయపడ్డారని ఆఫ్గన్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు పాల్పడింది తామేనని తాలిబన్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది.'ఉదయం 9.10 గం.లకు ఆత్మాహుతి సభ్యుడు బాంబుతో కూడిన కారును పేల్చేసుకున్నాడు' అని మంత్రి అధికార ప్రతినిధి నజీబ్ దానిష్ తెలిపా రు.ఈ ఘటనలో ముగ్గురు పౌరులు అక్కడికక్కడే మృతి చెందగా,ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని, పేలుడు జరిగినప్పు డు ఈ ప్రదేశంలో ఉన్న చాలా మంది తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారని చెప్పారు.

అన్ని రంగాల్లో మరింతగా మహిళా ప్రాధాన్యం

ఎంపి కవిత ఆకాంక్ష



మన తెలంగాణ/ హైదరాబాద్ : కొందరు విద్యాధిక మహిళలూ కట్నం అడుగుతున్నారని, ఆడ శిశువులను వద్దనుకుంటున్నారని,ఈ ధోరణి మారాలని నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళలు సాధికారత సాధించాలంటే ముందు మహిళలు మారాలని, ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆకాక్షించారు. అప్పుడే మహిళలు అన్నిరంగాల్లో ముందంజ వేయడమే గాక ఆ రంగాల్లో రాణిస్తారని చెప్పారు.అన్ని రంగాల్లో మహిళల ప్రాధాన్యత పెరగాలని ఆకాక్షించారు. హైదరాబాద్ లోని పార్క్ హయత్ హోటల్ లో శనివారం నల్సార్ యూనివర్సిటీ 'సెంటర్ ఫర్ మేనేజ్ మెంట్ స్టడీస్ (సిఎమ్ఎస్)' ఆధ్వర్యంలో విమెన్ లీడర్‌షిప్ సమ్మిట్ –2108 జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. మహిళలకు నాయకత్వ లక్షణాలు పెంపొందితే సమాజం ఆలోచన విధానములో మార్పు వస్తుందని, తద్వారా మహిళలకు మేలు జరుగుతుందన్నారు.దక్షిణాసియా లో మహిళలు నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలు పాలనలోను రాణించగలరని ఇందిరా గాంధీ నిరూపించారని అన్నారు. మార్గరెట్ థాచర్ మహిళా నాయకులకు ప్రేరణ అన్నారు. తెలంగాణ, తమిళనాడు, యుపి రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది మహిళలు నాయకత్వ లక్షణాలతో దూసుకుపోతున్నారని తెలిపారు. వారసత్వం నుంచి వచ్చే మహిళలను ప్రశ్నిస్తున్నారు కానీ పురుషులను నిలదీయరా? అని ఆమె ప్రశ్నించారు. పురుష నాయకులు మహిళల సమస్యలపై మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకుని మార్చి నెలలో సభలు, సమావేశాలు జరుగుతున్నాయని, వీటిలో మహిళల సమస్యలు, పరిష్కారం పై చర్చ జరుగుతున్నదని,అయితే సంవత్సరం పొడుగునా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు.
మహిళా నాయకత్వం,సాధికారత,అక్షరాస్యత వంటి అంశాలపై విస్త త చర్చ జరిపి మహిళల్లో అవగాహన పెం పొందిస్తూ చైతన్యం తీసుకురావాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాపారిశ్రామికవేత్తల కోసం వి–హబ్‌ను ప్రారంభించామని తెలిపారు. వీ హబ్‌కు బడ్జెట్‌లో రూ. 15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచి నీరు అందించి మహిళలకు కష్టాలు లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. దీని వల్ల సమయం ఆదా అవుతుంది. మహిళలు చదువుకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు.మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా షీటీమ్స్ అద్భుతంగా పని చేస్తున్నాయని ప్రశంసించారు. వీటి వల్ల పని ప్రదేశంలో మహిళలు సేఫ్ గా ఉంటున్నారని తెలిపారు.వన్ స్టాప్ సెంటర్లను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కవిత అభినందించారు. మహిళల ప్రధాన సమస్యల్లో గృహ హింస కూడా ప్రధానమైనదన్నారు. అక్షరాస్యత శాతం పెరగాలన్నారు. మహిళా సాధికారత కు కృషి చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.ప్రారంభ సెషన్ లోటైమ్స్ గ్రూప్ కన్స ల్టింగ్ ఎడిటర్ సాగరిక ఘోష్,టిఐఇ అధ్యకులు కాళిప్రసాద్, సిఐఐ చైర్ ఉమెన్ శోభా దీక్సిత్, మాజీ చైర్ పర్సన్, కరుణ గోపాల్, నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫైజన్ ముస్తఫా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పాల్గొన్నారు.

బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం, 10 మంది మృతి


సీతామరి: బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. శనివారం మధ్యాహ్నం వంతెనపై నుంచి బస్సు కింద పడిపోవడంతో 10 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, పలువురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సీతామరి జిల్లాలోని భానాస్‌పట్టి గ్రామంలో ఘటన చోటు చేసుకుంది. ముజఫర్‌నగర్‌కు వెళ్తుండగా ఎన్‌హెచ్77పైన వంతెనపై నుంచి బస్సు కింద పడిపోయిందని రున్నిసైద్ ఎస్‌హెచ్ఓ శివ్‌నారాయణ రామ్ తెలిపారు.

19 నుంచి ఇయు కార్యాలయంలో దీక్షలు

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఎస్ ఆర్‌టిసిని పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కా రం కోసం ఈ నెల 19 నుంచి 22 వరకు రిలే నిరహార దీక్షలను, 23న మహా ధర్నాను యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు టిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రకటించింది. మహా ధర్నా పోస్టర్‌ను అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, కార్యదర్శులు సిహెచ్.నర్సయ్య, ఎస్.సాయిరెడ్డి శనివారం యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. నష్టాలలో ఉన్న సంస్థను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.1500 కోట్లను ఇవ్వాలన్నారు.

రెవెన్యూ అధికారులు విధుల బహిష్కరణ

స్తంభించిన పాలన



మన తెలంగాణ /హైదరాబాద్ సిటీ బ్యూరో: రెవెన్యూ ఉద్యోగులు విధులను బహిష్కరించడంతో జిల్లాలో పాలన పూర్తిగా స్తంభించింది. కలెక్టరేట్ విభాగం మొదల్కోని, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్‌డిఓ కార్యాలయాలతో పాటు 16 మండల కార్యాలయాలు, యుఎల్‌సి విభాగాల తహసిల్దార్లు, ఉద్యోగు శనివారం తమ విధలకు దూరంగా ఉన్నారు. దాదాపు అన్ని కార్యాలయాలకు తాళాలు పడ్డాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఆసిఫ్‌నగర్ మండల కార్యాలయంపై చొరబడి పలువురు ఉద్యోగులపై దాడికి తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధులను బహిష్కరించారు. అన్ని మండల కార్యాలయాల వద్ద పోలీసులతో భద్రత కల్పించడంతో పాటు దాడికి పాల్పడినవారిపై కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్‌లో ఎవరైనా దాడులకు పాల్పడాలంటనే భయం ఉండేలా చర్యలు ఉండాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు నేరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్ని ఉద్యోగులు ప్రకటించారు. మంగ్ గరోడి బస్తీకి చెందిన కొంత మంది పక్కా ప్రణాళిక ప్రకారం ఆసిఫ్ నగర్ మండల కార్యాలయంపై దాడి చేసి కనీసం మహిళా ఉద్యోగులన్ని కూడా చూడకుండా విక్షణరహితంగా దాడికి పాల్పడితే కలెక్టర్ యోగితా రాణా కనీసం కూడా పట్టించుకోలేదని పలువురు మహిళా ఉద్యోగినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడి ఘటన తెలిసిన వెంటనే ఆమె అక్కడికి చేరుకున్ని ఉంటే పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమై అయి దాడికి పాల్పడివారిపై కఠిన చర్యలు తీసకునేందుకు ఆస్కారం ఉండేదని, ఇంత పెద్ద ఘటన చోటు చేసుకుంటే కలెక్టర్ అక్కడికి రాకపోవడం తమ ఆత్మస్థైర్యం కోల్పోయేలా చేసిందని వారు వాపోయారు.

సామూహిక సెలవుల దిశగా ఆలోచన ?
రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు ఉధృత్తం దీశగా అడుగులు పడుతున్నాయి. నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో ధర్నా చేపట్టిన రెవెన్యూ విభాగం ఉద్యోగులు, సోమవారం సామూహిక సెలవు పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అప్పటికి ప్రభుత్వం తమ మొరను ఆలకించకపోతే ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తిం చేసుకుందుకు సైతం వెనకాడ కూడదని ఆయా ఉద్యోగ సంఘాల నేతలు నిర్ణయించినట్లు తెలిసింది.

బల్దియా గుర్తింపు సంఘం ఎన్నికల్లో

బిఎంఎస్ విజయం

1317 ఓట్ల మెజారిటీతో జయకేతనం

మన తెలంగాణ/సిటీబ్యూరో : జిహెచ్ఎంసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగ్యనగర్ ఎంప్లాయీస్ యూనియన్(బిఎంఎస్) విజయం సాధించింది. సమీప ప్రత్యర్థి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ టిఆర్‌ఎస్ కె.వి)పై 1317 ఓట్ల మెజార్టీతో విజ యం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. హోరాహోరిగా సాగిన ఎన్నికల ప్రచారంలో బిఎంఎస్ చివరలో అనుహ్యంగా పుంజుకుంది. ఎన్నికల్లో నాలుగు యూనియన్‌లు పోటీ పడ్డాయి. మొత్తం 5570 ఓట్లకు గాను 4264 ఓట్లు పోలయ్యాయి. బిఎంఎస్‌కు 2482 ఓట్లు, ఈయూకు 1165 ఓట్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ 194 ఓట్లు, మున్సిపల్ సహకార్ మంజ్దూర్ యూనియన్(ఐఎన్‌టియుసి)కి 354 ఓట్లు వచ్చాయి. ఉదయం 9 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై, 4 గంటల వరకు కొనసాగింది. వివిధ సర్కిళ్ల నుంచి ప్రధాన కార్యాలయానికి బ్యాలెట్ బాక్స్‌లు తరలించిన అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రాత్రి 10 గంటల వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. అనంతరం ఫలితాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అధికార పార్టీకి జిహెచ్ఎంసిలో మూడు యూనియన్‌లు ఉన్నాయి. ఈ మూడు యూనియన్‌లకు తోడుగా హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డికి చెందిన హెచ్ఎంఎస్ యూనియన్ కూడా ఉంది. అయితే నాలుగు యూనియన్‌లు కలిసి పోటిచేశాయి. సొంత యూనియన్‌లకు చెందిన నేతల వెన్నుపోట్లతోనే అధికార ఈయూ ఓటమిపాలైందని టిఆర్ఎస్ కె.వి వర్గాలు పేర్కొన్నాయి. యూనియన్ నాయకుల మధ్య సమన్వయం చేయడంలో టిఆర్ఎస్ అధిష్టానం విఫలమైందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో బల్దియా గుర్తింపు సంఘం ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని కార్మికులు అంటున్నారు.

సెమీస్‌లో పోరాడి ఓడిన సింధు

బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పోరాటం ముగిసింది. శనివారం ఉత్కంఠభరితంగా సాగిన మహిళల సెమీఫైనల్లో భారత స్టార్ పి.వి.సింధు 21–19, 19–21, 18–21 తేడాతో జపాన్ క్రీడాకారిణి అకానె యమగూచి చేతిలో ఓటమి పాలైంది. గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నా సింధు అనవసర తప్పిదాలకు పాల్పడి చేజేతులా ఓటమి పాలైంది. ప్రారంభం నుంచే పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. తొలి సెట్‌లో సింధు ఆధిపత్యం చెలాయించింది. చూడచక్కని షాట్లతో చెలరేగిన సింధు పైచేయి సాధించింది. అయితే యమగూచి కూడా అద్భుత షాట్లతో ఆధిపత్యం కోసం ప్రయత్నించింది. కానీ, కీలక సమయంలో ఒత్తిడిని తట్టుకున్న సింధు సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్ ప్రారంభంలో సింధు తొలుత ఆధిపత్యాన్ని కనబరిచింది. ఒక దశలో కీలకమైన 9–3 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే యమగూచి ఒత్తిడిని సైతం తట్టుకొని మళ్లీ ఆధిపత్యంలోకి దూసుకెళ్లింది. చివరి వరకు పైచేయిగా నిలిచి సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక, కీలకమైన మూడో సెట్‌లో కూడా పోరు యుద్ధాన్ని తలపించింది. కీలక దశలో ఒత్తిడికి గురై వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న యమగూచి మ్యాచ్‌ను సొంతం చేసుకుని ఫైనల్‌కు చేరింది.



జట్ల వివరాలు:

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), లోకేష్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

బంగ్లాదేశ్: సాకిబ్ (కెప్టెన్), మహ్మదుల్లా, తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ముష్ఫికుర్ రహీం, షబ్బీర్ రహెమాన్, ముస్తఫిజుర్ రహెమాన్, రుబేల్ హుస్సేన్, అబు జయ్యద్, తస్కిన్ అహ్మద్, ఇమ్రూల్ కైస్, నూరుల్ హసన్, మెహది హసన్, ఆరిఫుల్ హక్, నజ్ముల్ హక్, అబు హైదర్ రోని, లిటన్ దాస్.

సమరానికి రెడీ

కప్పుపై కన్నేసిన భారత్, జోష్ మీదున్న బంగ్లా, నేడు నిదహాస్ కప్ ఫైనల్



కొలంబో: నిదహాస్ కప్ ముక్కోణపు ట్వంటీ టోర్నమెంట్ తుది సమరానికి భారత్, బంగ్లాదేశ్ సిద్ధమయ్యాయి. ఆతిథ్య శ్రీలంక జట్టును ఓడించి ఫైనల్‌కు చేరిన బంగ్లాదేశ్ పటిష్టమైన భారత్‌తో అమీతుమీకి తహతహలాడుతోంది. మరోవైపు వరుసగా మూడు మ్యాచులు గెలిచి ఫైనల్‌కు చేరిన టీమిండియా తుది సమరంలోనూ జయకేతనం ఎగుర వేయాలనే పట్టుదలతో ఉంది. లీగ్ దశలో బంగ్లాదేశ్‌ను రెండు సార్లు చిత్తు చేసిన రోహిత్ సేన ఫైనల్లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. మరోవైపు లంకపై చిరస్మరణీయ విజయాలు సాధించిన బంగ్లా కూడా సంచలనం సృష్టించేందుకు సిద్ధమైంది. కిందటి మ్యాచ్‌లో ఓటమి అంచుల వరకు వెళ్లి జయకేతనం ఎగుర వేసిన బంగ్లా ఫైనల్లో భారత్‌ను కంగు తినిపించేందుకు అతృతతో ఎదురు చూస్తోంది. ఇరు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో టైటిల్ సమరం అభిమానులకు కనువిందు చేయడం ఖాయం.

జోరు సాగించాలి...

బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో చెలరేగి ఆడిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫైనల్లో కూడా అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమయ్యాడు. బంగ్లాదేశ్‌పై విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగిన రోహిత్ ఈసారి కూడా జట్టును ముందుండి నడిపించేందుకు రెడీ అయ్యాడు. ఒంటి చేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ విజృంభిస్తే కట్టడి చేయడం బంగ్లా బౌలర్లకు చాలా కష్టమనే చెప్పాలి. రోహిత్‌పై భారత్ భారీ ఆశలే పెట్టుకుంది. ఇక, అద్భుత ఫాంలో ఉన్న మరో ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ టోర్నీలో ధావన్ నిలకడైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఫైనల్లో చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. ఇక, సీనియర్ ఆటగాడు సురేశ్ రైనా కూడా జోరు మీదున్నాడు. బంగ్లాపై మెరుపు ఇన్నింగ్స్ ఆడిన రైనా ఫైనల్లో కూడా చెలరేగాలనే లక్ష్యంతో కనిపిస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో రాణించడం ద్వారా జట్టులో తన స్థానాన్ని మరింత శాశ్వతం చేసుకోవాలని భావిస్తున్నాడు. యువ ఆటగాడు కెఎల్.రాహుల్ కూడా సత్తా చాటాలనే ఉద్దేశంతో ఉన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్థానాన్ని పదిలం చేసుకునేందుకు రాహుల్ సిద్ధమయ్యాడు. మరోవైపు మనీష్ పాండే ఫాంలో ఉండడం భారత్‌కు కలిసి వచ్చే అంశమే. ఒంటిచేత్తో మ్యాఛ్ ఫలితాన్ని భారత్‌కు అనుకూలంగా మార్చడంలో మనీష్ సఫలమయ్యాడనే చెప్పాలి. భారత్‌ను ఫైనల్‌కు చేర్చడంలో మనీష్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఫైనల్లో కూడా జోరును కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఇక, ఇప్పటి వరకు బ్యాటింగ్ చేసే అవకాశాలు రాని యువ ఆటగాడు విజయ్ శంకర్ కూడా ఛాన్స్ లభిస్తే సత్తా చాటేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాడు. ఇప్పటికే బౌలింగ్‌లో సత్తా చాటిన శంకర్ బ్యాటింగ్‌లో కూడా తానెంటో నిరూపించేందుకు సిద్ధమయ్యాడు. ఇక, దినేష్ కార్తీక్ కూడా జోరుమీదుండడం భారత్‌కు కలిసి వచ్చే అంశమే. అతను చెలరేగితే భారీ లక్ష్యాన్ని ఛేదించడం, లక్ష్యాన్ని నిర్దేశించడం భారత్‌కు కష్టమేమి కాదు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే బ్యాట్స్‌మెన్‌తో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

రాత్రి 7 గంటల నుంచి డిడి స్పోర్ట్స్, డిడి నేషనల్‌లలో ప్రత్యక్షప్రసారం

బౌలర్లు జోష్ మీదున్నారు...

ఇక, భారత బౌలర్లు టోర్నమెంట్‌లో నిలకడైన బౌలింగ్‌తో జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. యువ ఫాస్ట్ బౌలర్లు శార్దూల్ ఠాకూర్, విజయ్ శంకర్‌లు చక్కటి బౌలింగ్‌తో జట్టుకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు కూడా గెలిచి తామెంటో నిరూపించారు. శార్దూల్ నిలకడైన బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఒకవైపు పొదుపుగా బౌలింగ్ చేయడమే కాకుండా కీలక సమయంలో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్లను ఆత్మరక్షణలో పడేస్తున్నాడు. ఫైనల్లో కూడా అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమయ్యాడు. శంకర్ కూడా సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాడు. ఇక, ఆడిన అన్ని మ్యాచుల్లో పొదుపుగా బౌలింగ్ చేసిన యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ ఫైనల్ మ్యాచ్‌కు కూడా కీలకంగా మారాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే చాహల్ కూడా జట్టును ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. వీరిద్దరూ విజృంభిస్తే బంగ్లాదేశ్‌ను కట్టడి చేయడం భారత్‌కు కష్టంగా కాదు. అయితే మహ్మద్ సిరాజ్, జైదేవ్ ఉనద్కట్‌లు విఫలం కావడం ఒక్కటే భారత్‌కు కాస్త ఆందోళన కలిగించే అంశం. కానీ, ఈసారి ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చెలరేగేందుకు ఇద్దరు సిద్ధంగా ఉన్నారు.



సంచలనం కోసం..

మరోవైపు లంకపై చిరస్మరణీయ విజయంతో ఫైనల్‌కు చేరిన బంగ్లాదేశ్ జట్టులో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కిందటి మ్యాచ్‌లో చెలరేగి ఆడిన తమీమ్ ఇక్బాల్, మహ్మదుల్లాలు ఫైనల్లోనూ సత్తా చాటాలనే పట్టుదలతో కనిపిస్తున్నారు. సాకిబ్ రాకతో బంగ్లాదేశ్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. బ్యాట్‌తో, బంతితో మ్యాచ్ ఫలితాన్ని శాసించే సాకిబ్ ఫైనల్లో జట్టుకు కీలకంగా మారాడు. ఇక, తమీమ్, లిటన్ దాస్, సౌమ్య సర్కార్, షబ్బీర్ రహెమాన్ తదితరులతో బంగ్లాదేశ్ బ్యాటింగ్ చాలా బలంగా ఉంది. సీనియర్ ఆటగాళ్లు తమీమ్, ముష్ఫికుర్ రహీం, మహ్మదుల్లాలు జోరు మీదుండడం బంగ్లాకు ఊరటనిచ్చే అంశం. లంకపై చెలరేగిన మహ్మదుల్లా ఫైనల్లో కూడా విజృంభించాలనే లక్ష్యంతో సిద్ధమయ్యాడు. రహీం కూడా దూకుడు మీదున్నాడు. సాకిబ్ రూపంలో ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్ ఉండనే ఉన్నాడు. దీంతో బంగ్లాదేశ్ కూడా భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమైంది.

ఉప్పల్‌లో డే-నైట్ టెస్ట్?



ముంబయి: భారత్‌లో తొలి సారి నిర్వహించే డే–నైట్ టెస్టుకు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం ఆతిథ్యం ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ ఏడాది చివర్లో విండీస్‌తో జరిగే సిరీస్‌లో హైదరాబాద్ లేదా రాజ్‌కోట్‌లలో డే–నైట్ టెస్టు మ్యాచ్‌ను నిర్వహించాలని భారత క్రికెట్ బోర్డు భావిస్తోంది. 2018–19 సీజన్‌లో భారత్‌లో జరిగే మ్యాచ్‌ల వేదికలను ఖరారు చేసేందుకు భారత బోర్డు శనివారం సమావేశమైంది. కాగా, విండీస్‌తో జరిగే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో ఒక మ్యాచ్‌ను డే–నైట్ పద్ధతిలో నిర్వహించాలని బిసిసిఐ నిర్ణయం తీసుకుంది. ఇదిలావుండగా హైదరాబాద్, రాజ్‌కోట్ నగరాల్లో ఏదో ఒకదాంట్లో ఈ టెస్టు నిర్వహించాలని భావిస్తోంది. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే దీనికి సంబంధించి తు ది ప్రకటన ఇస్తామని బిసిసిఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారత్‌లో ఇప్పటి వరకు ఒక్క సారి కూడా డే–నైట్ టెస్టు మ్యాచ్‌లు జరుగలేదు. అంతేగాక భారత్ కూడా ఇప్పటి వరకు ఒక్క డే–నైట్ టెస్టు కూడా ఆడలేదు. దీంతో ఈసారి దీనికి శ్రీకారం చుట్టాలని భారత బోర్డు భావిస్తోంది. కాగా, భారత్‌లో ప్రయోగాత్మకం గా నిర్వహించాలని భావిస్తున్న డే–నైట్ టెస్టుకు సు ప్రీం కోర్టు నేతృత్వంలోని పాలకుల కమిటీ ఆమోదం లభించాల్సి ఉంది. వారి అనుమతి లభిస్తే తొలి డే–నైట్ మ్యాచ్‌కు లైన్ క్లియర్ అవుతుంది. ఈ విషయాన్ని బిసిసిఐ కార్యదర్శి అమితాజ్ చౌదర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, నవంబర్‌లో భారత్‌లో పర్యటించే విండీస్ రెండు టెస్టులు, ఆరు వన్డేలు, మరో మూడు ట్వంటీ–20 మ్యాచ్‌లు ఆడుతుంది. దీనికి సంబంధించిన వేదికలను బిసిసిఐ ఖరారు చేసింది. అంతేగాక ఆస్ట్రేలియాతో కూడా వచ్చే ఏడాది ప్రారంభంలో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను నిర్వహిస్తున్నారు. మొహాలి, హైదరాబాద్, నాగ్‌పూర్, ఢిల్లీ, రాంచీ నగరాలు ఈ సిరీస్‌లో వేదికలుగా ఉంటాయి. అంతేగాక ఇరు జట్ల మధ్య రెండు టి–20 మ్యాచ్‌లు కూడా జరుగుతాయి. విశాఖపట్నం, బెంగళూరు నగరాల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

విహారి, జయంత్ పోరాటం

రెస్ట్ 236/6, విదర్భతో ఇరానీ సమరం



నాగ్‌పూర్: విదర్భతో జరుగుతున్న ఇరానీ ట్రోఫీ సమరంలో రెస్టాఫ్ ఇండియా ఎదురీదుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన రంజీ చాంపియన్ విదర్భ ఏడు వికెట్ల నష్టానికి 800 పరుగుల రికార్డు స్కోరును సాధించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. వసీం జాఫర్ (286) డబుల్ సెంచరీ సాధించాడు. మరోవైపు గణేష్ సతీష్ (120), అపూర్వ్ వాంఖేడె 157 (నాటౌట్) శతకాలతో కదం తొక్కారు. దీంతో విదర్భ రికార్డు స్థాయిలో భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన రెస్ట్ జట్టు శనివారం నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసి కష్టాల్లో చిక్కుకుంది. ఒక దశలో 98 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన జట్టును హనుమ విహారి, జయంత్ యాదవ్‌లు చిరస్మరణీయ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. రజ్నీష్ గుర్బాని అసాధారణ బౌలింగ్‌తో రెస్ట్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ పృథ్వీ షా పోరాటం కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన పృథ్వీ షా ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 51 పరుగులు చేశాడు. చివర్లో విహారి, జయంత్‌లు మారథాన్ ఇన్నింగ్స్‌లతో రెస్ట్‌కు అండగా నిలిచారు. సమన్వయంతో బ్యాటింగ్ చేసిన హనుమ విహారి 171 బంతుల్లో పది ఫోర్లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. జయంత్ 147 బంతుల్లో 9 బౌండరీలతో 62 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. వీరద్దరూ ఏడో వికెట్‌కు అభేద్యంగా 138 పరుగులు జోడించారు. కాగా, విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే రెస్ట్ మరో 564 పరుగులు చేశారు. ఆదివారం ఆటకు చివరి రోజు కావడంతో మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.